ప్రజాశక్తి

సైద్ధాంతిక బులెటిన్

కేంద్రీకరించాల్సిన నాలుగు అంశాలు

చమురుపై పెత్తనం కోసమే ఈ యుద్ధం

మార్క్స్-చరిత్ర (120 వ వర్థంతి సందర్భంగా ...)

వేతనాలు పాతాళానికి...ఆహార భద్రత ఆకాశానికి...

గుజరాత్ నరమేధంపై చట్టపర చర్య తీసు కోలేమా?

భారత బడా బూర్జువావర్గం దళారీగా మారిందా ?

కార్పొరేట్ క్రీడా జగత్తు

ఉక్కుమనిషి ఉజ్వల జీవితం

ప్రాచీన భారతంలో ఆహారపు అలవాట్లు

గోవధపైనేనా మనుషుల వధపై వద్దా నిషేధం?

మార్చి 2003

వెల. రూ.

ఉక్కు మనిషి ఉజ్వల జీవితం

హిరేన్ ముఖర్జీ

జారిస్టు రష్యాలో భాగమైన జార్జియాలోని చిన్న పట్టణం గోరీలో 1879 డిసెంబర్ 23న ఒక అబ్బాయిపుట్టాడు. అతనే భవిష్యత్తులో చరిత్ర ప్రసిద్ధుడు కానున్న జోసఫ్ విసారినోవిచ్ జుగాష్విలి. స్టాలిన్ పేరుతో ఆయన ఖ్యాతిగాంచాడు. అంటే ఉక్కు మనిషి అని అర్థం. ఆయన తండ్రి స్వగ్రామంలో ఒక అర్థబానిస. 1836లో జార్ ఇచ్చిన ఉత్తర్వుతో అతను విడుదలయ్యాడు. గోరీలో చెప్పులు కుట్టుకుని బతికేందుకు వెళ్ళాడు. తల్లి ఎకటెరీనా. ఆమె చాలా కాలం బ్రతికింది. కొడుకు ఘనతను కొంత వరకు చూడగలిగింది. ఆరోజుల్లో ఆమె చాకిరీ చేస్తే గాని పొట్ట నిండేది కాదు. ఇళ్ళలో ఆమె బట్టలు ఉతికేది. చిన్న వయసులోను ఆమెకు పెళ్ళయింది. ముగ్గురు పిల్లలు పుట్టగానే చనిపోయారు. బ్రతికి బట్టగట్టింది నాలుగోవాడైన జోసఫ్ మాత్రమే. అందుకే అతని పట్ల చాలా గారాబం. అతని తెలివితేటలు చూసి అమ్మా, నాన్న భవిష్యత్ గురించి చాలా కలలు గన్నారని అనుకోవచ్చు. జార్జియా రాజధాని ట్రిఫ్లిస్‌లోని మత సంస్థ నడిపే కులీనుల పాఠశాలలో జోసఫ్‌ను చేర్పించి, ప్రతి కోపెక్కు కూడబెట్టి పంపించేవారు. చెప్పులు కుట్టేవాడి కొడుకు ఆ విధంగా చదువుకోవడమే అసాధారణమైన విషయం. స్కూలులో ఉన్నత వర్గాల పిల్లలు అతన్ని చులకన చేసేవారు. వారంతా రష్యన్లు ఆర్మీనియన్లు లేదా యూదులు. జార్జియా నుంచి అప్పటింకింకా బూర్జువా వర్గం పైకి రాలేదు. సుమారైన భూస్వాములు చాలా కొందిమంది లేదా అర్థబానిసలకు చెందిన వారు వుండేవారు. జోసఫ్ తెలివైన విద్యార్థి. బైబిల్‌నే గాక అన్ని సబ్జెక్టులకు బాగా చదివేవాడు. తొందరలోనే అతనికి జారిస్టు వ్యతిరేక బృందాలతో సంబంధం ఏర్పడింది. విప్లవ సాహిత్యం చదువుతూ మతాధికారులకు దొరికిపోయేవాడు. చివరకు బడినుంచి వెళ్లగొట్టారు. 1897లోనే 18వ ఏట టిబిల్సి (టిఫ్లిస్) మార్క్సిస్టు బృందం నాయకుడయ్యాడు. 1900 సంవత్సరంలో జార్జియా పార్టీ కమిటీ సభ్యుడై విప్లవ జీవితం ప్రారంభించాడు. దీర్ఘకాలం పాటు అరెస్టులు, [illegible]వాసాలు, కస్టడీల నుంచి [illegible]జ్ఞాత కార్యకలాపాలతో విప్లవ జీవితం సాగించాడు. ముక్తసరిగా, మితభాషిగా, అంతర్ముఖుడుగా, వాగాడంబరం గిట్టని వ్యక్తిగా, నిరావేశంగా వుండేవాడు. కవిత్వం కూడా రాశాడు గాని కొనసాగించలేదు.



స్టాలిన్ 50వ వర్ధంతి సందర్భంగా

స్టాలిన్ జీవిత చరిత్ర సరైంది ఒక్కటీ లేదు. దాన్ని సమగ్రంగా చెప్పాలంటే సంపుటాలు కావాలి. అట్టడుగు నుంచి ఆటుపోట్లు అధిగమించి అత్యున్నత శిఖరాలకు చేరిన అరుదైన, అద్భుత జీవితమది. 1890లో స్టాలిన్ కాకసస్‌లో మేడే ఉత్సవాలు మొదటిసారిగా నిర్వహించాడు. పత్రికలకు వ్యాసాలు రాశాడు. 'కాటా' అనే రహస్యనామంతో పనిచేస్తూ పార్టీ కార్యవర్గానికి ఎన్నికైనాడు. కార్మికోద్యమంలోను, రహస్య పత్రికా నిర్వహణ, ప్రచార కార్యక్రమాలలోనూ పాల్గొన్నాడు. క్రింది స్థాయిలో మంచి అనుభవం సంపాదించాడు. 1902లో ఆయనను అరెస్ట్ చేసి తూర్పు సైబీరియాకు ప్రవాసం పంపించారు. అప్పటి నుంచీ పదే పదే అరెస్టులు, ప్రవాసాలు తప్పలేదు. అనేకసార్లు తప్పించుకుని అజ్ఞాత వాసంలోకి జారుకున్నాడు. 1900-1917 మధ్య కాలంలో సగభాగం జారిస్టు జైళ్ళలో గడిపిన ఆ జార్జియన్ అప్పటికే పేరు తెచ్చుకున్నాడు. ఫిన్లాండ్‌లో జరిగిన బోల్షివిక్ పార్టీ మహాసభలో లెనిన్‌ను తొలిసారి కలుసుకున్నారు. 1906 స్టాక్ హోం 1907 లండన్‌లలో జరిగిన పార్టీ మహాసభలలో కూడా పాల్గొన్నారు. అప్పటి వరకు పెట్టుకున్న ప్రచ్ఛన్న నామాల బదులు స్టాలిన్ పేరునే స్వీకరించాడు. లెనిన్ చొరవపై ఆయనను కేంద్ర కమిటీకి ఎన్నుకున్నారు. క్రాక్, వియన్నా తదితర చోట్ల జరిగిన పార్టీ అత్యున్నత సమావేశాలకు హాజరయ్యాడు గాని మొత్తంపైన విదేశీ పర్యటనల పట్ల ఆయనకు ఆసక్తి వుండేదికాదు. రోజువారీ పనిలో ఎక్కువగా మునిగిపోయేవాడు. లెనిన్ పట్ల దాదాపు ఆరాధనభావం పెంచుకున్నాడు. లెనిన్ మినహా మిగిలిన ప్రవాస రష్యన్ విప్లవకారుల పట్ల స్టాలిన్‌లో ఒక విధమైన అయిష్టత ఏర్పడినట్లు కన్పిస్తుంది.

ప్రాచ్యదేశాల నుంచి విప్లవకారులను రాబట్టాలని లెనిన్ ఎప్పుడూ ఆలోచిస్తుండేవాడు. స్టాలిన్ గురించి తెలుసుకోగానే, "ఒక అద్భుతమైన జార్జియన్" దొరికాడని ఆయన తన మిత్రుడు మాగ్జిం గోర్కీకి రాశాడు. దుష్ప్రచారాలు ఎలా వున్నప్పటికీ, స్టాలిన్‌ను కేంద్ర కమిటీలో చేర్చింది. 'ప్రావ్దా' పత్రిక బాధ్యత అప్పగించిందీ లెనినే. అత్యంత ప్రతిభావంతుడైన, వంకరబుద్ధి గల ట్రాట్స్కీ లెనిన్‌పై దాడిచేసినప్పుడు ఆయన ఆమోదంతోనే స్టాలిన్ 1913, జనవరి 12న ట్రాట్స్కీకి గట్టి సమాధానమిచ్చారు. "వాపు తప్ప బలుపు లేని వాగాడంబరపు మొనగాడు" అని ఆయన చేసిన నిశిత విమర్శను ట్రాట్‌స్కీ జన్మలో మరచిపోలేదు. మంచికైనా చెడ్డకైనా సోవియట్ చరిత్రలోనే ప్రసిద్ధమైన సైద్ధాంతిక సంఘర్షణకు అది నాంది. అయితే ట్రాట్స్కీకీ మాత్రం తన గొప్పతనం గురించి ఎలాంటి సందేహం లేదు. "ఈ లెనిన్ ఎలాంటి మందమతులను, వాజమ్మలను వెంటేసుకుని తిరుగుతున్నాడు" అని అతను వ్యాఖ్యానించాడు.

తర్వాత దశలో స్టాలిన్ అనేక తీవ్రమైన ఆరోపణల పరంపరను ఎదుర్కొన్నాడు.పొలిట్ బ్యూరో పాలిట ఛెంగిజ్ ఖాన్ అని, ఆసియాటిక్ అని "భయానకుడైన ఇవాన్" అని తిట్టిపోశారు. ఇతరులందరినీ అదుపులో వుంచగల శక్తి లెనిన్‌కున్న రోజుల్లో కూడా ఈ దాడి ఆగలేదు. యూరోపియన్లకు సహజంగా వుండే అసహ్యాన్ని స్టాలిన్ పట్ల చూపించారు. "సిద్ధాంతానికి నీకు ఏం సంబంధం లేదు" అని రైకీ ఒకసారి అన్నాడు. అయితే స్టాలిన్‌ది దృఢమైన వ్యక్తిత్వం. ఏది ఏమైనా

(మిగతా 27వ పేజీలో)

లోపలిపేజీల్లో...

ప్రజాశక్తి సాహితీసంస్థ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు : వి.కృష్ణయ్య
సంపాదకులు : వి. శ్రీనివాసరావు
ముద్రణ :
ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్,
1-1-60/2, ఆర్టీసీ క్రాస్ రోడ్స్,
హైదరాబాద్ -20
ఫోన్ : ఎడిటోరియల్ 7665420, 7663761
మేనేజర్: 7673787
ఫ్యాక్స్ : 7639921
EMail :
Prajasakti@hotmail.com
PRAJASAKTI,Hyderabad,
RNI,Regd.No.52973/94
visit PRAJASAKTI at :
www.prajasakti.com

త్రిపుర విజయం రాజకీయ సుస్థిరతకు చిహ్నం

పాలకవర్గాలు తమ వైఫల్యాలను, అసమర్ధతను కప్పెట్టుకోడానికి 'యాంటీ ఎస్టాబ్లిష్‌మెంటు' సిద్ధాంతాన్ని ముందుకు తెస్తున్నారు. అధికారంలో ఎవరున్నా వ్యతిరేకత తప్పదని, ప్రజలు మార్పుకోసం ప్రతిసారీ ఒకరిని గెలుపిస్తుంటారనీ, అది సహజమని అంటున్నారు. ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ చెడుగులను అర్ధం చేసుకోలేని ప్రజలు వాటిని ఆయా రాజకీయపార్టీలనే బాధ్యులుగా చూడటం వలన ఒక పార్టీ స్థానంలో మరొక పార్టీని గెలిపిస్తున్నారు. మార్కెట్‌లో సరుకుల బ్రాండుల మాదిరి పార్టీ బ్రాండులను ముందుకు తెస్తుంటారు. ఒక బూర్జువా పార్టీకి మరొక బూర్జువా పార్టీని కొత్త అవతారంతో జనం ముందుకు తెస్తుంటారు. ఒక వ్యక్తి స్థానంలో మరో వ్యక్తికి రంగులు అద్ది ఫోకస్ చేస్తారు. మీడియా వీరికి సహకారంగా ఉంటుంది. అలా కొంతకాలం నడిపిస్తారు. రాజకీయశూన్యం ఏర్పడితే దాన్ని పూడ్చడానికి వామపక్షాలను ఎదిగిరాకుండా చేయడానికి కొత్త పార్టీలను సృష్టిస్తుంటారు. అలా నిరంతరం తమ వర్గపాలనను సాగించుకోడానికి తహతహలాడుతుంటారు. అందుకోసం ఎంతకైనా తెగిస్తుంటారు. తాజా ఎన్నికలే అందుకు ఉదాహరణ. గుజరాత్‌లో అధికారం కోసం బిజేపీ మతకల్లోలాలు సృష్టిస్తే, త్రిపురలో అధికారం కోసం కాంగ్రెసు ఉగ్రవాదులతోనే చేతులు కలిపింది. అదే వారి కొంప ముంచిందనుకోండి. సిపిఎంకి వ్యతిరేకంగా ఎన్‌పిటిఇ అనే కొత్త పార్టీ అక్కడ పుట్టుకొచ్చింది. చైతన్యవంతులైన త్రిపుర ప్రజలు కాంగ్రెసును ఎక్కడ పెట్టాలో అక్కడే పెట్టారు. తొలినుండీ ఈ అవకాశవాద వైఖరే వారిని ఈ పతనావస్థకు చేర్చింది. బిజేపి కానీ కాంగ్రెసు కానీ అవసరార్థం ఉగ్రవాద వ్యతిరేక పోరాటాన్ని ఆశ్రయించాయి తప్ప నిజంగా పోరాడేశక్తి వారికి లేదు. ఒకరు మతోన్మాద ఉగ్రవాదులైతే మరొకరు అవకాశవాదంతో ఉగ్రవాదానికి పాలుపోసి పెంచి పోషించిన వారు. ఇలాంటి పార్టీలు దేశానికి సుస్థిరపాలన అందిస్తాయనుకోవడం ఒట్టి భ్రమ.

గత కొంతకాలంగా దేశం అస్థిరతతో కొట్టుమిట్టాడుతోంది. దేశానికి సుస్థిరత అందిస్తానని బిజేపీ నమ్మబలికి అధికారాన్ని చేపట్టింది. ఆచరణలో అది కాంగ్రెసు కన్నా ముదనష్టంగా మారింది. రాజకీయ అస్థిరత పార్టీలను బట్టి రాదు. దాని విధానాలను బట్టి వస్తుంది. ప్రస్తుత రాజకీయ అస్థిరత ఆర్థిక అస్థిరత నుండి పుట్టుకొచ్చింది. కాంగ్రెసు, బిజేపీ రెండూ ఒకే విధమైన ఆర్థిక విధానాలను అనుసరిస్తున్నాయి. అందువల్ల ఆరెండు పార్టీలూ రాజకీయ సుస్థిరతను ఇవ్వలేవని రుజువైంది. కాకుంటే ఏ ప్రత్యామ్నాయం లేని చోట ప్రజలు గత్యంతరం లేక ఒకదానికి బదులుగా మరోపార్టీని గెలిపిస్తున్నారు. అలా కొంతకాలం నెట్టుకొస్తున్నారు. అదే బెంగాల్‌లో కానీ, త్రిపురలో కానీ వారు చెప్పే యాంటీ ఎస్టాబ్లిష్‌మెంటు సిద్ధాంతం పనిచేయడం లేదు. కారణం ఈ దేశానికి అవసరమైన ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలను వామపక్షాలు సమర్ధవంతంగా అందించగలుగుతున్నాయి. ఈ బూర్జువా రాజ్యాంగ చట్రంలోనే అవకాశం ఉన్నంతమేరకు ప్రజానుకూల విధానాలు అమలు జరిపి చూపించి శభాష్ అనిపించుకుంటున్నాయి. రాజకీయ అవినీతిని దరిచేరనీయకుండా తమ విశిష్టతను చాటుకుంటున్నాయి. అరచేతిలో వైకుంఠం చూపించి తాము చేయలేని వాగ్దానాలు చేసి సోషలిజం సాధించిపెడతామని వారు అబద్ధాలు చెప్పడం లేదు. ప్రధానంగా ఫ్యూడల్ భూసంబంధాలను నిర్మూలించడం పైన కేంద్రీకరించాయి. ప్రజలను అధికారంలో నిజంగా భాగస్వాములను చేసే పంచాయతీ పాలనను ప్రత్యామ్నాయంగా అమలుజరిపి చూపించాయి. ఆ తర్వాతనే దేశమంతా తామూ అమలు జరుపుతున్నట్లు పాలకవర్గాలు ఫోజులివ్వాల్సివచ్చింది. ఇప్పుడు దాన్ని నీరుకార్చేందుకు బహుళజాతి కంపెనీల అవసరాలు తీర్చే వివిధరకాల స్వయంసహాయ బృందాలను(సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్)ను ఏర్పాటు చేసి పంచాయతీ స్ఫూర్తిని ఒక పథకం ప్రకారం దెబ్బతీస్తున్నారు. దీన్ని బూర్జువా మేధావులు సైతం ఆక్షేపిస్తున్నారు. వామపక్ష పాలనలో మత ఘర్షణలు లేవు. దళిత, గిరిజనులపై దాడులు, అత్యాచారాలు లేవు. శాంతి, భద్రతలు ఏ రాష్ట్రం కన్నా సజావుగా ఉన్నాయని కేంద్రప్రభుత్వ నివేదికలే చాటుతున్నాయి. ఈ విధంగా ఉన్న పరిమితుల్లోనే ఎన్నో విశిష్ట లక్షణాలు కలిగిన వామపక్షాలు మాత్రమే ఈ దేశానికి ప్రత్యామ్నాయ వ్యవస్థను అందించగలుగుతాయని మరోసారి రుజువైంది. అంతేకాదు రాజకీయ సుస్థిరత కూడా వీటివల్లే సాధ్యమవుతుందని త్రిపుర ఫలితాలతో మరోసారి రుజువైంది. ఇదే మారుమూలనున్న చిన్న రాష్ట్రమైన త్రిపుర దేశానికి అందిస్తున్న పెద్ద సందేశం.

వి. శ్రీనివాసరావు
ఎడిటర్

ప్రాచీన భారతంలో ఆహారపు అలవాట్లు

డి. ఎన్. ఝా

పశు సంపద, వాటి యాజమాన్యం అనేవి సామాజిక శాస్త్రవేత్తలకు, మానవ ధర్మ శాస్త్రవేత్తలకు, ఆర్థిక నిపుణులకు, ఇతర విధానకర్తలకు సంబంధించిన అంశం అయినప్పటికీ ఆనాటి నుంచీ ఆవు భారత రాజకీయ రంగం మీద ఒక సమస్యగా కొనసాగుతూ వస్తోంది.

క్రమేణా ఆవు హిందువుల మత చిహ్నంగా స్థిరపడిపోయింది. అయితే ఈనాడు ఇంత పవిత్రమైనదిగా భావించబడే ఆవును అలనాటి వేదకాలంలోనూ, ఆ తదనంతరపు బ్రాహ్మణ, బ్రాహ్మణేతర సంప్రదాయాలలోనూ అంత పవిత్రంగా ఏమీ చూడలేదనే వాస్తవాన్నీ సనాతన వాదులు అంగీకరించరు.

ఈనాటి సగటు భారతీయుడు - తన పూర్వీకులు... ప్రత్యేకించి వేదకాలం నాటి ఆర్యులు స్వతసిద్ధంగా పవిత్రమైన ఆవును ఆరాధించేవారనీ, ఆ సంప్రదాయమే తనకు హిందూ వారసత్వం రూపంలో సంక్రమించిందనీ అపోహపడుతుంటాడు. 'పవిత్రమైన' ఆవు క్రమేణా హిందువులకు ఒక మతపరమైన గుర్తింపు చిహ్నంగా మారిపోయింది. గోమాంస భక్షకులైన మహ్మదీయుల వల్ల ఆ సాంస్కృతిక వారసత్వానికి ప్రమాదం ఏర్పడుతోందని చాలామంది భావిస్తుంటారు. అందుకే ఆవు 'పూజనీయత' గురించి తరచూ నొక్కి చెబుతుంటారు. అలా చెప్పేప్పుడు దైవాంశ సంభూతమైనవిగా, విజ్ఞాన భాండాగారాలుగా పరిగణించబడే వేదాలను పొరపాటుగా ఉటంకిస్తుంటారు.

క్రమేణా పాలకుల చేతుల్లో ఆవు ఒక రాజకీయ సాధనంగా మారుతూ వచ్చింది. ఆవును పూజ్య భావంతో చూసే జైనుల లేదా బ్రాహ్మణుల విశ్వాసాన్ని గౌరవించేందుకుగాను మొగలాయి పాలకులు (బాబర్, జహంగీర్, ఔరంగజేబు మొ॥) గోవధపై పరిమిత నిషేధాన్ని విధించినట్టు చెబుతారు. అలాగే, ఆవునూ బ్రాహ్మణులనూ రక్షించేందుకు అవతరించినవాడిగా భావించబడే ఛత్రపతి శివాజీ "మనం హిందువులం. ఈ రాజ్యానికి స్వతస్సిద్ధ పాలకులం. అలాంటి మన కళ్ళముందే ఆవులను వధిస్తూ, బ్రాహ్మణులను అణచివేస్తూ వుంటే చూస్తూ వూరుకోవడం మంచిదికాదు" అని ప్రకటించినట్టు చెబుతారు.

పంజాబ్‌లో 1870 ప్రాంతంలో సిక్కు కుకా (లలిదా నామ్‌ధారీ) తెగ ఆవిర్భవించి, హిందూ గో సంరక్షణ ఉద్యమాన్ని మొదలుపెట్టినప్పటినుంచీ రాజకీయ జన సమీకరణకు ఆవు ఒక సాధనంగా మారింది. ఆ తరువాత 1882లో మొట్టమొదటి 'గోరక్షిణి సభ'ను స్థాపించి స్వామి దయానంద సరస్వతి అశేష జన బాహుళ్యాన్ని సంఘటిత పరిచేందుకు ఆవును మరింత బలమైన ప్రతీకగా తీర్చిదిద్దాడు. దరిమిలా 1880లలోనూ 1890లలోనూ ముస్లింలు చేసే గోవధను ఎదిరించడం, తత్ఫలితంగా మతకలహాలు చెలరేగడం జరిగింది. గోవధ పట్ల అంతకు పూర్వం కూడా వ్యతిరేకత వున్నప్పటికీ 1888లో వాయవ్య రాష్ట్రాల హైకోర్టు ఆవు పవిత్రమైనదేం కాదు అనే తీర్పు వెలువరించిన తరువాతనే గోసంరక్షణ ఉద్యమం నాటకీయంగా మలుపు తిరిగి బలపడిందని చెప్పవచ్చు. నాటినుంచే తరచుగా అనేక హిందూ ముస్లిం గొడవలకు గోవధ అనే అంశమే ప్రధాన కారణం కావడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. 1893లో ఆజంఘర్ జిల్లాలో ఇలాంటి గొడవలే చెలరేగినప్పుడు వివిధ ప్రాంతాలలో వందకు పైగా జనం హతులయ్యారు. ఆ తరువాత 1912-13లో అయోధ్యలోనూ, 1917లో షహబాద్‌లోనూ ఇలాంటి హింసాత్మక సంఘటనలే చెలరేగి దారుణ మతకలహాలకు దారితీశాయి.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 'గోవులను, దూడలను, ఇతర పాలిచ్చే, లేదా బండ్లనులాగే జంతువులను వధించడాన్ని నిషేధించేందుకు రాష్ట్రాలు తగిన చర్యలు తీసుకోవాలని భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలలో పేర్కొనడం, అనేక రాష్ట్రాలు గోవధను నిషేధిస్తూ శాసనాలు చేయడం జరిగిన తరువాత కూడా గోవధ అనే అంశం పదేపదే భారత రాజకీయ రంగంమీద సమస్యాత్మకంగా ప్రత్యక్షమవుతూనే ఉంది. ఉదాహరణకి స్వాతంత్ర్యం వచ్చాక దాదాపు రెండు దశాబ్దాల అనంతరం 1966లో జాతీయ స్థాయిలో గోవధను నిషేధించాలన్న డిమాండుతో దేశంలోని దాదాపు అన్ని మతతత్వ పార్టీలు, సంస్థలు చేతులు కలిపి లోకసభ ముందు భారీ ప్రదర్శనను నిర్వహించాయి. ఆ ప్రదర్శన హింసాత్మకంగా మారడంతో ఎనిమిదిమంది మరణించారు. మరెంతోమంది గాయపడ్డారు. మహాత్మాగాంధీకి ఆధ్యాత్మిక వారసుడిగా పేరు గాంచిన ఆచార్య వినోబా భావే 1979 ఏప్రిల్‌లో దేశవ్యాప్తంగా గోవధను నిషేధించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చేందుకు ఆమరణ

వేదకాలం నాటి ఆర్యులు స్వతసిద్ధంగా పవిత్రమైన ఆవును ఆరాధించేవారనీ, ఆ సంప్రదాయమే తనకు హిందూ వారసత్వం రూపంలో సంక్రమించిందనీ అపోహపడుతుంటాడు. 'పవిత్రమైన' ఆవు క్రమేణా హిందువులకు ఒక మతపరమైన గుర్తింపు చిహ్నంగా మారిపోయింది. గోమాంస భక్షకులైన మహ్మదీయుల వల్ల ఆ సాంస్కృతిక వారసత్వానికి ప్రమాదం ఏర్పడుతోందని చాలామంది భావిస్తుంటారు.

నిరాహారదీక్షకు కూచున్నాడు. ఐదు రోజుల అనంతరం అప్పటి ప్రధానమంత్రి మొరార్జీ దేశాయ్ గోవధకు వ్యతిరేకంగా చట్టం తెచ్చేందుకు ప్రయత్నిస్తానని అస్పష్టమైన హామీ యిచ్చాక ఆయన తన నిరాహారదీక్షను ఉపసంహరించు కున్నాడు.

షిన్ తెగకు చెందినవాళ్లు అంటే పాకిస్థాన్‌లోని దర్దిస్థాన్ ప్రాంతపు ముస్లింలు పంది పట్ల ఇతర ముస్లింలు ఎలాంటి ఏహ్య వైఖరిని కనబరుస్తారో ఆవు పట్ల అలాంటి వైఖరినే కనబరుస్తుంటారు. వాళ్లు ఆవును ముట్టుకోరు. ఆవు పాలను తాగరు. ఆవుపేడను వంట చెరుకుగా కూడా వాడరు. ఆవు మాంసాన్ని అస్సలు తినరు.

కానీ అసలు ఉనికి అనేదే లేని అఖండ హిందుత్వానికి తామే అసలైన పరిరక్షకులుగా చెప్పుకునే సనాతనవాదులు, గోమాంసం తినే అలవాటు భారతదేశానికి విదేశాల నుంచి వలస వచ్చిన ముస్లింల ద్వారా సంక్రమించిందనీ, గోమాంస భక్షణని వాళ్ళే ప్రవేశపెట్టారనీ నమ్ముతారు. అయితే, వేదకాలంనాటి మన పూర్వీకులు కూడా విదేశాలనుంచి వలసవచ్చిన వాళ్లే అనే వాస్తవాన్ని గానీ, వాళ్లు ఇతర మాంసాలతో పాటు గోమాంసాన్ని కూడా ఆరగించేవారనే నిజాన్ని గానీ ఒప్పుకోరు. అంధ విశ్వాసాలు వాస్తవాలను మరుగుపరుస్తాయి. గోవధను జాతీయ స్థాయిలో నిషేధించాలనే అంశం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్), విశ్వ హిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఇంకా వాటి అనేక అనంగు సంస్థల ఎజెండాలో వుండటంలో ఆశ్చర్యం ఏమీ లేదు. కొంతకాలం కిందట ఎన్నికల జిమ్మిక్కుల్లో భాగంగా అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి (కేశూభాయ్ పటేల్) ఆవు సంతతినీ, హిందూ దేవాలయాలనూ సంరక్షించేందుకు ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తానని ప్రకటించాడు. ఈ మధ్య 2002 సంవత్సరపు బక్రీద్ పండుగ సందర్భంగా 30 లక్షల మంది కార్యకర్తలను సమీకరించి గోవధకు వ్యతిరేకంగా ఉద్యమిస్తానని ఒక భజరంగ్‌దళ్ నాయకుడు బెదిరించాడు. గోమాంసాన్ని తినకపోవడమే హిందూ మత విశిష్ట లక్షణంగా ప్రచారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సిక్కులు కూడా హిందువులే అని ఆర్ఎస్ఎస్ ప్రకటించినప్పుడు సిక్కు యువ నాయకుల నుంచి తీవ్ర వ్యతిరేకత పెల్లుబికింది. ఒక నాయకుడైతే ఏకంగా "మనం ఓ ఆవును వధించి గురుద్వారా లాంగర్‌లో ఎందుకు వడ్డించ కూడదు?" అని ప్రశ్నించాడు.

రాజకీయ వేదికలమీద ఆవు విషయమై ఇంత గందరగోళాన్ని సృష్టిస్తున్న మతతత్వవాదులు ఒకప్పుడు భారతదేశంలో గోమాంస భక్షణ సర్వసాధారణమైన విషయంగా వుండేదని, మన మత గ్రంధాలు, మన పూర్వీకుల రచనల్లోనే ఇందుకు ఆధారాలు వున్నాయని చెబితే ఒప్పుకోరు. భారతీయ మతపర ఆహార సంస్కృతి తాలూకు చారిత్రక నేపథ్యం విస్పష్టంగానే వుంది. గోమాంస భక్షణకు సంబంధించిన గ్రంథస్త ఋజువులను భారతదేశపు తొలి మతపర గ్రంథంగా భావించబడే ఋగ్వేదంలోంచే మేధావులు ఎత్తి చూపారు.

పంధొమ్మిదో శతాబ్దపు ప్రధమార్ధంలో హెచ్. హెచ్. విల్సన్ తన రచనల్లో ఇలా పేర్కొన్నాడు: "ప్రాచీన కాలపు హిందూ సాంప్రదాయం ప్రకారం గోమేధ లేదా అశ్వమేధ యాగాల్లో గోవును లేదా గుర్రాన్ని బలి యివ్వడం సర్వసాధారణమైన అంశంగా వుండేది." అలాగే భారతీయ ఆర్యులలో పశువులను వధించడం, వాటి మాంసాన్ని ఆరగించడం ఒక అలవాటుగా వున్న వైనాన్ని రాజేంద్రలాల్ మిత్రా తన రచనలో చాలా స్పష్టంగా వివరించారు. ఆ రచన మొదట జర్నల్ ఆఫ్ ద ఆసియాటిక్ సొసైటీ ఆఫ్ బెంగాల్‌లో ప్రచురించబడింది. ఆ తరువాత 1891లో "ది ఇండో ఆర్యన్స్" అనే పేరుతో వెలువడిన గ్రంథంలో ఒక అధ్యాయంగా చోటు సంపాదించుకుంది.

విలియం క్రూక్ అనే బ్రిటీష్ ప్రభుత్వోద్యోగి ప్రముఖ మత విశ్వాసాలకు, ఆచార వ్యవహారాలకు సంబంధించిన ఎంతో విలువైన మానవ శాస్త్ర సమాచారాన్ని సేకరించి 1894లో రెండు సంపుటాలుగా ప్రకటించారు. అందులో ఒక అధ్యాయం పూర్తిగా ఆవుతో సహా అన్ని రకాల జంతువులకు కేటాయించబడి వుంది.[9] ఆయనే 1912లో భారతదేశంలో ఆవు పవిత్రతకు సంబంధించిన ఒక వివరణాత్మక రచనను ప్రచురించారు. తన కాలంనాటి సమాజంలో గోమాంస భక్షణ అనే ప్రాచీన ఆచారం కొనసాగుతుండటం గురించి కూడా ఆయన ప్రస్తావించారు.

1927లో గో సంరక్షణ కోసం గట్టిగా పాటుబడ్డ ఎల్.ఎల్. సుందరరామ్ తన వాదనకు మద్దతుగా హిందూ మతంతో పాటు వివిధ మతాల గ్రంధాలనుంచి పలు అంశాలను సమీ కరించారు. గోవధ విషయమై ఆయన మహ్మదీయులను నిందించినప్పటికీ వేదకాలపు జనం గో మాంసాన్ని భుజించేవారన్న అంశాన్ని మాత్రం ఖండించలేదు.

'ధర్మశాస్త్ర చరిత్ర' అనే పేరుతో విశిష్ట పరిశోధనా గ్రంధాన్ని 1940 ప్రాంతంలో వెలువరించిన పి.వి. కాణే వేదకాలంలో గోవధ గురించి, గోమాంస భక్షణ గురించి తన ధర్మశాస్త్రంలో పేర్కొన్నారు. హెచ్.డి. సంకాలియా భారతదేశంలో ప్రాచీన కాలంలో పశుమాంసాన్ని తినేవారన డానికి సాహిత్యపరమైన, పురావస్తుపరమైన సాక్ష్యాధారాలను పేర్కొన్నారు. అదేవిధంగా, సుప్రసిద్ధ పండితుడు లక్ష్మణశాస్త్రి జోషి ప్రాచీన భారతదేశంలో గోమాంసంతో సహా ఇతర మాంసాలను భుజించేవారంటూ నిర్ద్వంద్వంగా వివరించిన ధర్మశాస్త్ర రచనల గురించి ప్రస్తావించారు.

ఈ మేధావుల మేధోసంపత్తిని అభిశంసించవలసిన పనిలేదు. వాళ్లకి హిందూ వ్యతిరేక భావజాలంతో ఎలాంటి సంబంధమూ లేదు. ఉదాహరణకు, హెచ్.హెచ్. విల్సన్ 1832లో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో సంస్కృత పీఠాన్ని అధిరోహించిన

రాజకీయ వేదికలమీద ఆవు విషయమై ఇంత గందరగోళాన్ని సృష్టిస్తున్న మతతత్వవాదులు ఒకప్పుడు భారతదేశంలో గోమాంస భక్షణ సర్వసాధారణమైన విషయంగా వుండేదని, మన మత గ్రంధాలు, మన పూర్వీకుల రచనల్లోనే ఇందుకు ఆధారాలు వున్నాయని చెబితే ఒప్పుకోరు. భారతీయ మతపర ఆహార సంస్కృతి తాలూకు చారిత్రక నేపథ్యం విస్పష్టంగానే వుంది.

గో వధ పైనేనా మనుషుల వధపై వద్దా నిషేధం?

1857లో సిపాయిల తిరుగుబాటు సంభవించడానికి గల ప్రధాన కారణాల్లో తుపాకి తూటాలకు ఆవు కొవ్వు, పంది కొవ్వును పూయడం ఒకటి. నిషిద్ధ మాంసం కొవ్వుతో తయారు చేసిన తూటాలను కొరుకుతున్నానని తెలియడంతో దైవభక్తిగల బ్రాహ్మణుడు మంగల్‌పాండే బ్రిటీష్ ప్రభుత్వంపై తిరుగుబాటు బావుటా ఎగుర వేశారు. ఆ కాలంలో తూటాలను వాడే ముందు వాటిని నోటితో కొరికి ఉపయోగించాలి. అయితే హిందువులు, ముస్లిమ్ కలిసి తిరుగుబాటు చేశారు. తిరుగుబాటుకు ఆవు నిర్ణయాత్మకమైన అంశం కాదు. నిజానికి బ్రిటీష్ పూర్వపు రోజుల్లో మొఘల్ స్థాపకుడు బాబర్‌తో సహా పలువురు సుల్తానులు గోవధపై నిషేధం విధించారు. గోవధ నిషేధంపై ఆర్య సమాజం ఉద్యమం ప్రారంభించడంతో గోవు రాజకీయాలు ప్రధాన స్థానమాక్రమించాయి. ఆవు నంరక్షణ కోనం మొదటిసారిగా 1882లో ఆర్య సమాజ్ స్థాపకుడు దయానంద సరస్వతి మొదటి సంస్థను స్థాపించాడు. తర్వాత పలు గోరక్ష సమితులు పుట్టుకొచ్చాయి. కొన్ని సమయాల్లో బలమైన కాంగ్రెస్ నేతల, మహారాజాల ఆదరణను కూడా పొందాయి. జాతి జనులను సమీకరించడంలో ఆవు అంశం ఒక అంతర్భాగమయింది. 1893లో మొదటి సారిగా తూర్పు ఉత్తరప్రదేశ్, బీహార్‌ల్లో పలు ప్రాంతాల్లో ప్రధానంగా రెండు అంశాల మీద కలహాలు చెలరేగాయి. అవి : గోసంరక్షణ, ఉర్దు–దేవనగరి. 1893 జూన్–జులైలో అజమ్‌ఘర్‌లో బక్రీదు పండుగ సందర్భంగా ముస్లింలపై ఘజీపూర్, బల్లియా జిల్లాల నుంచి వచ్చిన అల్లరి మూకలు దాడి చేశాయి. కలహాలు ఆ ప్రాంతమంతా వ్యాపించాయి. గోరఖ్‌పూర్ కమిషనర్ ఎం.ఎల్.ఫెర్రార్ 1893 దాడులపై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 'పలు ప్రాంతాల్లో గోవులను చంపమంటూ మహ్మదీయులు బలవంతంగా ఒక పత్రంలో సంతకం చేశారు. ఆ విధంగా వారు తమ శత్రువుల చేతుల్లో ఆస్తులు, ప్రాణాలను దక్కించుకున్నారు...'. భారత దేశంలో పెద్దఎత్తున మతఘర్షణలు జరగడం ఆదే మొదటిసారి. 1917లో గోవు కలహాలు మరింతగా దిగజారాయి. మరోసారి ఉత్తరప్రదేశ్, బీహార్‌ల్లో తీవ్రమైన దాడులు జరిగాయి. ఆ ఏడాది సెప్టెంబర్–అక్టోబర్‌లో బీహార్‌లో షాబాద్ జిల్లాలో దారుణమైన సంఘటనలు జరిగాయి. ముప్పై వేల మంది అల్లరి మూకలు ముస్లిమ్‌లను చంపుతూ, వారి ఆస్తులను లూటీ చేస్తూ మారణహోమానికి పాల్పడ్డాయి. బీహార్‌లో దాడులకు పాల్పడేవారు ఎప్పుడూ అగ్ర బ్రాహ్మణ, రాజ్‌పుత్, భూమిహార్ కులాలకు చెందిన వారని బ్రిటీష్ రికార్డులు చెబుతున్నాయి. దేశ విభజన సమయంలో ఆవు ప్రధానాంశం కానప్పటికీ, హిందూ, ముస్లిమ్ దుండగులు దీనిని తమ స్వార్ధ ప్రయోజనాల కోసం ఉపయోగించుకున్నారు. దేవాలయం వెలుపల ఆవు తలను లేదా మసీదు బయట పంది కళేబరాన్ని విసిరేసినా అది అనివార్యంగా రక్తపాతానికి దారి తీస్తుంది. శోచనీయ విషయమేమిటంటే భారతదేశ చరిత్రలో గోవు అంశాన్ని దేశ విభజన అంతం చేయలేకపోయింది. ఈ అంశంపై ఎప్పుడూ స్వార్ధపర శక్తుల ప్రేరణతోనే హింసాత్మక సంఘటనలు జరుగుతున్నాయి. మానవ జీవితాల కంటే ఆవులు ప్రధానమనే దేశంగా ప్రపంచం దృష్టిలో భారత్ నిలిచిపోయింది.

నిజానికి బ్రిటీష్ పూర్వపు రోజుల్లో మొఘల్ స్థాపకుడు బాబర్‌తో సహా పలువురు సుల్తానులు గోవధపై నిషేధం విధించారు. గోవధ నిషేధంపై ఆర్య సమాజం ఉద్యమం ప్రారంభించడంతో గోవు రాజకీయాలు ప్రధాన స్థానమాక్రమించాయి. అవు సంరక్షణ కోసం మొదటిసారిగా 1882లో ఆర్య సమాజ్ స్థాపకుడు దయానంద సరస్వతి మొదటి సంస్థను స్థాపించాడు. తర్వాత పలు గోరక్ష సమితులు పుట్టుకొచ్చాయి.

⇛

మొట్టమొదటి పండితుడు. అనేక ఇతర సామ్రాజ్యవాద మేధావులలాగా ఆయన భారత వ్యతిరేకి కాదు. ఇక రాజేంద్రలాల్ మిత్రా బెంగాల్ పునరుజ్జీవనం నుంచి వచ్చినవారు. రవీంద్రనాథ్ రాగూర్ అన్నగారైన జ్యోతీంద్ర నాథ్ ఠాగూర్‌కు ఆయన సన్నిహిత మిత్రులు, భారతీయ మేధోజీవనానికి ఎనలేని సేవ చేసిన వ్యక్తి. మాక్స్ ముల్లర్ ఆయనను 'ఉత్తమ సమకాలీన భారతీయ అధ్యయనశీలిగానూ; రవీంద్రనాథ్ రాగూర్ ఆయనను 'వాగ్దేవి మానస పుత్రుడి'గానూ అభివర్ణించారు.[14] అలాగే విలియం క్రూక్ వలస దేశానికి చెందిన సుప్రసిద్ధ మానవ జీవ శాస్త్రవేత్త. ఆయన హిందూమత వ్యతిరేకతతో ఎలాంటి నిమిత్తం లేకుండా రైతుల జీవన విధానం గురించి, ప్రధాన మతాల గురించి విస్తృతంగా రాశారు. ఇక కొంత ముస్లిం వ్యతిరేక భావజాలం వున్నవాడైనప్పటికీ ఎల్.ఎల్. సుందరరామ్ మానవతా విలువల చేత ప్రభావితుడైన మేధావి. మహామహోపాధ్యాయ పి.వి. కాణే సనాతన మరాఠీ బ్రాహ్మణుడు; భారతరత్న బిరుదు పొందిన ఏకైక సంస్కృత విద్వాంసుడు. హెచ్.డి. సంకాలియా తన అసమాన పురావస్తు కార్యకలాపాలని విశిష్ట సంస్కృత పాండిత్యాన్ని జోడించి రచనలు వెలువరించిన వ్యక్తి.

ఇలాంటి మేధావులే కాకుండా మరెంతోమంది ఇతర భారతీయ సంస్కృత విద్వాంసులు, పరిశోధకులు, అనేకమంది పాశ్చాత్య మేధావులు ప్రాచీన భారతదేశంలో ప్రజలు గో మాంసాన్ని, ఇతర జంతువుల మాంసాన్ని భుజించేవారన్న వాస్తవాన్ని వివిధ గ్రంథాల ఆధారంగా చాటి చెప్పారు. అయితే నాగరికతాపరమైన నిరక్షరాస్యతా భారాన్ని మోస్తున్న సంఘపరివార్ – ఈ మేధావులను పల్లెత్తుమాట అనకుండా, ఆ మేధావుల పరిశోధనలను ఆధారంగా చేసుకొని విశ్లేషణలు చేసిన చరిత్రకారులపై తమ తుపాకులను (విమర్శలను) ఎక్కుపెట్టడం ఆశ్చర్యం అనిపిస్తుంది.

కార్పొరేట్ క్రీడా జగత్తు

వస్తువులుగా క్రీడాకారులు - ఖైదీలుగా ప్రేక్షకులు

జయతిఘోష్

క్రీడలకు, మానవ జాతికి అవినాభావ సంబంధముందని ఇప్పటి వరకు జరిగిన చరిత్ర రుజువు చేస్తున్నది. జంతువులన్నీ ఆటలాడడం సహజమయి నప్పటికీ ఎంతో అభివృద్ధి చెందిన మానవుడు మాత్రం నిరంతరం కొత్త రకాల ఆటలను సృష్టించుకుంటున్నాడు. వివిధ రకాల ఆటలను ప్రస్తుతం మనం కల్గిఉండడం కొత్త విషయమేమి కాదు. ఆటలు ఆడడం కన్నా ఎక్కువగా వీక్షించే వారి సంఖ్య పెరిగింది. ఇదో కొత్త మలుపు. ఇతరులు బాగా ఆడుతుంటే చూడడాన్ని ప్రజలు ఎక్కువగా ఇష్టపడతారు. ఇది పాలకులకు చాలా సందర్భాల్లో ఉపయోగపడింది. ఆహార కోరత ఎక్కువగా ఉన్నప్పుడు సర్కస్‌ల విలువను పురాతన రోమ్ చక్రవర్తులే గుర్తించారు.

అయితే ప్రస్తుత పరిస్థితుల్లో కనిపిస్తున్న అంశాలు చాలా కొత్తగా ఉన్నాయి. నూతన దశలో క్రీడా వ్యాపారం విస్తృతంగా విస్తరిస్తుండగా క్రీడా రంగం తానంతట తానుగా ప్రపంచీకరించబడుతున్నది. దీని గురించి ఇప్పటికే చాలాసార్లు చర్చించాం. మన దేశంలో కొన్ని క్రీడలు వ్యాపారంతో ఎంత దగ్గరి సంబంధాలు కల్గిఉన్నాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అసవరం లేదు.

ఆటలు నిర్వహించడమే కాక వ్యాపార ప్రకటనల ద్వారా, అన్ని రకాల ఇతర వస్తువుల అమ్మకాలను ప్రోత్సహించడం ద్వారా వ్యాపార వర్గాలు క్రీడలను లాభాల మార్కెట్‌గా మలుచుకున్నాయి. లాభాలు దండుకునే క్రమంలో ఫిక్సింగ్, బెట్టింగ్‌లతో జూదం నిర్వహించడం లాంటి నీచమైన కార్యక్రమాలకు కూడా వెనకాడడం లేదు. స్పాన్సర్లషిప్, ఇతర కార్యక్రమాలు ఆటల యొక్క స్వచ్ఛతను ఎలా నాశనం చేస్తున్నాయి, ఆటగాళ్ల ఆకాంక్షలను ఎలా మలుచుతున్నాయనే అంశాలపై ప్రస్తుతం ఎక్కువగా చర్చ జరుగుతున్నది. ఈ ధోరణులు ఎంత ప్రమాదకర స్థాయికి చేరాయో ఇప్పటికీ మనం అర్థం చేసుకోలేపోతున్నాం. ఆటగాళ్లు సైతం తామకుతాముగా కార్పొరేట్ క్రీడా జగత్తు నిర్మాణంలో పావులుగా మారిపోయారు.

క్రీడాలోకంపై కార్పోరేట్ రంగ ప్రభావాన్ని గణశక్తి దినపత్రిక బెంగాలీ భాషలో తీసుకొచ్చిన 'ప్రపంచీకరణ నీడలో క్రీడా రంగం' అనే పుస్తకం కళ్లకు కట్టినట్లు చూపింది. ఈ చిన్న పుస్తకం ప్రస్తుతం క్రీడలను నిర్వహిస్తున్న తీరులో కొత్తగా వస్తున్న మార్పుల సారాంశాన్ని వివరించింది. ప్రపంచీకరణ క్రమంలో ఆటల్లో వస్తున్న మార్పులు, ఆటగాళ్లు, ప్రేక్షకులపై వాటి ప్రభావాలను తెలిపింది.

క్రీడల్లో వీపరీతంగా పెరుగుతున్న వ్యాపారీకరణ క్రీడాకారుల స్వాతంత్ర్యాన్ని ఎలా లాగేసుకుంటున్నదనేది ఆ పుస్తకంలో పేర్కొన్న ముఖ్యమైన అంశాల్లో ఒకటి. బ్రెజిల్ ఫుట్‌బాల్ స్టార్ రొనాల్డోపై దేవశిష్ చక్రవర్తి రచించిన వ్యాసంలో మురికి వాడల్లో తిరిగే బాలుడు ప్రపంచ ఆరాధ్య క్రీడాకారుడుగా ఎలా ఎదిగాడో వివరించారు. తొలి రోజుల్లో సెలక్షన్ ట్రయల్స్‌కు వెళ్లలేని పేదరికాన్ని అనుభవించిన రొనాల్డో యవ్వన కాలంలో స్పాన్సర్‌షిప్ అవసరాన్ని గుర్తించాడని, తొలి రోజుల్లో డబ్బు పాత్ర నేర్పిన కఠిన వాస్తవాలు ఏజెంట్లు, స్పాన్సర్ షిప్‌ల వేటలో పరిగెట్టాలా చేశాయని చక్రవర్తి పేర్కొన్నారు.

అయితే ఈ స్పాన్సర్‌షిప్పుల కారణంగా జరిగే అనర్థం చాలా ఉంది. ప్రపంచ మేటి ఆటగాడైన రొనాల్డ్ ఫుట్‌బాల్‌తో పాటు, బూట్ల బహుళజాతి సంస్థ 'నైక్'కూ పూర్తి ఖైదీగా ఎలా మారిపోయాడనేది ఆ పుస్తకంలోని చాలా ఆర్టికల్స్ వివరించాయి. 1998 వరల్డ్ కప్ ఫుట్‌బాల్ ఫైనల్లో ఫ్రాన్స్‌తో బ్రెజిల్ తలపడాల్సి వచ్చింది. మ్యాచ్‌కు ముందు రాత్రి రొనాల్డో అన్‌ఫిట్ అని ప్రకటించారు. రొనాల్డో లేకుండా బ్రెజిల్ జట్టు స్టేడియంకు చేరుకోవడం స్పాన్సర్లలో, ముఖ్యంగా నైక్ సంస్థ ఎక్కువ ఆందోళనకు గురయిందని షంతున్‌దేవ్ తన వ్యాసంలో వివరించారు.

బ్రెజిల్ జట్టుకు కూడా స్పాన్సరింగ్ చేయడంతో పాటు ఆ ఏడాది అత్యధిక మొత్తం ఆ జట్టుకు చెల్లించిన నైక్ సంస్థ ఒత్తిడి కారణంగా ఫిట్‌నెస్‌తో లేని రొనాల్డోను ఆడించాలని నిర్ణయించారు. అనారోగ్యంతో బాధపడుతున్న రొనాల్డో పెయిన్ కిల్లర్ ఇంజక్షన్స్ తీసుకొని ఆడాల్సి వచ్చింది. ఫలితంగా ఆ మ్యాచ్ అతని కేరీర్‌లో అత్యంత పేలవమైన ప్రతిభను కనబర్చిన మ్యాచ్‌లలో ఒకటిగా మిగిలిపోయింది. ఆరోగ్యం, సామర్థ్యం కన్నా కూడా ఎక్కువ విలువ గల వస్తువుగా ఆ ఆటగాడు మారిపోయాడు.

ఆ మ్యాచ్ కేవలం బ్రెజిల్, ఫ్రాన్స్ మధ్య పోటీ మాత్రమే కాదు, రొనాల్డోను గుత్తకు తీసుకున్న 'నైక్' సంస్థకు, ఫ్రెంచ్-అల్జేరియన్ ఆటగాడు జినెదినే జిడానే ప్రమోట్ చేస్తున్న 'ఆడిడాస్' మధ్య పోరు కూడా. ఈ పోటీలో గెలుపొందిన సంస్థకు ప్రత్యేక ప్రయోజనాలు ఉంటాయి. ఆ ఏడాది 'అడిడాస్' గెలిచినప్పటికీ 2002లో రొనాల్డో ప్రతిభ

ఆటలు నిర్వహించడమే కాక వ్యాపార ప్రకటనల ద్వారా, అన్ని రకాల ఇతర వస్తువుల అమ్మకాలను ప్రోత్సహించడం ద్వారా వ్యాపార వర్గాలు క్రీడలను లాభాల మార్కెట్‌గా మలుచుకున్నాయి. లాభాలు దండుకునే క్రమంలో ఫిక్సింగ్, బెట్టింగ్‌లతో జూదం నిర్వహించడం లాంటి నీచమైన కార్యక్రమాలకు కూడా వెనకాడడం లేదు.

కారణంగా 'నైక్' సంస్థ విజయం సాధించింది.

అత్యధికంగా ప్రపంచీకరించబడిన, వాణిజ్యీకరించబడిన ఆటల్లో ఫుట్‌బాల్ ఒకటి. యూరోపియన్ ఫుట్‌బాల్ క్లబ్‌లలో అధిక భాగం అత్యధిక లాభాలు సాధించే వ్యాపార సంస్థలని ప్రీతమ్ సిన్హా తెలిపారు. ఈ క్లబ్బులు ప్రయివేట్ వాణిజ్య సంస్థల్లో భాగంగా ఉంటాయి. ఈ వాణిజ్య సంస్థలు మీడియా, వినోద కార్యకలాపాల లాంటి ఇతర కార్యక్రమాలను కూడా నిర్వహిస్తూ ఉంటాయి.

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఉత్తమ ఆటగాళ్లను ఎక్కువగా అభివృద్ధి చెందుతున్న దేశాల ఆటగాళ్లను ఈ క్లబ్‌లు తమలో చేర్చుకుంటాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల ఆటగాళ్లకు ఈ క్లబ్‌లలో చేరటం ఒక స్వప్నంగా భావిస్తారు. ఆ క్రమంలో ఆ ఆటగాళ్లను ఈ క్లబ్‌లు కొనేస్తాయి. ఈ ఆటగాళ్లను 'కొనుగోలు' చేసే క్రమంలో పెద్ద మొత్తాలు చేతులు మారుతాయి. అందులో కొంత మొత్తం ఆటగాళ్లకు కూడా అందుతుంది. దీనికి తోడు ఆ ఆటగాడికి మార్కెట్ విలువ ఉన్నంత వరకు వ్యాపార ప్రకటనల ద్వారా, వివిధ కంపెనీ వస్తువుల అమ్మకాలను ప్రోత్సహించడం ద్వారా కూడా ధనం వస్తుంది.

2002 ప్రపంచకప్ ఫుట్‌బాల్లో చాలా మందిని అబ్బురపరిచిన సెనెగల్ జట్టులోని ముఖ్యమైన 23 మంది సభ్యుల్లో 21 మంది ఫ్రెంచ్ లీగ్‌కు చెందిన వారు. వాస్తవానికి శెనగల్ క్రీడాకారులు ఫుట్‌బాల్ ఆడుతున్నది శెనగల్‌లో కాదు. యూరోపియన్ క్లబ్‌లలో. శనగల్‌లో ఉన్న జాతీయ ఫుట్‌బాల్ అసోసియేషన్ స్థానిక ప్రతిభను గుర్తించే ఎంటర్‌ప్రైజ్‌గా మారింది. ఆ విధంగా ఆ స్థానిక బాలురు డిమాండ్ కల్గిన ప్రపంచంలోకి అడుగుపెడుతున్నారు. వారిని యూరోపియన్ ఫుట్‌బాల్ కొనగోలు చేస్తున్నది.

ఇంతవరకు ప్రపంచ కప్ ఫుట్‌బాల్‌కు ఎంపిక కాని భారత్‌దేశంలో సైతం ఈ విషమ పరిణామాలు ప్రారంభమవడమే కాదు పాతుకుపోయే స్థితికి చేరాయి. మోహన్ బాగాన్ లాంటి భారత ఫుట్‌బాల్ జట్లు ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీలుగా ఎలా మారుతున్నాయో, తక్కువ రేటు కల్గిన అంతర్జాతీయ క్రీడాకారులను కోనుగోలు చేయడం ద్వారా విజయవంతమైన విదేశీ క్లబ్‌లను ఏవిధంగా అనుకరిస్తున్నాయో సుబ్రో ముఖోపాధ్యాయ వివరించారు.

ప్రస్తుతం ఉత్కంఠతంతా క్రికెట్ గురించే. మీడియా ఇస్తున్న అత్యధిక ప్రచారం, భారత్ క్రికెట్ జట్టుపై ఉన్న అందరిదృష్టి గురించి పాను భట్టాచార్య బాగా వివరించారు. అదే పనిగా వ్యాపార ప్రకటనలు గుప్పించడం ద్వారా, జట్టుకున్న అద్భుత ప్రతిభ గురించి మీడియాలో వీపరీతంగా ప్రచారం కల్పించడం ద్వారా ప్రపంచ కప్ ప్రారంభానికి మాసాల ముందే ప్రజల్లో భారత జట్టుపై అత్యధిక అంచనాలు పెంచారు. ఈ పరిణామం అనూహ్యమైంది.

న్యూజిలాండ్ పర్యటనలో భారత్ పేలవమైన ప్రతిభ చూపినప్పటికీ ప్రపంచ కప్ క్రికెట్ గురించి మీడియా అత్యధిక ప్రచారాన్ని ఇవ్వడమే కాక హోరెత్తించింది. ప్రజా దృష్టిని, వినియోగదారీ ప్రయోజనాలను కొనసాగించడం ద్వారా వ్యాపార ప్రకటనలు ఇచ్చే కంపెనీల ప్రయోజనాలను నేరవేర్చేందుకే ఈ విధమైన ప్రచార హోరును కొనసాగించారు. వీపరీతమైన ప్రచారం చేసిన కారణంగా మొదటి రెండు మ్యాచ్‌లలో భారత్ ప్రతిభ పేలవంగా ఉన్నప్పటికీ ఇతర వార్తల కన్నా భారత జట్టుపైనే మీడియా ఎక్కువ దృష్టి పెట్టింది.

ఆ వారంతపు రోజున ఇరాక్‌పై బుష్ యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా 600 నగరాల్లో కోటి మంది ప్రజలు వ్యతిరేక ప్రదర్శనలు జరిపారు. ఇదో చారిత్రాత్మక ఘటన. అయితే ఇంత ప్రాముఖ్యత కల్గిన ఘటన గురించి చెప్పడానికి మన ప్రింట్, టెలివిజన్ మీడియాకు చోటు దొరకలేదు. అందుకు బదులుగా ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ పేలవమైన ప్రతిభను చర్చించడంలోనే వారు మునిగిపోయారు.

ఈ మీడియానే ప్రొత్సహించిన మన క్రికెట్ అభిమానులు తమ నిరసనను వీధుల్లో కోపాన్ని ప్రదర్శించడంతోనే సరిపుచ్చక ప్రస్తుత వాణిజ్య కార్యకలాపాలపై విస్తృత ప్రభావాన్ని చూపే విధంగా కూడా తెలిపారు. తమ క్రికెటర్లు ప్రచారం చేస్తున్న వస్తువులను తాము కొనేది లేదని వేలకొద్ది అభిమానులు తేల్చి చెప్పారు. ఇప్పటి వరకు క్రికెట్‌పై విపరీత ప్రచారాన్ని పెంచిపోషించిన వాణిజ్య వర్గాలకు ఇదో హెచ్చరిక.

ఈ చర్య స్పాన్సర్ల వెన్నులో వణుకు పుట్టించింది. క్రికెటర్ల గురించి అర్థం చేసుకోవాలని ప్రజలను కోరుతూ కొంతమంది స్పాన్సర్లు పేపర్లలో పెద్ద పెద్ద వ్యాపార ప్రకటనలు ఇచ్చారు. సాధారణ ప్రజల్లో ఆ విధమైన ఉత్కంఠతను కలగ జేసే సామర్థ్యం క్రీడా వ్యాపారంలో నిమగ్నమయిన స్పాన్సర్లు, వ్యాపార ప్రకటన కర్తలకు ఉండడం ఆశ్చర్యం కల్గించే విషయమేమి కాదు. ప్రస్తుత సమాజంలో పొడచూపుతున్న పెడ ధోరణుల కన్నా క్రికెట్, ఇతర క్రీడల వీక్షణ ద్వారా జరిగే నష్టం కొంత తక్కువగానే ఉన్నది. ప్రస్తుతం రోజు వారీ జీవనంలో ఉత్పన్నమవుతున్న నిరాశ, అభద్రతలను మర్చిపోవడానికి ఈ క్రీడలు కొంత ఉపయోగపడుతున్నాయి. అయితే ఆ ప్రయోజనంతో ఈ క్రీడలు ఆగడం లేదు. చాలా ప్రమాదాన్ని కూడా కల్గజేస్తున్నాయి.

ఇతర రంగాలతో పోల్చుకున్నప్పుడు క్రీడా రంగంలోని కొన్ని క్రీడల్లో వ్యక్తిగత ఈవెంట్లలో సాధించిన విజయాలు ఆ క్రీడాకారుడి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతున్నాయి. ఇతర రంగాల్లో ఈ అవకాశాలు కొరవడిన నేపథ్యంలో ఈ క్రీడల్లో లభిస్తున్న అవకాశాలకు చాలా ప్రాముఖ్యత ఉన్నది. వినోద రూపాల్లో ఒకటైన క్రీడలు వ్యక్తిగత అభివృద్ధికి అవకాశమున్న అతికొద్ది రంగాల్లో ఒకటి. నాణ్యమైన విద్య కూడా మంచి అవకాశమని ప్రపంచమంతా గుర్తించినప్పటికీ అది చాలామందికి అందుబాటులో లేదు.

క్రింది స్థాయి నుండి అసాధారణ స్థితికి ఎదిగిన రొనాల్డో లాంటి, ప్రస్తుత భారత్ క్రికెట్‌లో ఎదుగుతున్న వీరేందర్ సెహవాగ్ లాంటి వారి చరిత్రలు మనకు చాలా సంతృప్తినిస్తాయి. ఎందుకంటే ఇతర రంగాల్లో ఇలాంటి చరిత్రలు చాలా తక్కువగానే ఉన్నాయి.

ఈ కారణంగానే కార్పొరేట్ క్రీడా పరిశ్రమకు ఆటగాళ్లగానో, ప్రేక్షకులగానో ఖైదీలుగా మారేందుకు మనం అంగీకరిస్తున్నాం. నిజమైన ఆటను కార్పొరేట్ ప్రపంచంచే ఆడబడుతున్న కొద్ది మంది వ్యక్తుల లాభాల ఆటగా మారడానికి అవకాశమిస్తున్నాం.

ఇరాక్‌పై బుష్ యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా 600 నగరాల్లో కోటి మంది ప్రజలు వ్యతిరేక ప్రదర్శనలు జరిపారు. ఇదో చారిత్రాత్మక ఘటన. అయితే ఇంత ప్రాముఖ్యత కల్గిన ఘటన గురించి చెప్పడానికి మన ప్రింట్, టెలివిజన్ మీడియాకు చోటు దొరకలేదు. అందుకు బదులుగా ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ పేలవమైన ప్రతిభను చర్చించడంలోనే వారు మునిగిపోయారు.

గుజరాత్ నరమేథంపై చట్టపర చర్య తీసుకోలేమా?

అరవింద్ నరైన్

గోద్రా సంఘటన అనంతరం గుజరాత్‌లో మానభంగాలు, హత్యలు, లూటీలు, దహనకాండలు జరిగి ఏడాది పూర్తయింది. గుజరాత్ హింసా కాండకు సంబంధించి చట్టపరంగా ఎలాంటి చర్య తీసుకునే అవకాశంలేదా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. హిందూత్వ మారణహోమ రాజకీయాలకు గుజరాత్‌ను ప్రయోగశాలగా ఉపయోగించుకున్నారనే విషయం భయాందోళన కలుగజేస్తోంది. గుజరాత్‌లో హింసాకాండ జరిగినతీరు, దాని వెనుక ఉన్న సైద్ధాంతిక చట్రాన్ని సీరియస్‌గా పరిశీలించినట్లయితే ఎం.ఎస్.గోల్వాల్కర్, ప్రవీణ్ తొగాడియా చెబుతున్న ఉమ్మడి సిద్ధాంతం ప్రకారమే దానికి పథకాలు రూపొందించి అమలు జరిపినట్లు అవగతమవుతుంది. నాజీ జర్మనీ గురించి గోల్వాల్కర్ చేసే ప్రస్తావనలోని భాగం వారి సిద్ధాంతతత్వాన్ని మరింత స్పష్టం చేస్తుంది. "యూదు జాతి, దాని సంస్కృతి, సంప్రదాయాలకు స్వచ్ఛతను కాపాడేందుకు దేశంలోని ఇతర జాతులను తొలగించడం, నిర్మూలించడం ద్వారా జర్మనీ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇక్కడ జాతి విశిష్టతకు అత్యంత ప్రాధాన్యతను కట్టబెట్టారు. వేర్వేరు రకాల జాతులు, సంస్కృతులు ఐక్యంగా ఉండడం ఇంచుమించు అసాధ్యమనే విషయాన్ని జర్మనీ తేటతెల్లం చేసింది. ఈ ఉదంతం నుండి హిందుస్థాన్ మంచి పాఠం నేర్చుకుని, లాభం పొందొచ్చు" అని గోల్వాల్కర్ చాలా సందర్భాల్లో పేర్కొన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సంస్థాపకులు ఆలోచనాధోరణిని బట్టి వారు "ఇతరులను" (హిందూమతస్థులు కానివారిని) తుదముట్టించాలనే దృఢ సంకల్పంతో ఉన్నట్లు అర్థమవుతోంది. ఈ నేపథ్యంలో దీనికి చట్టపరమైన నివారణ ఏమిటి, ఎలాంటి చర్యతో దానిని అడ్డుకోగలం? అనేది ప్రశ్న.

గుజరాత్‌లో జరిగిన మారణకాండను విశ్లేషిస్తే అది రెండు ప్రత్యర్థి మతాలు పరస్పరం ఒకదానిపై మరొకటి జరిపిన హింసాకాండకాదు అనేది స్పష్టంగా తెలుస్తోంది. అక్కడ ముస్లిం మతానికి చెందిన ప్రజలపై ఒక పథకం ప్రకారం దాడులు జరిగాయి. ముస్లిం ప్రజలు పెద్ద సంఖ్యలో మరణించారు, పెద్ద మొత్తంలో ఆస్తులు నష్టపోయారు. గుజరాత్‌లో జరిగింది ఏదో ఒక ప్రాంతానికి పరిమితమైన సంఘటన, మత ఘర్షణ కాదు. దానిని ఒక మతం వారిపై ప్రభుత్వ సహకారం, మద్దతుతో జరిగిన హింసా కార్యక్రమంగా అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి పథకం ప్రకారం జరిపే ఊచకోతలకు చట్ట పరంగా ఫలానా కేటగిరీకి చెందిన నేరాలుగా నిర్వచించలేదు. వీటిలో కొంతభాగం హింసారూపంలో ఉన్నప్పటికీ అది "చట్టపరమైన సాక్ష్యం"గా నిలిచే అవకాశంలేదు. అంతర్జాతీయ చట్టంలో "నేరాలలో అతిపెద్ద నేరం"గా అభివర్ణించిన ఒక పదం "జినోసైడ్" (ఊచకోత, మారణకాండ) చట్టపరంగా హింసాకాండ కేటగిరీగా నిర్వచించబడింది. ఊచకోత నేరాల నివారణ, అక్షకు సంబంధించి 1948లో అంతర్జాతీయ ఒప్పందం కుదిరింది. దీనిని భారతదేశం కూడా ఆమోదం తెలిపింది. ఈ ఒప్పందంలో ఒక దేశాన్ని, జాతిని, వర్గాన్ని, మతాన్ని మొత్తంగా కానీ అందులో కొంతభాగాన్ని కానీ అంతమొందించే ఉద్దేశంతో జరిపే హత్యలు, భౌతిక దాడులు, మానసికంగా కుంగదీసే భయానక బెదిరింపులను "జినోసైడ్"గా నిర్వచించారు. అయితే ఈ ఊచకోత, బెదిరింపులు, భౌతిక దాడులు లక్ష్యాన్ని సాక్ష్యాధారాలతో నిరూపించాల్సి ఉంటుంది. రెండో ప్రపంచయుద్ధం సృష్టించిన భయంకర కృత్యాల నేపథ్యంలో ఉద్దేశపూర్వకంగా కొన్ని వర్గాల ప్రజలను మొత్తానికి మొత్తంగా హతమార్చే చర్యలను నివారించడానికే ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు. పోలెండ్‌కు చెందిన రాఫాయెల్ లెమ్కిన్ అనే న్యాయవాది "జినోసైడ్" అనే పదాన్ని రూపొందించారు. గ్రీకు పదం "జీనోస్" అంటే జాతి, తెగ,దేశం అని అర్థం. లాటిన్‌లో "సెడిర్" అంటే హతమార్చడం. ఈ రెండు పదాల ఆధారంగా ఆయన "జినోసైడ్" పదాన్ని రూపొందించారు. ఒక దేశ ప్రజలనుగానీ ఒక జాతి ప్రజలనుగానీ, ఒక వర్గం, ఒక తెగ ప్రజలను గానీ సమూలంగా హతమార్చేందుకు, నాశనం చేసేందుకు సమన్వయంతో ఒక ప్రణాళికాబద్ధంగా అమలు జరిపే చర్యలను "జీనోసైడ్"గా లెమ్కిన్

గుజరాత్‌లో హింసాకాండ జరిగినతీరు, దాని వెనుక ఉన్న సైద్ధాంతిక చట్రాన్ని సీరియస్‌గా పరిశీలించినట్లయితే ఎం.ఎస్.గోల్వాల్కర్, ప్రవీణ్ తొగాడియా చెబుతున్న ఉమ్మడి సిద్ధాంతం ప్రకారమే దానికి పథకాలు రూపొందించి అమలు జరిపినట్లు అవగతమవుతుంది. నాజీ జర్మనీ గురించి గోల్వాల్కర్ చేసే ప్రస్తావనలోని భాగం వారి సిద్ధాంతతత్వాన్ని మరింత స్పష్టం చేస్తుంది.

పేర్కొన్నారు. ఈ ఒప్పందం అమలులోకి వచ్చినప్పటి నుండి 1948లో దీనిని ఆమోదించిన, ఆమోదించని అన్ని దేశాలు కూడా దీని పరిధిలోకి వచ్చాయి. ఇది అంతర్జాతీయ చట్టంగా మారింది. 20వ శతాబ్దం చివరలో బాల్కన్స్, రువాండాలో జాతులమధ్య మళ్లీ హింసాత్మక ఘర్షణలు తలెత్తడంతో తాత్కాలిక ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేశారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానాలను అనుసరించి ఇంటర్నేషనల్ క్రిమినల్ ట్రిబ్యునల్ ఫర్ రువాండా (ఐసిటిఆర్), ఇంటర్నేషనల్ క్రిమినల్ ట్రిబ్యునల్ ఫర్ యుగోస్లేవియా (ఐసిటివై) ఏర్పాటు చేశారు. ఈ రెండు ట్రిబ్యునళ్లకు "జినోసైడ్"పై విచారణ జరిపే అధికారం కల్పించారు. ఊచకోతకు పాల్పడిన నేరం కింద నేరస్థులకు శిక్ష విధించిన మొట్ట మొదటి అంతర్జాతీయ ట్రిబ్యునల్ రువాండా ట్రిబ్యునలే. ఇది మారణహోమానికి పాల్పడిన ఎనిమిది మంది మాజీ రువాండా నాయకులకు శిక్షలు విధించింది. తుదకు 1997లో రోమ్ చట్టం కింద ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టును ఏర్పాటు చేశారు. దీనికి కూడా "జినోసైడ్" నేరాలను విచారించే అధికారం ఉంది. "జినోసైడ్" చట్టంలో ఉన్న కీలకమైన అంశం ఏమిటంటే ఒక నిర్దిష్టమైన గ్రూపును, జాతిని, తెగను అంతమొందించడానికి వెనుక ఉన్న ఉద్దేశాన్ని నిరూపించడం. దీనిని నిందితులు చేసే ప్రకటనలను విశ్లేషించడం ద్వారా, కేసుకు సంబంధించిన వాస్తవాల ద్వారా నిరూపించేందుకు వీలు కల్పించారు. ఉదాహరణకు గుజరాత్ సంఘటనలను తీసుకున్నట్లయితే పార్టీ సిద్ధాంతం, దాని నాయకులు గోల్వాల్కర్ మొదలుకొని కింది స్థాయి నాయకుల వరకు చేసిన వివిధ ప్రకటనల సారాంశాన్ని బట్టి వారి "ఉద్దేశాన్ని" నిర్ధారించవచ్చు. "ఉద్దేశాన్ని" కనుగొనేందుకు అనుసరించిన రెండో పద్ధతి అంతర్జాతీయ చట్టంలో గొప్పగా విజయవంతమైంది. ఒక గ్రూపుకు వ్యతిరేకంగా ఒక పద్ధతి ప్రకారం జరుపతలపెట్టిన నేరాలకు (వాటిని ఒక్కరే చేయొచ్చు లేదా అనేకమంది చేసినప్పటికీ) సన్నాహకంగా, ప్రోత్సహించే విధంగా జరిపిన చర్యను "జినోసైడ్" నేరంగా పరిగణించాలని "అకయేసు" కేసులో రువాండా ట్రిబ్యునల్ తీర్పునిచ్చింది. ఇతర వర్గాల వారిని వదిలేసి ఒక నిర్దిష్ట వర్గం వారిని లక్ష్యంగా పెట్టుకుని ఒక పద్ధతి ప్రకారం జరిపిన దాడులు, జరిపిన ఘోరకృత్యాల తీవ్రత, వాటి సాధారణ నైజం, ఒక ప్రాంతంలో లేదా ఒక దేశంలో లేదా అంతకుమించి పలు దేశాలలో జరిగిన దాడులను బట్టి కూడా "జినోసైడ్" నేరాన్ని నిర్ధారించొచ్చునని ట్రిబ్యునల్ పేర్కొంది. (ఈ కేసులో అరయేసు అనే కలెక్టర్ స్థాయి అధికారి తన జిల్లాలో టుట్సి ప్రజలపై జరుగుతున్న హత్యాకాండ, మానభంగాల గురించి తెలిసి కూడా ఉద్దేశపూర్వకంగా వాటిని అనుమతించాడు). అదే మాదిరి ప్రాసిక్యూటర్ వర్సెస్ క్రిస్టిక్ కేసులో యుగోస్లేవియా ట్రిబ్యునల్ "జినోసైడ్" నేరాన్ని మరింత విపులంగా నిర్వచించింది. భౌతిక దాడులు లేదా ప్రాణాలు హరించడంతోపాటు అదే సమయంలో సాంస్కృతిక సంపదపై, మతపరమైన ఆస్తులపై జరిపిన దాడులను కూడా ఒక నిర్దిష్ట గ్రూపును సమూలంగా అంతమొందించే ఉద్దేశంతో జరిపిన చర్యగా పరిగణించాలని పేర్కొంది. ఉద్దేశపూర్వకంగా, మసీదులు, గృహాలను ధ్వంసం చేయడాన్ని ఒక నిర్దిష్ట వర్గాన్ని నిర్మూలించే లక్ష్యంతో చేపట్టిన చర్యగా తమ విచారణలో పరిగణిస్తామని తెలిపింది. ఈ రెండు కేసులలో పేర్కొన్న నిర్వచనాలను గుజరాత్ సంఘటనలకు సంబంధించి మానవ హక్కుల సంఘం నివేదికలు, నిజ నిర్ధారణ కమిటీల నివేదికలు, సిటిజెన్స్ ట్రిబ్యునల్ నివేదికలో చూపిన ఆధారాలకు అన్వయించి చూసినట్లయితే గుజరాత్‌లో జరిగింది ముమ్మాటికీ "జినోసైడ్" అనే అర్థమవుతుంది. గుజరాత్ సంఘటనల వాస్తవాలను పరిశీలించినట్లయితే అక్కడ ముస్లింలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున హింసాకాండ జరిగిందని చెప్పడంలో ఏమాత్రం సందేహంలేదు. అక్కడ మానభంగాలకు గురైన వారందరూ ముస్లిం మహిళలే. ఊచకోతకు గురైన వారందరూ ముస్లింలే. గ్రామాలు, నగరాలు, పట్టణాలనుండి ప్రాణాలు కాపాడుకునేందుకు ఇతర ప్రాంతాలకు పారిపోయిన వేలాదిమంది ప్రజలూ ముస్లింలే. ముస్లింల ఇళ్లు, దుకాణాలు, ఇతర ఆస్తులను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిగాయి. ముస్లింలను నామరూపాలు లేకుండా చేయాలని, ముస్లిం మహిళలపై అత్యాచారాలు జరపాలని, ముస్లిం ప్రజలందరిపై ఆర్థిక ఆంక్షలు జరపాలని పిలుపునిస్తూ అనేక కరపత్రాలు పంపిణీ చేశారు. గుజరాత్‌లోని 17 జిల్లాల్లో ముస్లింలపై ఘోరకృత్యాలు జరిగాయి. ఫలితంగా రెండువేలమంది ప్రాణాలు కోల్పోయారు. లక్షమందికిపైగా తమ ఇళ్లు విడిచి పెట్టిపోయారు. ముస్లింలకు చెందిన మూడువేలకోట్ల రూపాయలకుపైగా ఆస్తులను ధ్వంసం చేశారు. వీటన్నింటిని బట్టి అక్కడ ఒక పద్ధతి ప్రకారం వివిధ రకాల దాడులు జరిగినట్లు అర్థమవుతోంది. సుమారు 230 పవిత్ర స్థలాలు, మసీదులు, దర్గాలను కూల్చారు. లేదా అపవిత్రం చేశారు. గోద్రా సంఘటన అనంతరం 72 గంటల్లో జరిగిన కొన్ని ఉదంతాలలో విధ్వంసక చర్యలకు బుల్డోజర్లు, క్రేన్లు ఉపయోగించారు. గుజరాత్‌లో జరిగింది "జినోసైడ్" అని చెప్పడానికి ఇవి ప్రబల నిదర్శనాలు. దానిని జినోసైడ్‌గా పరిగణించినట్లయితే చట్టపరంగా ఎలాంటి చర్యలు తీసుకునే అవకాశముంది అని ప్రశ్నించుకున్నట్లయితే ఈ కింద అవకాశాల గురించి చెప్పుకోవచ్చు.

ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టుకు (ఐసిసి) "జినోసైడ్" వంటి తీవ్రమైన నేరాలపై విచారణ జరిపే అధికారం ఉన్నప్పటికీ దానికి ఆమోదం తెలిపిన దేశాలకు మాత్రమే ఇది వర్తిస్తుంది. భారత్ రోమ్ చట్టాన్ని ఆమోదించలేదు. ఒకవేళ భారత్ ఇప్పుడు ఐసిసి చట్టాన్ని ఆమోదించినా దానికి ఆమోదం తెలిపిన తేదీ తర్వాత జరిగిన నేరాలపై విచారణ జరిపేందుకు మాత్రమే అధికారం ఉంటుంది. ఐసిసి చట్టానికి ఆమోదం తెలుపకముందు జరిగిన నేరాలపై కూడా విచారణ జరపొచ్చునని అంగీకారం తెలుపుతూ భారత్ ఒక డిక్లరేషన్ ఇచ్చినట్లయితే దానికి పాతనేరాలపై విచారణనే జరిపే అధికారం ఉంటుంది.

(మిగతా 20వపేజీలో)

గుజరాత్‌లోని 17 జిల్లాల్లో ముస్లింలపై ఘోరకృత్యాలు జరిగాయి. ఫలితంగా రెండువేలమంది ప్రాణాలు కోల్పోయారు. లక్షమందికిపైగా తమ ఇళ్లు విడిచి పెట్టిపోయారు. ముస్లింలకు చెందిన మూడువేలకోట్ల రూపాయలకుపైగా ఆస్తులను ధ్వంసం చేశారు. వీటన్నింటిని బట్టి అక్కడ ఒక పద్ధతి ప్రకారం వివిధ రకాల దాడులు జరిగినట్లు అర్థమవుతోంది. సుమారు 230 పవిత్ర స్థలాలు, మసీదులు, దర్గాలను కూల్చారు. లేదా అపవిత్రం చేశారు. గోద్రా సంఘటన అనంతరం 72 గంటల్లో జరిగిన కొన్ని ఉదంతాలలో విధ్వంసక చర్యలకు బుల్డోజర్లు, క్రేన్లు ఉపయోగించారు.

మార్క్స్ - చరిత్ర

కార్ల్ మార్క్స్ 120వ వర్ధంతి సందర్భంగా ప్రత్యేక వ్యాసం

ఇర్ఫాన్ హబీబ్

ఇది కారల్ మార్క్స్ శత జయంతి సంవత్సరం. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని, ఆయన బోధనలను స్ఫురణకు తెచ్చుకోవడమే ఆయనకు మనం ఇవ్వగల నివాళి. ఆయన ఆలోచనావిధానంలో చరిత్రకు సంబంధించిన భావసరళి ఆయన ప్రాతిపదికను వివరిస్తుంది. ఇది భారత దేశానికి చెందిన మనకేకాక ప్రపంచంలోని మిగతా ప్రజలకు కూడా సజీవ ప్రాముఖ్యతగానే గోచరమౌతుంది-అదొక కరదీపిక లాంటిది. యావత్తూ మానవ జాతి చారిత్రికానుభవాన్ని పురస్కరించుకుని మనం జ్ఞానార్జన చేయాలి. భవిష్యత్తును అర్థం చేసుకునే దృష్టి అలవరుచుకోవాలి.

ఆధునిక సైద్ధాంతికులు-నూరు సంవత్సరాల క్రితం సంపూర్ణంగా సమర్థించే అంశాలను-తరచుగా సంపూర్ణ నిర్ధారణగా ప్రవచించారు. ఇ.హెచ్.కార్‌తో పాటు చారిత్రక వాస్తవాలను గ్రహించవచ్చని, మార్క్స్ అంగీకరించేవాడు, అలాగే అలాంటి వాస్తవాలను, పరిశోధనల ద్వారా, ఎంపిక ద్వారా, వివరణ ద్వారా (వ్యాఖ్యానం సహాయంగా) పరిశీలించి మన జ్ఞాన పరిధిని విస్తరింప జేయవచ్చునని కూడా అంగీకరించేవాడు. చరిత్రను మనం ఉపయోగించే లక్ష్యాన్ని బట్టీ, సందర్భాన్ని బట్టీ (మాత్రమే) దానికి నిర్దిష్టతను ఇవ్వగలమన్న మార్క్ బ్లాక్ అభిప్రాయంతో కూడా మార్క్స్ ఏకీభవించేవాడు. చరిత్ర.. కళ కళ కోసమే అనే కోవకు సంబంధించిన అంశం కానే కాదు. అదొక విజ్ఞాన శాస్త్రమే. అనుభవాలను మథించి-మదుపు చేసి-భవిష్యత్ కార్యక్రమన్ని నిర్మించుకుంటాం. మార్క్స్ ఎప్పుడో 1845లోనే "తాత్వికులు చరిత్రను అనేక విధాలుగా వ్యాఖ్యానించారు. అయితే ప్రధాన సమస్య దానిని మార్చడం" అన్నాడు. ఇప్పుడు ప్రధానంగా కార్యాచరణను రూపొందించుకోవడానికి, తక్షణ ఆచరణకు సిద్ధపడడానికీ, మనం చరిత్రను అధ్యయనం చేస్తాం... చరిత్ర అంటే ఎదుర్కొన్న పరిస్థితులకూ, ఎంచుకున్న ఆచరణకూ... సంబంధించిన భోగట్టా మాత్రమే.

మార్క్స్ ఎప్పుడో 1845లోనే "తాత్వికులు చరిత్రను అనేక విధాలుగా వ్యాఖ్యానించారు. అయితే ప్రధాన సమస్య దానిని మార్చడం" అన్నాడు. ఇప్పుడు ప్రధానంగా కార్యాచరణను రూపొందించుకోవడానికి, తక్షణ ఆచరణకు సిద్ధపడడానికీ, మనం చరిత్రను అధ్యయనం చేస్తాం... చరిత్ర అంటే ఎదుర్కొన్న పరిస్థితులకూ, ఎంచుకున్న ఆచరణకూ... సంబంధించిన భోగట్టా మాత్రమే.

చరిత్రను మనం రెండు విధాలుగా గమనించగలం. మొదట... సంఘటనలనన్నింటినీ పేర్చుకుపోవడం -ప్రధానంగా రాజకీయ సాంస్కృతికపరమైనవి. ఈ వివరాలను గత కాలపు రచయితలు వర్ణించి ఉండొచ్చు. అంటే గత కాలపు వివిధ దశలను భిన్నమైన సామాజిక మేధోపర, వాతావరణాల్లో బతికిన మన పూర్వుల దృక్కోణం నుంచి మాత్రమే మనం పరికిస్తున్నామాట. తమకాలపు పరిస్థితుల నుంచి వారికి లభించిన సారాంశం ఇప్పుడు మనకేమీ ప్రయోజనకరం కాదు. విశ్లేషణాత్మక ఉద్ఘాటనలను తిరస్కరించే వృత్తి చరిత్రకారులు తరచుగా తమ ఆధారమూలాలను కూడా ప్రక్కకు తోసివేస్తారు. "ఒక వ్యక్తి తనను గురించి తానేమనుకుంటున్నాడో నన్న అంశంపై ఆధారపడి ఎవరూ అతనిని అంచనా వేయరు. అలాగే పరివర్తన చెందుతున్న ఒక శకాన్ని-ఒక కాలాన్ని-తక్షణ చైతన్యంతో ఎవరూ మదింపు చేయలేరు" అన్న మార్క్స్‌ది కూడా ఇదే అభిప్రాయం. అందువలన సామాన్యీకరణ పొందిన మానవచరిత్రా వ్యాఖ్యానాన్ని, స్పష్టమైన నియమితకాలానికి సంబంధించిన చారిత్రక సందర్భంతో ముడిపెట్టే-ఒక ప్రాంతం కావచ్చు, దేశం కావచ్చు-రెంటినీ పోల్చి అన్వయం చేయవచ్చును. నిరంతరంగా సామాన్యీకరణకూ, ప్రత్యేక పరిస్థితికీ ఉన్న పోలికలనూ, తేడాలనూ... విశ్లేషించుకుంటున్నప్పుడే ముందు తరం చరిత్రకారునికి లేని సౌలభ్యం, తర్వాతి తరాల వారికి అందుబాటులోకి వస్తుంది-ఇలాంటి అవకాశం హెరోడోటస్ (5వ శతాబ్దం)కు కానీ -ఆయన సమాచార నిధి- జియాబరానీ (భారతదేశం)కి కానీ, -ఆయన మహామేధావి - సాధ్యపడలేదు. వాస్తవానికి కాలం గడిచిన కొలదీ చరిత్ర కూడా దీర్ఘమౌతుంది కదా! అలాగే సార్వత్రికానుభవం, సంపన్నవంతమౌతుంది. ఈ క్రమంలో ప్రత్యేకమైన చారిత్రిక సంఘటనలకు.... స్పష్టత సమకూరుతుంది.

చరిత్రపట్ల మార్క్స్ దృక్పథం సార్వత్రికానుభవం నుంచి ఆయనకు తెలిసిన మేరకు నిగ్గు తీసిన సందర్భం గతాన్ని గురించి ఆధునిక శాస్త్రీయ పరిశోధనల తొలి కాలం తర్వాత, హెగెల్ లాంటి ఆధునిక తత్వవేత్తల సమ్మేళనా విధానాల వెలుగులో... మార్క్స్ సామాన్యీకరణ విధానానికి వాస్తవ సమాచారం గాఢంగా సహకరించింది. చరిత్రాధ్యయనానికి సంబంధించిన సమగ్ర స్వరూపం లభ్యమైంది.

మొదట.... మానవ భౌతికవాంఛా సాఫల్యం కోసం జరిగే ప్రయత్నం - కృషి, శ్రమ - మానవ సామాజిక సంబంధాలు ప్రాథమికాంశంగా, అంగంగా, మార్క్స్ భావించాడు. ఈ కోరికలు, తపనలు, ఉత్పత్తికి రూపమిచ్చాయి. స్త్రీలు, పురుషులు... సమాజాలలో- సమూహాలుగా- నివసించేటప్పుడే ఇవి సాధ్యమౌతాయి. "భౌతిక జీవనంలో ఉత్పత్తి విధాన రూపమే సామాన్యమైన సామాజిక, రాజకీయ, మేధోపర... జీవితాన్ని ప్రభావితం చేస్తుంది" (మార్క్స్). ఇది మార్క్స్ మౌలిక భావన. అందుచేతనే చరిత్రపట్ల ఆయనకున్న సంపూర్ణ దృష్టి వలన భావవాదులకు

విద్యార్థిగా మార్క్స్!

యవ్వన దశలో వుండే ఉత్సాహం, తన తండ్రి రాసిన లేఖల ప్రభావంతో మార్క్స్ 1835లో బాన్ యూనివర్శిటీలో న్యాయశాస్త్ర విద్యార్థిగా చేరారు. అయితే ఇతర అంశాల్లో వుండే ఆసక్తితో ఆయన అనేక పుస్తకాలు రాశారు. ప్రధానంగా చరిత్రపై మార్క్స్ రాసిన పుస్తకాలు లెక్కకు మించి వున్నాయి. న్యాయశాస్త్ర బోధనాంశాలతో పాటు మార్క్స్ రోమన్, గ్రీకు పురాణ గాథలు, హోమర్, ఆధునిక చరిత్ర వంటి అంశాల తరగతులకు కూడా హాజరయ్యేవారు. తన సృజనాత్మకతకు మరింత మెరుగులు దిద్దుకునేందుకు ఆయన బెల్జిస్ లేఖల ద్వారా ప్రయత్నించారు. ఈ దశలోనే ఆయన యూనివర్శిటీ పొయెట్స్ సర్కిల్ సభ్యునిగా ఎంపికయ్యారు. ఈ సంస్థకు గాటింగన్ యూనివర్శిటీ పొయెట్స్ సర్కిల్‌తో సన్నిహిత సంబంధాలుండేవి. ఇతర యూనివర్శిటీల విద్యార్థుల మాదిరిగానే బాన్ యూనివర్శిటీ విద్యార్థులు కూడా విద్యార్థి సంఘాలను నెలకొల్పారు. మార్క్స్ ట్రయర్ అసోసియేషన్‌లో చేరి దాని బోర్డ్ సభ్యుడిగా ఎంపికయ్యారు. కొన్ని సంప్రదాయాలను ప్రశ్నించటం మార్క్స్‌కు విద్యార్థి దశ నుండి సహజంగానే అలవాటయింది. తన తండ్రికి రాసిన లేఖల్లో కూడా మార్క్స్ తన సందేహాలను వ్యక్తం చేసేవారు. అటువంటి లేఖల్లో ఒక దానికి మార్క్స్ తండ్రి హెన్రిక్ జవాబిస్తూ మతం అనేది మానవుని నైతికతకు వేదికకగా పనిచేయాలని పేర్కొన్నారు. నీకు ఏ విషయమైనా ఆమూలాగ్రం తెలిసి వుండవచ్చు అయితే నమ్మకం అనేది మానవునికి అత్యంత ప్రధానమైనది అని హెన్రిక్ తన లేఖలో స్పష్టం చేశారు. ఇందుకు ఉదాహరణగా న్యూటన్, లీబ్నిజ్ వంటి శాస్త్రవేత్తలను ఆయన ఉదహరించారు. అయితే ఈ సమాధానం మార్క్స్‌ను అంతగా సంతృప్తి పర్చలేదు. బాన్ యూనివర్శిటీలో రెండు టెర్మ్‌లు గడిపిన మార్క్స్ తరువాత తన తండ్రి సలహా మేరకు తన విద్యాభ్యాసాన్ని బెర్లిన్ యూనివర్శిటీలో కొనసాగించారు. 1836లో బెర్లిన్ యూనివర్శిటీలో న్యాయశాస్త్ర విద్యార్థిగా మార్క్స్ చేరారు. ప్రెషియన్ రాజధాని నగరమైన బెర్లిన్‌లో జర్మనీ సమాజంలోని రెండు దశలను ఆయన గమనించారు. రాజకీయ అసమానతలు, ప్రబలిపోయిన బూర్జువా మనస్తత్వం, పెరిగిపోతున్న పేదరికం వంటి పరిస్థితులను మార్క్స్ గమనించారు. బెర్లిన్ యూనివర్శిటీలో మేధావులైన ఎందరో అధ్యాపకులు వివిధ అంశాలను బోధించేవారు. తర్కశాస్త్రాన్ని హెగెల్ బోధించగా ప్రముఖ అభ్యుదయ న్యాయవాది గాన్స్ న్యాయశాస్త్రాన్ని బోధించేవారు. గాన్స్ బోధనలకు ఆకర్షితుడైన కార్ల్ ఆయన్ను అత్యంత అవగాహన గల వ్యక్తిగా అభివర్ణించారు.

భిన్నంగా దీనిని 'చారిత్రక భౌతికవాదం'గా పిలుస్తారు (గుర్తిస్తారు). భావవాదులను చరిత్ర ఒక భావంగా, ఆవిష్కారమౌతుంది. అలాగే ఒకదైన చర్యగా లేదా మొరటుగా చెప్పాలంటే.... సహజసిద్ధమైన మతైక లేదా జాతి సంబంధమైన మేధగా దర్శనమిస్తుంది.

తర్వాతి కాలంలో మార్క్స్ చరిత్రకు పూర్వం మానవుని ఉనికిని గురించి తెలుసుకున్నాడు. అప్పుడు ఆహారసేకరణేకాని ఉత్పత్తి లేదు. (వేట, చేపలు పట్టడం, పండ్లు వగైరా ప్రోవు చేయడం మొదలైన మార్గాలుండేవి) మానవుడు అతి ప్రాథమికమైన వర్గరహిత సమాజాలలో ఉండేవాడు. (ఆదిమ కమ్యూనిజం) కాని వ్యవసాయం అందుబాటయ్యే సరికి, మానవుడు కనీస అవసరానికి మించి "మిగులు" ఉత్పత్తి ఏర్పడింది. ఇప్పుడు... సమాజం...వర్గాలుగా విడబోతోంది. ఉత్పత్తి చేసేవారు, మిగులు ఉత్పత్తిని వదులుకోమని ఉత్పత్తిదారులను బలవంతం చేసే వారు. ఈ రెండో వర్గం వారు బలప్రయోగం చేసి ఉత్పత్తిదారులను వంచారు. వారే రాజ్యాన్ని సృష్టించారు. వ్యక్తిగతమైన ఆస్తిని సృష్టించారు. మానవులు కొందరికి బానిసలుగా అంటే సొంత ఆస్తిగా మారిపోయారు (మార్చబడ్డారు)... అలాగే ఇళ్ళు పొలాలు కూడా. ఆ కోణం నుంచి... భౌతిక వాంఛల సాఫల్యానికి వెదుకులాట... ఒక పోరాటంగా మారింది "మిగులు" సరుకు (సంపదవగైరా)ను పెంచుకోవడం మానవ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని తెరిచిందనవచ్చును. అందువలన మానవ సమాజం.... దోపిడీ వ్యవస్థగా పరిణమించింది. కాబట్టి ఇప్పటి వరకు గడిచిన సమాజ చరిత్ర వర్గపోరాటాల చరిత్రగా రూపొందింది" (కమ్యూనిస్టు ప్రణాళిక)

వర్గపోరాటం దోపిడీ సమాజాల క్రమాన్ని నడిపిస్తున్నదంటే... ఇందులో పాత్ర వహిస్తున్న సమాజాలూ వర్గాలూ నిరంతరం మార్పులకు లోనవుతున్నాయన్నమాట. ప్రతిదీ నిరంతరం మారుతూనే ఉంటుందనేదే.. మార్క్స్ విశ్వసించిన 'మార్పులేని లేని సూత్రం. అలా అయినప్పుడు మొత్తం మార్పుల సంకీర్ణత... మూకుమ్మడి మార్పులకు అవకాశం కలిగించిందన్నమాట. దీనివల్ల విడివిడి 'సామాజిక రూపాల'కు అవకాశం కలిగించిందన్నమాట. అందువలన విడివిడి 'సామాజిక రూపాల' వరుస-క్రమం-వలె మానవ చరిత్ర కనబడుతుంది. ఏ సామాజిక రూపమైనా ఉత్పత్తికి సంబంధించిన అజమాయిషీ నిర్మాణ చట్రం, నిర్వహణా అన్న అంశాల ప్రాతిపదికపై రూపొందే ఏ సామాజిక రూపమైనా కొనసాగాలంటే రెండు పనులు జరగాలి. (1) ఉత్పత్తి క్రమం (2) ఉత్పత్తిదారుడు ఆ క్రమానికి కోల్పోగలిగిన వాటా (తనకు లభించే ఉత్పత్తిలో భాగం) దీనికే ఉత్పత్తి సంబంధాలని మార్క్స్ పేరుపెట్టాడు. ఈ సంబంధాలను ఉత్పత్తి విధానాలంటారు. అంటే ఆయా కాలాల్లో వ్యాప్తిలో ఉన్న పరికరాలూ, సాంకేతిక శాస్త్రమూ, యూరప్‌ను దృష్టిలో ఉంచుకొని.... బానిస విధానంపై ఆధారపడిన సామాజిక రూపాన్ని ప్రాచీన సమాజమనీ, ఆ తర్వాత అర్ధబానిసత్వ విధానమున్న సమాజాన్ని భూస్వామ్య సమాజమనీ, చివరగా పెట్టుబడిదారీ విధాన ఉత్పత్తి విధానం అమలులోకి వచ్చిన సమాజాన్ని బూర్జువా సమాజమనీ - ఈ సందర్భంలో కర్మాగారాల

(మిగతా 18వ పేజీలో)

వర్గపోరాటం దోపిడీ సమాజాల క్రమాన్ని నడిపిస్తున్నదంటే... ఇందులో పాత్ర వహిస్తున్న సమాజాలూ వర్గాలూ నిరంతరం మార్పులకు లోనవుతున్నాయన్నమాట. ప్రతిదీ నిరంతరం మారుతూనే ఉంటుందనేదే.. మార్క్స్ విశ్వసించిన 'మార్పులేని లేని సూత్రం. అలా అయినప్పుడు మొత్తం మార్పుల సంకీర్ణత... మూకుమ్మడి మార్పులకు అవకాశం కలిగించిందన్నమాట.

కేంద్రీకరించాల్సిన నాలుగు అంశాలు

మార్చి 3,4 తేదీల్లో జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కేంద్ర కమిటీ పలు అంశాలను కూలంకషంగా చర్చించింది. సమావేశంలో ఆమోదించిన తీర్మానం ఈ విధంగా ఉంది. పాఠకుల సౌకర్యార్థం పూర్తిపాఠాన్ని ఇస్తున్నాం.

-సంపాదకుడు

ఇరాక్‌పై దురాక్రమణకు, సైనిక దాడికి అమెరికా తీవ్రంగా ప్రయత్నించడాన్ని సిపిఎం కేంద్రకమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. గత రెండు మూడు నెలలుగా విశ్వవ్యాప్తంగా ప్రజలకు అమెరికా సాగిస్తున్న యుద్ధ ప్రయత్నాలకు వ్యతిరేకంగా ప్రజాతంత్ర యుతంగా తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ ప్రపంచవ్యాప్త నిరసనను అమెరికా ఘోరంగా ధిక్కరిస్తోంది. తాను ప్రారంభించ దలచిన అక్రమ యుద్ధానికి ఐక్యరాజ్యసమితి భద్రతామండలి మరో తీర్మానం ఆమోదించడం ద్వారా తన చర్యలకు ఆమోదం పెంపొందించేందుకుగాను భద్రతామండలి సభ్యదేశాలను బెదిరించడం, ప్రలోభపెట్టడం వంటి చర్యలకు పాల్పడుతున్నది. భద్రతామండలిలోని మెజారిటీ దేశాలు యుద్ధానికి వ్యతిరేకంగా ఉన్నాయి. మండలిలో శాశ్వత సభ్యదేశాలు ఫ్రాన్స్, రష్యా, చైనాలు తమ యుద్ధవ్యతిరేకతను పునరుద్ఘాటించాయి. అంతేకాక ఐరాస ఆయుధ పరిశీలకులు తమ కర్తవ్యాన్ని నిర్విఘ్నంగా కొనసాగించేందుకు అవకాశం ఇవ్వాలని ఈ దేశాలు డిమాండ్ చేస్తూవచ్చాయి. ఆయుధ పరిశీలకులకు ఇరాక్ సహకరిస్తున్న ఫలితంగానే ఇరాక్‌కు చెందిన స్వల్పశ్రేణి క్షిపణులు-అల్‌సమద్- ధ్వంసం చేయడం ప్రారంభం అయింది. తన చర్యలకు భద్రతామండలి ఆమోదాన్ని పొందటంలో అమెరికా విఫలం అయ్యేందుకు అవకాశాలు బలంగా ఉన్నప్పటికీ బుష్ యుద్ధానికి సన్నద్ధమవుతున్నారు. బుష్, బ్రిటన్ ప్రధాని బ్లెయిర్‌లు సద్దాంహుస్సేన్‌ను పదవీచ్యుతుని చేసి ఇరాక్‌ను పాదాక్రాంతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఐరాస భద్రతామండలి అమెరికా ఒత్తిళ్లకు లొంగలేదు. సమితి సభ్యదేశంపై మరో దేశం దురాక్రమణకు పాల్పడడానికి, సభ్యదేశ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించేందుకు ఐరాస సాధనంగా మారలేదు. అమెరికా యుద్ధ సన్నాహాలకు వ్యతిరేకంగా భారత ప్రభుత్వం నిర్దిష్ట వైఖరి తీసుకునేందుకు బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం తిరస్కరిస్తోంది. పార్లమెంట్‌లో గానీ, మలేషియాలో జరిగిన అలీన దేశాల సదస్సులో గానీ యుద్ధానికి వ్యతిరేకంగా నికరమైన విధానం అవలంభించేందుకు తిరస్కరించింది. వాజ్‌పేయి స్వయంగా చెప్పినట్లు భారత్ మధ్యంతర మార్గాన్ని చేపట్టడం అంటే దొడ్డిదోవన అమెరికా యుద్ధ ప్రణాళికలను సమర్ధించడం తప్ప మరోటి కాదు. దేశవ్యాప్తంగా యుద్ధ వ్యతిరేక ఉద్యమం ప్రారంభించాలని సిపిఎం కేంద్రకమిటీ పిలుపు నిస్తోంది. అన్ని కమిటీలు ఈ కర్తవ్యాన్ని ప్రాధాన్యత ప్రాతిపదికన అమలు చేయాలి. వామపక్ష ప్రజాతంత్ర శక్తులను సమీకరించి పటిష్టమైన యుద్ధ వ్యతిరేక ఉద్యమాన్ని నిర్మించటమే కాక యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ భారత ప్రభుత్వం దౌత్యపరమైన రాజకీయ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేయాలి.

దేశవ్యాప్తంగా యుద్ధ వ్యతిరేక ఉద్యమం ప్రారంభించాలని సిపిఎం కేంద్రకమిటీ పిలుపు నిస్తోంది. అన్ని కమిటీలు ఈ కర్తవ్యాన్ని ప్రాధాన్యత ప్రాతిపదికన అమలు చేయాలి. వామపక్ష ప్రజాతంత్ర శక్తులను సమీకరించి పటిష్టమైన యుద్ధ వ్యతిరేక ఉద్యమాన్ని నిర్మించటమే కాక యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ భారత ప్రభుత్వం దౌత్యపరమైన రాజకీయ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేయాలి.

జాతీయ పరిస్థితి

గుజరాత్ ఎన్నికల తర్వాత బిజెపి-ఆరెస్సెస్‌లు తమ మతోన్మాద హిందుత్వ అజెండాను మరింత వేగంగా ముందుకు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ మధ్య కాలంలో విహెచ్‌పి రామమందిరం ఆందోళనను పునః ప్రారంభించడం, దానికి కేంద్రం స్పందన దీనికి నిదర్శనం. విహెచ్‌పి చట్ట విరుద్ధ డిమాండ్‌ను నెరవేర్చేందుకు వీలుగా అయోధ్యలో కేంద్రం స్వాధీనం చేసుకున్న ప్రాంతంలో యథాతథ స్థితి కొనసాగించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాన్ని పునఃపరిశీలించాలని పక్షపాతంతో పిటిషన్ దాఖలు చేసింది. గతంలో బాబ్రీ మసీదు

ఉన్న ప్రాంతం చుట్టూ యథాతథ పరిస్థితిలో ఎటువంటి మార్పూ ఉండరాదు. చట్టపరంగా ఈ వివాదం పరిష్కారం అయ్యేవరకు ఇదే పరిస్థితి కొనసాగాలి.

మతపరమైన విద్వేషాలు రెచ్చగొట్టే ఇటువంటి అంశాలు ఒక పద్ధతి ప్రకారం లేవనెత్తటాన్ని సిపిఎం కేంద్రకమిటీ తీవ్రంగా ఖండిస్తోంది. మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ధర్‌లోని భోజ్‌శాల ఉదంతం, రాజస్థాన్‌లలో ఇటువంటి మరికొన్ని సమస్యలు లేవనెత్తేందుకు పరివారం మోసపూరిత ప్రయత్నాలు చేయటం వంటివి మైనారిటీ మతస్థులను రెచ్చగొట్టేందుకు, మతపరమైన విభజన తెచ్చేందుకు ఉద్దేశించివి. ఈ విధంగా గుజరాత్ విజయాలను సొమ్ము చేసుకునేందుకు, గుజరాత్ తరహా చర్యలు ఇతర ప్రాంతాల్లో మళ్లీ అనుసరించేందుకు బిజెపి యోచిస్తోంది. హిమాచల్ ప్రదేశ్ ఎన్నికల ఫలితాలు మెజారిటీ ప్రజానీకం ఈ విధానాలు సమర్థించడం లేదని రుజువు చేస్తున్నాయి. ఎన్నికల ప్రచారంలో అన్నిరకాల మతోన్మాద విషయాలు లేవనెత్తేందుకు ప్రయత్నించినా ఆ రాష్ట్ర ప్రజలు మాత్రం ధుమాల్ ప్రభుత్వ అవినీతి, దుష్పరిపాలనలపైనే దృష్టి సారించి బిజెపిని గద్దె దించారు. రానున్న రోజుల్లో ఢిల్లీ తరహా మతోన్మాద ప్రచారం కొనసాగుతూనే ఉన్నది. ఇటువంటి మతసామరస్యాన్ని విచ్ఛిన్నం చేసే మతోన్మాద ప్రచారాన్ని ప్రతిఘటిస్తూ వామపక్ష ప్రజాతంత్ర శక్తులు ప్రచారం ప్రారంభించాలని కేంద్రకమిటీ పిలుపునిస్తోంది.

కాంగ్రెస్ రాజీధోరణి

మతోన్మాద ప్రమాదాన్ని ఎదిరించడంలో కాంగ్రెస్ ఊగిసలాడడాన్ని మతోన్మాదశక్తులతో రాజీపడే ధోరణిని సిపిఎం కేంద్రకమిటీ తీవ్రంగా విమర్శిస్తోంది. మతోన్మాదాన్ని రెచ్చగొట్టే విషయాలపై కాంగ్రెస్ రాజీ ధోరణి అనుసరిస్తుందని చెప్పేందుకు భోజ్‌శాల ఉదంతంలో ఆ పార్టీ ముఖ్యమంత్రి దిగ్విజయ్ సింగ్ అనుసరించిన వైఖరి తాజా ఉదాహరణ. గోవధను, ఎద్దుమాంసపు ఉత్పత్తులను ఎగుమతి చేయటాన్ని నిషేధిస్తూ జాతీయ చట్టం తేవాలని డిమాండ్ చేస్తూ దిగ్విజయ్ సింగ్ ప్రధానికి లేఖ రాశారు. దిగ్విజయ్ సూచనల మేరకు మధ్య ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఈ సమస్యపై ప్రచారం ప్రారంభించింది. అంతేకాక భోజ్‌శాల సమస్యపై కూడా దిగ్విజయ్ సింగ్ నికరమైన వైఖరి తీసుకోలేదు. ఆయన కేంద్రానికి చేసిన సిఫార్సులు ఆధారంగా ఆర్‌ఎస్‌ఎస్ ప్రారంభించిన సంఘానికి మరిన్ని రాయితీలు ఇస్తూ మసీదు లోపల ప్రార్థనలు చేసేందుకు కేంద్రం అనుమతించింది. బిజెపిని అధిగమించేందుకు చేపడుతున్న ఇటువంటి చర్యలు వాస్తవానికి మతోన్మాద ఎజెండాకు చట్టబద్ధత కల్పించటానికే దారితీస్తుంది. దేవం బారీమూల్యం చెల్లించాల్సి వచ్చే ఇటువంటి చర్యలు విరమించుకోవడం కాంగ్రెస్ ముందున్న లక్ష్యం.

మతోన్మాద ప్రమాదాన్ని ఎదిరించడంలో కాంగ్రెస్ ఊగిసలాడడాన్ని మతోన్మాదశక్తులతో రాజీపడే ధోరణిని సిపిఎం కేంద్రకమిటీ తీవ్రంగా విమర్శిస్తోంది. మతోన్మాదాన్ని రెచ్చగొట్టే విషయాలపై కాంగ్రెస్ రాజీ ధోరణి అనుసరిస్తుందని చెప్పేందుకు భోజ్‌శాల ఉదంతంలో ఆ పార్టీ ముఖ్యమంత్రి దిగ్విజయ్ సింగ్ అనుసరించిన వైఖరి తాజా ఉదాహరణ.

ఆర్థిక పరిస్థితి

దేశ ఆర్థిక పరిస్థితి స్తబ్ధతకు లోనుకావడం, ఈ ఆర్థిక సంవత్సరంలో స్థూలజాతీయోత్పత్తి 4.4 శాతానికి పడిపోవడం పట్ల సిపిఎం కేంద్రకమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. 2002లో సంభవించిన కరువు తీవ్రత ఎంతగా ఉందంటే వ్యవసాయ రంగంలో 3.3 శాతం ప్రతికూల వృద్ధిరేటు నమోదు అయింది. ప్రపంచ చమురు ధరలు తీవ్రంగా పెరగడంతో విదేశీ మారక నిల్వల్లో అసమతౌల్యం తలెత్తే ప్రమాదం కనిపిస్తోంది. ఈ పరిస్థితుల్లో సామాన్యుల జీవన స్థితిగతులు నానాటికీ దిగజారుతున్నాయి. కరువు పీడిత ప్రాంతంలో ఆకలి, పోషక విలువల లోపం స్పష్టంగా వెల్లడయ్యింది. అనంతర పరిణామాలపై కూడా పలు రాష్ట్రాల్లో కరువు ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. అనేకచోట్ల రైతులు తమ పంటను నష్టపోయారు. తిరిగి విత్తడానికి కూడా వారివద్ద డబ్బులు లేదు. ప్రభుత్వాలు ప్రకటించిన అరకొర సాయం ద్వారా రైతులకు ఒరిగింది ఏమీ లేదు. నిలువెత్తున పేరుకుపోయిన ఎఫ్‌సిఐ (ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) నిల్వలు ప్రజాపంపిణీ వ్యవస్థ వైఫల్యాన్ని ఎత్తిచూపేదిగా ఉన్నది. 10వ పంచవర్ష ప్రణాళిక ముసాయిదా దేశంలో ఉపాధికల్పన సామర్థ్యం తగ్గిపోతుందని అంగీకరించింది. ఈ పరిస్థితుల్లో కేంద్రం ప్రతిపాదించిన నూతన బడ్జెట్ ప్రజల జీవితాలను మరింత అధ్వాన్నం చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలతో ముందుకు వచ్చింది. పూర్వపు బడ్జెట్‌ల వలె ఇది కూడా బహిరంగంగా సంపన్న వర్గాల బడ్జెట్‌గానూ, పేదల వ్యతిరేకంగానూ బడాపెట్టుబడిదారులకు భారీ ఎత్తున ఆర్థిక రాయితీలు ఇచ్చేదిగానూ, జీవన వ్యయం మరింత భారంగా మార్చేది గానూ ఉన్నది. నేడు దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న రెండు కీలక సమస్యలు –ఉపాధి అవకాశాల పతనం, వ్యవసాయరంగంలో సంక్షోభం గురించి– ప్రస్తావించనే లేదు. వ్యవసాయోత్పత్తుల పతనంతో కునారిల్లుతున్న రైతాంగానికి బడ్జెట్ ప్రసాదించిన ఉపశమనం ఏమీ లేదు. అంతేగాక పంటల ధరలు పతనమవుతున్న సమయంలోనే ఎరువుల ధరలు పెంచింది. చిన్న తరహా పరిశ్రమలకు కేటాయించిన ఉత్పత్తులను వీటి పరిధి నుండి తొలగించడం ద్వారా ఈ రంగంలో అంతంత మాత్రంగా ఉన్న ఉపాధి

అవకాశాలపై వేటుపడింది. దిగుమతి సుంకాలు తగ్గించడం ద్వారా ఈ ప్రమాదం మరింత పెరగనున్నది. దిగుమతుల కారణంగా పోటీని ఎదుర్కొంటున్న చిన్న పరిశ్రమలకు అత్యధిక కస్టమ్స్ సుంకం 30 నుండి 25 శాతానికి తగ్గించడం మరింత ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తుంది. ప్రావిడెంట్ ఫండ్ రేటుతో సహా చిన్న మొత్తాల పొదుపుపై వడ్డీరేట్లు మరింత తగ్గించడం సామాన్య ప్రజలు, పింఛన్ దారులకు మరింత భారంగా మారనున్నది. డీజిలుపై 50 పైసలు సుంకం విధిచడంతో దీని ప్రభావం మిగిలిన అన్ని రంగాలపైనా ప్రతికూలంగా ఉండనున్నది. వ్యవసాయరంగం పై కూడా ప్రతికూల ప్రభావం తప్పదు. కల్తీని నియంత్రించడం అనే పేరుతో అదనంగా తేలికపాటి డీజిలుపై లీటరుకు ఒకటిన్నర రూపాయలు ఎక్సైజ్ సుంకం విధించడం అంతిమంగా వ్యవసాయదారుల ఉత్పత్తి పరిస్థితిపైనా, సామాన్యప్రజల జీవన ప్రమాణాలపైనా ప్రతికూల ప్రభావాన్ని చూపనున్నది. బడ్జెట్ ప్రతిపాదనల కారణంగా ప్రతికూల ప్రభావానికి, ఆర్థిక భారాలకు గురవుతున్న వివిధ వర్గాల ప్రజలను సమీకరించి ఆర్థిక భారాలు ఉపసంహరించుకోవాలన్న డిమాండ్‌పై ఆందోళన ప్రారంభించాల్సిందిగా పార్టీ కేంద్రకమిటీ స్థానిక కమిటీలకు పిలుపునిస్తోంది.

జలవనరుల వినియోగంపై

నదుల అనుసంధానాన్ని పరిశీలించేందుకు వివిధ శాఖలలో నిష్ణాతులైన నిపుణులతో కమిటీని ఏర్పాటు చేయాలని కేంద్ర కమిటీ కోరింది. ఆ కమిటీ చేసే ప్రతిపాదనలను చర్చించి వాటి అమలుకు చర్యలు తీసుకోవా లని సూచించింది. సాగునీరు- తాగునీరు కొరత, కరువు, వరదలు వంటి సమస్యలను ప్రాధాన్యతా ప్రాతిపదికన పరిష్కరించాలని కేంద్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. సమస్యలను ఎలా పరిష్కరించాలన్న విషయంపై సమగ్ర, శాస్త్రీయ అధ్యయనం అవసరమని నొక్కిచెప్పింది.

ముతుంగ దాడి

కేరళలోని వైనాడ్ జిల్లాలో ఆదివాసీలపై అణచివేత చర్యలు, పోలీసుల కాల్పులను కేంద్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనలపై న్యాయ విచారణకు యుడిఎఫ్ ప్రభుత్వం తిరస్కరిస్తోంది. భూమిలేని ఆదివాసీలకు భూమిని ఇచ్చే విషయంలో ఆంటోని ప్రభుత్వం విఫలమైంది. ఎల్‌డిఎఫ్, ఇతర సంఘాలు డిమాండ్ చేస్తున్నట్లుగా వైనాడ్ ఘటనలపై న్యాయ విచారణ జరిపించాలని కేంద్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది.

సమన్వయంతో ఉద్యమాలు సాగించాలి

ప్రస్తుత పార్లమెంటు సమావేశాలు జరుగుతుండగానే ఒకరోజు సార్వత్రిక సమ్మె జరపాలని జాతీయ కార్మిక సంఘాలు ఫిబ్రవరి 26న పార్లమెంటు వరకు జరిపిన ప్రదర్శన సందర్భంగా తీసుకున్న నిర్ణయం పట్ల కేంద్ర కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ప్రజాసంఘాలు వేటికవి విస్తృతంగా ప్రచారం చేయాలని అదే సమయంలో వారి ఉద్యమాలను సమన్వయం చేసుకుంటూ సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని అపుడే దేశవ్యాప్తంగా శక్తివంతమైన నిరసన వెల్లడౌతుందని కేంద్రకమిటీ పేర్కొంది.

పార్టీ విడిగా స్వంత ప్రచారాన్ని సాగించాలని, రానున్న కాలంలో నాలుగు ప్రధాన సమస్యలపై పోరాటాన్ని సాగించాలని కేంద్ర కమిటీ పిలుపునిచ్చింది.

1. అందులో మొదటిది అనివార్యంగా కనిపిస్తున్న ఇరాక్‌పై అమెరికా యుద్ధం. రానున్న కొద్ది వారాల్లో అమెరికా యుద్ధాన్ని ప్రారంభించడానికి ముందు అన్ని తరగతుల ప్రజలను, రాజకీయ శక్తులను పార్టీ యూనిట్లు సమీకరించాలి. దానివల్ల దేశవ్యాప్తంగా శక్తివంతమైన యుద్ధ వ్యతిరేక ఉద్యమం అభివృద్ధి అవుతుంది.

2. ఆర్ఎస్ఎస్ దాని అనుబంధ సంఘాల కుట్రలకు వ్యతిరేకంగానూ, మత ఉద్రిక్తతలు సృష్టించడం కోసం వాటితో కలిసి బిజెపి ఆడుతున్న నాటకాలకు వ్యతిరేకంగానూ పార్టీ విస్తృత ప్రచారం చేపట్టాలి. దేశంలో మతసామరస్యాన్ని కాపాడడానికి, లౌకిక విలువలను రక్షించడానికి గాను ప్రచారం చేయాలి.

3. డీజిల్, ఎరువుల ధరల పెంపుదలతోపాటు చిన్నతరహా పరిశ్రమలకు నష్టం కల్గించేటటువంటి బడ్జెట్ ప్రతిపాదనలతో ప్రజల జీవనంపై పెరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పార్టీ అన్ని యూనిట్లు నిరసన కార్యక్రమాలు చేపట్టాలి.

4. ప్రజాపంపిణీ వ్యవస్థను సార్వత్రీకరించాలన్న డిమాండ్‌పై ఆందోళన జరపాలి. అది నెరవేరే వరకు పేదరిక రేఖ దిగువనున్న వారికి గుర్తింపు కార్డులివ్వాలి. గ్రామీణ, పట్టణ పేదలకు చౌక ధరలపై తగినన్ని ఆహార ధాన్యాలను ఇవ్వాలి.

ప్రజాసంఘాలు వేటికవి విస్తృతంగా ప్రచారం చేయాలని అదే సమయంలో వారి ఉద్యమాలను సమన్వయం చేసుకుంటూ సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని అపుడే దేశవ్యాప్తంగా శక్తివంతమైన నిరసన వెల్లడౌతుందని కేంద్రకమిటీ పేర్కొంది. పార్టీ విడిగా స్వంత ప్రచారాన్ని సాగించాలని, రానున్న కాలంలో నాలుగు ప్రధాన సమస్యలపై పోరాటాన్ని సాగించాలని కేంద్ర కమిటీ పిలుపునిచ్చింది.

భారత బడా బూర్జువా వర్గం దళారీగా మారిందా?

గుడిపూడి విజయరావు

ప్రపంచీకరణ వాతావరణంలో సామ్రాజ్య వాదం కొత్తరూపు సంతరించుకుంది. లెనిన్ 'సామ్రాజ్యవాదం – పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ' గ్రంథంలో ఫైనాన్స్ పెట్టుబడి పారిశ్రామిక, బ్యాంకింగ్ పెట్టుబడుల సమ్మిళితం. ఒక్కో సామ్రాజ్యవాద దేశానికి చెందిన ఫైనాన్స్ పెట్టుబడి ఆ దేశాన్ని ఆధారంగా చేసుకొని పని చేస్తుంది. ఈ దేశాలు తమ పరిశ్రమలకు ముడి సరుకుల కోసం, ఉత్పత్తులకు మార్కెట్ కోసం వలస దేశాలపై ఆధిపత్యం కోసం పరస్పరం కలహించుకుంటాయి. ఈ కలహాలు, వైరుధ్యాల మూలంగా యుద్ధాలు సంభవిస్తాయి. ప్రధమ, ద్వితీయ ప్రపంచ సంగ్రామాలు ఈ వైరుధ్యాల ఫలితమే. కాని నేటి ప్రపంచీకరణ పరిస్థితిలో ఫైనాన్స్ పెట్టుబడి స్వభావం మారిపోయింది. ఇది ప్రధానంగా ద్రవ్య పెట్టుబడి. ఇది అత్యధికంగా స్పెక్యులేటివ్ పెట్టుబడి. ఇది ప్రధానంగా ద్రవ్య పెట్టుబడి. ఇది అత్యధికంగా స్పెక్యులేటివ్ పెట్టుబడి. దీనికి ఉత్పత్తి కార్యకలాపాలతో సంబంధంలేదు. ఇది దేశాల మధ్య నిర్నిరోధంగా ప్రవహిస్తుంటుంది. ఈ ఫైనాన్స్ పెట్టుబడిని గతంలో మాదిరిగా ఫలానా దేశానికి సంబంధించినదని చెప్పలేము. అందువల్ల సామ్రాజ్యవాద దేశాలు తమ తమ ఫైనాన్స్ పెట్టుబడుల తరపున గతంలో మాదిరి పరస్పరం తీవ్రస్థాయిలో తలపడే పరిస్థితి నేడు లేదు. అయితే సామ్రాజ్యవాద దేశాల మధ్య వైరుధ్యాలు లోలోపల కొనసాగుతూనే ఉన్నాయి. అవి అప్పుడప్పుడు బయటపడుతూనే ఉన్నాయి. ఇరాక్ విషయంలో సామ్రాజ్యవాద దేశాల వైఖరిలో తేడాలు దీనికి ఒక ఉదాహరణ. ఇలాంటి విభేదాలున్నప్పటికీ ఈ దేశాలన్నీ కలసి ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు, డబ్ల్యుటిఓ లాంటి అంతర్జాతీయ సంస్థల ద్వారా సమిష్టిగా తృతీయ ప్రపంచ దేశాలను దోచుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ సమిష్టి దోపిడీకి అమెరికా నాయకత్వం వహిస్తోంది.

ఇదే సమయంలో తృతీయ ప్రపంచదేశాలకు చెందిన బూర్జువా వర్గానికి, సామ్రాజ్యవాదానికి మధ్య వైరుధ్యంలో కూడా మార్పు చోటుచేసుకున్నది. తృతీయ ప్రపంచ దేశాల్లో అధికారంలోకి వచ్చిన బూర్జువా వర్గ ప్రభుత్వాలు స్వతంత్రంగా పెట్టుబడిదారీ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి ప్రయత్నం చేశాయి. ప్రభుత్వరంగాన్ని నిర్మించడం ద్వారాను, సోవియట్, ఇతర సోషలిస్టు దేశాల సహకారాన్ని ఉపయోగించుకోవడం ద్వారాను సామ్రాజ్యవాదం నుండి సాపేక్ష స్వతంత్ర పంధాను ఈ బూర్జువా వర్గం అనుసరించింది. కానీ సామ్రాజ్యవాద దశలో పెట్టుబడిదారీ వ్యవస్థలో నిరంతర అభివృద్ధిని సాధించడం అసాధ్యం. భూస్వామ్య వర్గంతో కూడా పొత్తు పెట్టుకోవడంతో ప్రజాతంత్ర విప్లవ క్రమాన్ని ఈ బూర్జువా వర్గం ముందుకు తీసుకుపోలేకపోయింది. ఫలితంగా ఈ పెట్టుబడిదారీ పంథా సంక్షోభంలో పడిపోయింది. ఈ స్థితిలో తృతీయ ప్రపంచ దేశాలలో బూర్జువా వర్గ ప్రభుత్వాలు సరళీకృత ఆర్థిక విధానాలను చేపట్టాయి. సామ్రాజ్యవాదుల ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రపంచీకరణ క్రమంలో భాగస్వాములయ్యాయి. తమ దేశాలలోని ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా కొనుగోలు చేయడంలోను, బహుళజాతి సంస్థల దోపిడీలోను సామ్రాజ్యవాద దేశాలతో చేతులు కలుపుతూ జూనియర్ భాగస్వాములుగా మారిపోతున్నాయి. సోవియట్ యూనియన్, ఇతర సోషలిస్టు దేశాలు కుప్పకూలడం కూడా ఈ క్రమాన్ని కొంత అధికం చేసింది. సామ్రాజ్యవాద దేశాలు, బహుళజాతి సంస్థలకు, తృతీయ ప్రపంచ దేశాలలోని బడా బూర్జువా వర్గానికి, దానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రభుత్వాలకు మధ్య తేడా అంతరించి, పూర్తిగా మమేకమైనట్లు పైకి కనిపిస్తుంది. దీన్ని కొంతమంది తృతీయ ప్రపంచ దేశాల బూర్జువా వర్గం మళ్లీ కాంప్రెడారీకరించబడుతున్నదని, లేదా దళారీ స్వభావాన్ని సంతరించుకుంటున్నదని చెబుతున్నారు. కానీ ఇది సరికాదు.

ఇటువంటి పొరపాటు అభిప్రాయాన్నే గత జనవరి 19వ తేదీ విశాలాంధ్ర, ఆదివారం అనుబంధంలో 'సామ్రాజ్యవాదం – ప్రస్తుత దశ' అన్న

నేటి ప్రపంచీకరణ పరిస్థితిలో ఫైనాన్స్ పెట్టుబడి స్వభావం మారిపోయింది. ఇది ప్రధానంగా ద్రవ్య పెట్టుబడి. ఇది అత్యధికంగా స్పెక్యులేటివ్ పెట్టుబడి. ఇది ప్రధానంగా ద్రవ్య పెట్టుబడి. ఇది అత్యధికంగా స్పెక్యులేటివ్ పెట్టుబడి. దీనికి ఉత్పత్తి కార్యకలాపాలతో సంబంధంలేదు. ఇది దేశాల మధ్య నిర్నిరోధంగా ప్రవహిస్తుంటుంది. ఈ ఫైనాన్స్ పెట్టుబడిని గతంలో మాదిరిగా ఫలానా దేశానికి సంబంధించినదని చెప్పలేము.

పేరుతో రాసిన వ్యాసంలో కారుమంచి వెంకటేశ్వరరావు గారు వ్యక్తం చేశారు. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ గురించి సరియైన విధంగానే వివరించినప్పటికీ, వర్ధమాన దేశాలకు సంబంధించి ఆయన ఇలా పేర్కొన్నారు. "నూతన సామ్రాజ్యవాద దశలో వర్ధమాన దేశాలలో నయా వలస విధానం అమలుజరుగుతున్నదనేది వాస్తవం. సామ్రాజ్యవాద జెండాలు మాత్రం తొలగించబడ్డాయి. నయా ఉదారవాద విధానాలు స్థానిక బూర్జువా పాలకవర్గాల సహకారంతో అమలు జరుగుతున్నాయి. స్థానిక పెట్టుబడిదార్లకు, ప్రపంచ బహుళ జాతి సంస్థలతో భాగస్వాములుగా చేరి లాభాలు పంచుకోవడం సులువుగావుంది. మన దేశంలో బూర్జువా వర్గ ప్రయోజనాలు, బహుళజాతి కంపెనీల ప్రయోజనాలు ఒక్కటే! మన పాలక బూర్జువా వర్గం పరిపూర్ణ కాంప్రెడారీ (దళారీ) వర్గం. (ఇందుకు కారణాలు 'ప్రపంచీకరణ-నూతన దశ' పుస్తకంలో ఇవ్వబడ్డాయి)" అని రచయిత పేర్కొన్నారు. ఆ పుస్తకంలో ఇంకా ఇలా వివరించారు. "కాంప్రెడార్ (దళారీ) బూర్జువా క్రమం ఏ మేరకు, ఎంత శాతం జరిగిందన్న విషయంలో స్వల్ప భిన్నాభిప్రాయాలుండవచ్చు. కానీ అది ఆగుతుందని లేక తిరోగమనమవుతుందని భావించడం భ్రమ".

భారతదేశంలో పాలక బూర్జువా వర్గం సంపూర్ణంగా కాంప్రెడారీకరణ చెందిందని రచయిత ఇంత బలంగా నొక్కిచెప్పారు. 1990వ దశకంలో భారత బడా బూర్జువా వర్గం విదేశీ ఫైనాన్స్ పెట్టుబడితో మరింత మిలాఖతయిందన్నది స్పష్టమే. అందువల్లనే బూర్జువా వర్గాన్ని కాంప్రెడార్ అని చెప్పాలా అన్న ప్రశ్న తలెత్తింది. అయితే ఇది కొద్ది దశాబ్దాల క్రితం నక్సలైట్లు తెచ్చిన 'కాంప్రెడార్ బూర్జువా' వాదనలాంటిది కాదు. బడా బూర్జువా వర్గపు 'మిలాఖత్తు' స్వభావాన్ని ముఖ్యంగా ప్రపంచీకరణ వాతావరణంలో అర్థం చేసుకోవడంలో గందరగోళం వల్లనే ఈ చర్చ ఇప్పుడు తలెత్తింది.

కాంప్రెడార్ బూర్జువా వర్గం అనేది చరిత్రలో ఒక నిర్దిష్టమైన దశకు సంబంధించినది. కానీ మళ్లీ ఇపుడు అదే కాంప్రెడార్ బూర్జువా వర్గం తలెత్తడం అసాధ్యం. మరింత స్పష్టత కోసం అసలు కాంప్రెడార్ బూర్జువా వర్గం అంటే ఏమిటో తెలుసుకుందాం. 1928లో కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ 6వ మహాసభ కాంప్రెడార్ బూర్జువా అంటే "సామ్రాజ్యవాద కేంద్రాలతో వాణిజ్యం చేసే స్థానిక వ్యాపారులు. సామ్రాజ్యవాద దోపిడీ కొనసాగింపుతో వీరి ప్రయోజనాలు ముడివడి ఉంటాయి. వలస దేశాల ప్రజలను దోపిడీచేయడానికి వారు ఏజంట్లుగా ఉపయోగపడతారు" అని చెప్పింది. "వలస లేదా, పరాధీన దేశంలో కాంప్రెడార్ బూర్జువా వర్గం ప్రధానంగా వాణిజ్య కార్యకలాపాలను నిర్వహిస్తుంది. దేశీయంగా లభించే ముడి సరుకులను ఎగుమతి చేస్తూ, సామ్రాజ్యవాద దేశాలనుండి పారిశ్రామిక వస్తువులను దిగుమతిచేసుకుంటాయి." అని కూడా పేర్కొంది.

నేడు భారత బడా బూర్జువా వర్గం ఇలా మారిందని చెప్పగలమా? తృతీయ ప్రపంచ దేశాలలోని బడా బూర్జువా వర్గపు ద్వంద్వ స్వభావాన్ని అర్థం చేసుకుంటే ఎటువంటి గందర గోళానికి చోటుండదు. ఈ బూర్జువా వర్గం స్వంత పునాదిని కాపాడుకుంటూనే సామ్రాజ్యవాద బూర్జువా వర్గంతో సంబంధాన్ని కొనసాగిస్తుంది. ఈ మిలాఖత్తు స్థాయి ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలోని బలాబలాల పొందికకు అనుగుణంగా ఉంటుంది. సోవియట్ యూనియన్ కుప్పకూలిన తర్వాత బలాబలాల పొందిక సామ్రాజ్యవాదానికి అనుగుణంగా మారింది. ఈ పరిస్థితిలో తృతీయ ప్రపంచ దేశాల బడా బూర్జువా వర్గం సామ్రాజ్యవాదంతో మిలాఖత్తు అవడం అధికమైంది. అయితే అంతమాత్రం చేత సామ్రాజ్యవాదానికి, తృతీయ ప్రపంచ బూర్జువా వర్గానికి వైరుధ్యం లేకుండాపోయిందని, అది కాంప్రెడార్ బూర్జువా వర్గంగా మారిందని చెప్పడం ఎంత మాత్రం సరికాదు. అలా చెప్పడమంటే తృతీయ ప్రపంచదేశాలలో ఐదు దశాబ్దాలకు పైగా జరిగిన పెట్టుబడిదారీ అభివృద్ధిని, మార్పును నిరాకరించడమే. ఈ పరిణామం ఆ దేశాలలోని వర్గ పోరాటంపై చూపే ప్రభావాన్ని కూడా గుర్తించలేకపోతాము.

నేడు తృతీయ ప్రపంచదేశాల బూర్జువా వర్గం సామ్రాజ్యవాద పెట్టుబడికి జూనియర్ భాగస్వామిగా మారడానికి సిద్ధపడినప్పటికీ అది తన ఉనికిని వర్గ ప్రయోజనాలను మాత్రం వదులుకోవడంలేదు. ప్రపంచీకరణ వాతావరణంలో తృతీయ ప్రపంచ దేశాల బూర్జువా వర్గం సామ్రాజ్యవాదంతో తలపడలేదనడం కూడా సరికాదు. మలేసియా ప్రధాని మహాతీర్ మహమ్మద్ ఆగ్నేయాసియా సంక్షోభం తర్వాత ఐఎంఎఫ్ ఆదేశాలను ఖాతరు చెయ్యకుండా పెట్టుబడి ప్రవాహాలపై ఆంక్షలు విధించడం దీనికి చక్కటి ఉదాహరణ. ఈ చర్య పట్ల సామ్రాజ్యవాదులు ఎంత ఆగ్రహించినప్పటికీ ధైర్యంగా ముందుకుసాగి తన దేశాన్ని ఆర్థికంగా బయటపడవేయకలిగారు. అంతెందుకు మనదేశంలో ప్రస్తుత బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం సామ్రాజ్యవాదులు ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదుల ఎదుట సాష్టాంగపడి ఆర్థిక, రాజకీయ రంగాలలో లొంగుబాటును ప్రదర్శిస్తున్నప్పటికీ డబ్ల్యుటిఓ లాంటి సంస్థలలో మొక్కుబడిగానయినా సరే ఎంతో కొంత నిరసన వ్యక్తంచేయడం సామ్రాజ్యవాదులకు, తృతీయ ప్రపంచ దేశాల బూర్జువా వర్గానికి మధ్య వైరుధ్యం కొనసాగుతూనే ఉందనడానికి నిదర్శనం కాదా?

మన దేశంలో అధికారంలోకి వచ్చిన బిజెపి గురించి కూడా గందరగోళం వెంకటేశ్వరరావుగారి

నేడు తృతీయ ప్రపంచదేశాల బూర్జువా వర్గం సామ్రాజ్యవాద పెట్టుబడికి జూనియర్ భాగస్వామిగా మారడానికి సిద్ధపడినప్పటికీ అది తన ఉనికిని వర్గ ప్రయోజనాలను మాత్రం వదులుకోవడంలేదు. ప్రపంచీకరణ వాతావరణంలో తృతీయ ప్రపంచ దేశాల బూర్జువా వర్గం సామ్రాజ్యవాదంతో తలపడలేదనడం కూడా సరికాదు.

వ్యాసంలో వ్యక్తమవుతుంది. భారత బూర్జువా వర్గపు సామ్రాజ్యవాద వ్యతిరేక నిబద్ధత తగ్గిపోవడం సంప్రదాయ బూర్జువా పార్టీ అయిన కాంగ్రెస్ దిశలో వచ్చిన మార్పులో ప్రతిబింబించింది. ఈ మార్పు ఫలితంగా ఆ పార్టీ ప్రజా మద్దతుకోల్పోయింది. ఫలితంగా ఏర్పడిన శూన్యతలో ప్రవేశించడానికి మతోన్మాద శక్తులు ముందుకొచ్చాయి. నూతన పరిస్థితిలో తన వర్గ పాలనకు కొత్త ప్రాపు కావాలని బూర్జువా వర్గం భావించడం మతోన్మాద శక్తులకు లభిస్తున్న 'గౌరవం'లో వ్యక్తమవుతున్నది. ఈ మతోన్మాద శక్తులకు సామ్రాజ్యవాదుల ఆశీస్సులు కూడా ఉన్నాయి. అయితే ఈ మతోన్మాద శక్తులే అధికారంలో కొనసాగాలని సామ్రాజ్యవాదులు పూర్తిగా కోరుకోవడంలేదు. అయినప్పటికీ సమాజం మతతత్వ పూరితం కావడం మాత్రం సామ్రాజ్య 6వాదుల, ప్రయోజనాలకు పూర్తిగా అనుకూలంగా ఉంటుంది. బిజెపి పాలనను ఈ దృష్టితోనే చూడాలి. బిజెపి ప్రభుత్వం భారత "బూర్జువా వర్గ పూర్తి కాంప్రెడారీకరణకు ప్రాతినిధ్యం వహిస్తుందని చెప్పడం పొరపాటు రాజకీయ నిర్ధారణలకు కారణమయ్యే అవకాశముంది. అలాగే ప్రపంచీకరణ విధానాలతో లాభపడుతున్న ఎన్ఆర్ఐలు విదేశాలలో ఉద్యోగాలు చేస్తున్న భారతీయులు, ఉద్యోగాల కోసం ఆశపడుతున్న వారు భారత బూర్జువా వర్గ స్వభావాన్ని కాంప్రెడారీకరించడంలో ఒక ప్రధాన కారణమని చెప్పడమూ సరికాదు. ప్రపంచీకరణ, ప్రయివేటీ కరణ కొనసాగాలని వీరు ఆశించినప్పటికీ మొత్తంగా బూర్జువా వర్గ స్వభా వాన్ని మార్చేశక్తి వీరికి ఉంటుందని భావించలేము. నిజానికి బూర్జువా వర్గస్వభావంలో అలాంటి మార్పు రాలేదు.

ప్రపంచీకరణ ప్రపంచ వ్యాపితంగా ఆదాయ అసమానతలను, దారిద్ర్యాన్ని పెంచుతున్నది. నిరుద్యోగం పెరిగిపోతున్నది. ప్రజల స్థితిగతులు దారుణంగా దిగజారిపోతున్నాయి. ఈ స్థితిలో ప్రపంచీకరణ వ్యతిరేక పోరాటాలు అనివార్యంగా ఉధృతమవుతాయి. సామ్రాజ్యవాదంపై తృతీయ ప్రపంచ దేశాల ప్రజా పోరాటాలు, సంపన్నదేశాలలో కార్మికవర్గ పోరాటాలు ఉధృతమయితే సామ్రాజ్యవాదానికి తృతీయ ప్రపంచదేశాలకు మధ్య వైరుధ్యం తీవ్రతరమవుతుంది. అలాగే సామ్రాజ్యవాద దేశాల మధ్య వైరుధ్యాలు కూడా తీవ్రమవుతాయి. అప్పుడు తృతీయ ప్రపంచ దేశాల బూర్జువా వర్గం తమ స్వతంత్ర ఉనికిని చాటుకోవడానికి ప్రయత్నించవచ్చు. అలాగే సామ్రాజ్యవాద దేశాల మధ్య ప్రస్తుతం కనిపిస్తున్న సాపేక్ష సయోధ్య కూడా కొనసాగకపోవచ్చు. అందువల్ల ప్రపంచీకరణ ఫలితంగా తృతీయ ప్రపంచ దేశాల బూర్జువా వర్గం కాంప్రెడారీకరణ చెందిందని సూత్రీకరించడం ఆర్థిక విశ్లేషణపరంగా సరైందికాకపోవడమేకాక తప్పుడు రాజకీయ నిర్ధారణలకు సైతం దారితీస్తుంది.

మార్క్స్ - చరిత్ర

(12వపేజీ తరువాయి)

వ్యవస్థా, వేతన శ్రామికుల వ్యవస్థా జంటగా అమలులోకి వచ్చాయి.– పేరుంచాడు. దీనిని ఆఖరు దోపిడీ సామాజిక వ్యవస్థగా మార్క్స్ గుర్తించాడు. ఈ సమాజం సోషలిజానికి అంటే... ఏ పీడనాలేని స్వేచ్ఛా సమాజానికి... మార్గం సుగమం చేస్తుంది. ఈ వివిధ రూపాల వ్యవస్థలు క్రమంగా రావడానికి సహకరించిన అంశాలేమిటి? ప్రకృతి శక్తులు మట్టుకు కాదు. మానవుని ఆచరణ, ప్రధానంగా వర్గ పోరాటాలు ఎక్కడ మానవుని చర్య కనబడుతుందో... అక్కడ సహజంగా కావాలని ప్రయత్నించిన కొనసాగించిన కార్యమే. తక్షణ చర్యకు ఉసికొల్పేది మానవుని మేథమాత్రమే. అలాంటి 'చైతన్యం' భౌతిక పరిస్థితులనుంచే నిర్ణాయకమౌతుందని మార్క్స్ చెప్పిన అంశం.. వక్ర భాష్యాలపాలైంది. అల్ప వ్యాఖ్యానాల బారినపడిన ఆయన ప్రసిద్ధ వాక్యాలివి. మానవుల చైతన్యం వారి ఉనికిని నిర్ధారించదు. వారి సామాజిక స్థానమే వారి చైతన్యాన్ని నిర్ధారిస్తుంది".

వాస్తవానికి మరికొంచెం ముందుకు వెళితే మార్క్స్ "నిర్ధారించడం" అంటే తానను కున్నదేమిటో కూడా స్పష్టపరిచాడు. 'మానవజాతి అనివార్యంగా తనకు తాను పరిష్కరించగలనన్న సమస్యలను మాత్రమే ఎంచుకుంటుంది. ఎందుచేతనంటే... సూక్ష్మంగా పరికించినప్పుడు అసలు ఒక సమస్య. దాని పరిష్కారానికి అనువైన భౌతిక పరిస్థితులు అప్పటికే తయారుగా ఉన్నట్లు మనకు స్పష్టమౌతుంది. లేదా ఆ పరిస్థితులు రూపొందుతున్న క్రమం మనకు గోచరమౌతుంది".

మరో విధంగా మానవ చైతన్య స్థితి ఆ క్షణంలో ఉన్న భౌతిక పరిస్థితుల స్థాయి పరిమితుల అంచున ఉన్నట్లు చెప్పుకోవాలి. కాని మరికొన్ని పరిమితులు కూడా ఉన్నాయి. గడిచిపోయిన సమాజాలు, తమను గురించి హేతు పూర్వక దృక్పథాన్ని ఆవిష్కరించు కోలేకపోయాయి. ఆ విధంగా... ఒక వర్గానికి చెందిన వ్యక్తులు – ఉదాహరణకు రైతులు తమను తాము ఒకానొక ప్రత్యేక వర్గానికి చెందిన వారిగా చూసుకోజాలరు. అలాగే హేతుపూర్వ స్పృహను మతం తరుచుగా నిరోధించింది. అందుచేతనే మార్క్స్ మతాన్ని 'ప్రజలు నల్లమందు'గా పిలిచాడు.

అలాగే భౌతిక పరిస్థితులు అనుకూలించి నప్పుడు, అహేతుక చైతన్యంతో జరిగిన చర్య కూడా సామాజిక చట్రంలో మార్పులకు దోహదం జరగవచ్చును. ఇందుకు భారతదేశపు కుల వ్యవస్థను ఒక ఉదాహరణగా పేర్కొనవచ్చును–ఆ వ్యవస్థ నిరంతరం మతం కనుసన్నలలో కొనసాగుతున్న వ్యవస్థ అటు వైపు 16వ శతాబ్దపు మత సంస్కరణోద్యమం (16వ శతాబ్దం) యూరప్‌లో పెట్టుబడిదారీ విధానాన్ని... త్వరితం చేసింది. ఇక్కడ ఆచరణలో మత ప్రపంచం "వాస్తవ ప్రపంచపు ప్రతిధ్వని"గా వ్యక్తమైంది.

మార్క్స్ ఆలోచనలో కేంద్రాంశం.... పెట్టుబడిదారీ విధానంలో వ్యక్తమైన పరిస్థితులు... మానవ చైతన్య స్వేచ్ఛను వెలిగించాయి.. ఎందుచేతనంటే ఇక్కడ ప్రాచీన, పవిత్ర భ్రమలూ, భావాలూ... దొంతరదొంతరగా అన్నీ కొట్టుకుపోయాయి. కొత్తగా రూపొందినవన్నీ గడ్డకట్టకుండానే పురాతనమైపోయాయి. ఘనమైనవన్నీ గాలిలో కరిగిపోయాయి. పవిత్రమైనదంతా మైలపడిపోయింది. చివరకు మనిషి ఆరోగ్యకరమైన ఇంద్రియాలతో, స్పృహతో, తన వాస్తవ జీవన పరిస్థితులనూ, తనలాంటి వారితో తన బంధాలనూ ముఖాముఖిగా... తలపడాలిసిన పరిస్థితి ఏర్పడింది. (మేనిఫెస్టో). అలాంటి చైతన్యపు విముక్తి భౌతికాంశాల – యంత్రం, ఆధునిక సాంకేతిక శాస్త్రం, పెచ్చుమీరిన ఆర్థిక సంపద – ప్రమేయంతోనే సాధ్యమైంది.

వర్గదోపిడీ వినాశం. సామ్యవాద వ్యవస్థాపన విముక్త చైతన్యానికి ఉన్నతాసనం. శ్రామికవర్గం (పెట్టుబడిదారీ విధానపు సృష్టి) తన మహాపోరాటాల ద్వారా రాబోయే శకానికి వేగుచుక్కగా నిలిచింది. అయితే శ్రామికవర్గం తనను గురించీ, తన పాత్రను గురించి చైతన్యవంతం కావాలి... ఏ భౌతిక పరిస్థితులు... ఇప్పటి చరిత్రను సాధ్యపరిచాయో శ్రామికవర్గం చైతన్యం కావాలి. అంధ, సత్వర విప్లవం... ఉండదు.

అందుచేత మార్క్స్ 'నిశ్చయవాది' కాదు. అందుకు భిన్నంగా మార్క్స్ భావాలకున్న ప్రముఖ పాత్రను మరింత వక్కాణించాడు. అందుచేతనే ఎంతో క్లిష్టమైన విస్తారమైన తాత్విక, ఆర్థిక సిద్ధాంతాన్ని వివరించడానికి విపరీతంగా శ్రమించాడు. సమకాలీన బూర్జువా భావనా సరళిని క్షుణ్ణంగా విశ్లేషించాడు. ఆయన విడిచిపెట్టిన వారసత్వం అద్భుతమైన విప్లవ సిద్ధాంతాన్నీ, పరిశీలనా విధానాన్నీ మనకు మిగిల్చింది. ఆయన అడుగుజాడలలో అంతే తీవ్రంగా... ప్రస్తుత పరిస్థితులను అధ్యయనం చేయడానికీ, అన్వయం చేయడానికీ... చివరిగా మన విప్లవాచరణకూ... ఎంతో వెలుగునిస్తుంది.

చమురుపై పెత్తనం కోసమే ఈ యుద్ధం

వి. శ్రీధర్

ప్రపంచమంతటా చమురు నిల్వలు వేగంగా తగ్గిపోతున్నాయి. చమురు సంపదలో ఇరాక్ ప్రపంచంలో రెండవ స్థానంలో ఉంది. అమెరికాలో కూడా చమురు నిల్వలు చాలా తక్కువ ఉన్నాయి. అందుకే తన అవసరాలు తీర్చుకునేందుకు గాను ఇరాక్ చమురు సంపదపై ఆధిపత్యం సాధించాలని ఆరాటపడుతోంది. ఒక వ్యూహం ప్రకారమే ఇరాక్‌పై యుద్ధం చేయడానికి తహతహలాడుతోంది.

యుద్ధం అనివార్యంగా కనిపిస్తోంది. ఇరాక్‌లోని సామూహిక జనహనన ఆయుధాలు ధ్వంసం చేయడానికే యుద్ధం చేయనున్నామని అమెరికా చెప్పే మాటలు పైపైకే. పశ్చిమాసియాలోని, ప్రత్యేకించి ఇరాక్‌లోని చమురు నిల్వలపై ఆధిపత్యం కోసమేనా ఈ యుద్ధం అని ప్రశ్నిస్తే మాత్రం మౌనమే సమాధానంగా ఉంటుంది. చమురు నిల్వలకు సంబంధించి అమెరికా చరిత్రను పరిశీలించినా, ఇతర ప్రధాన దేశాల స్పందన చూసినా ఆయిల్ ఇక్కడ కీలక పాత్ర పోషిస్తున్నదని అర్ధమవుతుంది. ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో రష్యా, ఫ్రాన్స్ దేశాలు నిగ్రహం పాటించాలని అమెరికాకు హితవు చెబుతున్నాయి. వాస్తవమేమంటే ఈ రెండు దేశాలలోని ఆయిల్‌కంపెనీలు ఇరాక్‌లో ఆయిల్ వెలికితీయడానికి సద్దాం హుస్సేన్ ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. అందుకే సద్దాంపై యుద్ధం వద్దంటున్నాయి. అయితే ఆ ప్రభుత్వం పతనమైతే ఏర్పడే కొత్త ప్రభుత్వంలో తమ ప్రయోజనాలు కాపాడుకునేందుకు బేరమాడుతున్నాయి. మొత్తం మీద ఇరాక్‌లోని ఆయిల్ నిల్వలే అత్యంత కీలకంగా మారాయి. దానిపై అమెరికా దళాలు భూతలయుద్ధం ప్రారంభించేదశలోనే ప్రత్యేకదళాలు ఆయిల్‌బావులపై ఆధిపత్యం సాధిస్తాయనే సూచనలు అందుతున్నాయి.

ప్రపంచంలో అన్నిదేశాల కంటే ఎక్కువ ఆయిల్ వినియోగించేది అమెరికా. విశ్వవ్యాప్తంగా జరిగే ఆయిల్ అమ్మకాల్లో అమెరికాలో దాదాపు నాలుగింట ఒకవంతు ఉంటుంది. గడిచిన 27 ఏళ్ళుగా అమెరికా చమురు కొరత ఎదుర్కొంటోంది. దీంతో ఇష్టం లేకున్నా ఆయిల్ కోసం ఇరాక్‌పై ఆధారపడక తప్పలేదు. గత నవంబర్ వరకు ఇరాక్ నుండి రోజుకు 5 లక్షల బ్యారెళ్ళు దిగుమతి చేసుకుంటున్న అమెరికా అప్పటినుండి 10 లక్షల బ్యారెళ్ళకు పెంచింది. ఆయిల్‌కు ఆహారం పథకం ద్వారా దీన్ని సాగిస్తోంది. ఈ ఆయిల్ దిగుమతిలో ప్రధానంగా అమెరికాలోని చెర్వాన్ టెక్సాకో, ఎక్సాన్ మోబిల్, షెల్ కంపెనీలు పాలుపంచుకుంటున్నాయి. ఈ అదనపు ఆయిల్ అంతా ఐరోపా, ఆసియా దేశాలకు వెళ్ళాల్సిన దానిని ఆయా కంపెనీలు తమ చాకచక్యంతో అమెరికాకు మళ్ళిస్తున్నాయి. 2000 సంవత్సరం నవంబర్ నుండి చమురు ధరలు చాలావేగంగా పెరిగాయి. బ్యారెల్ ధర 30 డాలర్లను దాటింది. రానుందని చెబుతున్న ఇరాక్ యుద్ధాన్ని, వెనిజువెలా సంక్షోభాన్ని సాకుగా చూపి ఆయిల్ రంగంలో పాతుకుపోయిన మార్కెట్‌శక్తులు ధరలను విపరీతంగా పెంచేశాయి. గడిచిన కొద్దివారాలుగా చమురు ఉత్పత్తి తగ్గడానికి కూడా ఈ శక్తులే కారణం. ఆయిల్ కోసమే ఇరాక్‌పై దాడి చేయడానికి అమెరికా సన్నాహాలు చేస్తోందని ప్రపంచవ్యాప్తంగా వెల్లువెత్తుతున్న విమర్శలకు 'చౌకగా లభించే ఆయిల్ కోసం' కాదంటూ అతికష్టం మీద సమాధానం చెప్పింది.

ఇరాక్ చమురు నిల్వలు ప్రపంచంలో (సౌదీ అరేబియాది మొదటి స్థానం) రెండవ స్థానాన్ని ఆక్రమించాయి. ఇరాక్‌లో 11,200 కోట్ల బ్యారెళ్ళ చమురు నిల్వలున్నాయి. అయితే రుజువుకాని మరో 100 కోట్ల బ్యారెళ్ళ చమురు నిల్వలు ఇరాక్‌లో ఉన్నట్లు అమెరికాలోని ఇంధన శాఖ అంచనా వేసింది. ఇరాక్ బావుల నుండి చమరును చాలా తక్కువ ఖర్చుతో వెలికితీయవచ్చు. అక్కడ బ్యారెల్ చమురు వెలికి తీయడానికి అమెరికా కరెన్సీలో 97 సెంట్లు ఖర్చవుతుంది. అదే రష్యాలో అయితే 6 డాలర్లు, అమెరికాలోని సముద్రతీరం నుండి వెలికితీయడానికి 4 డాలర్లు అవుతుంది. అంతేకాకుండా ఇరాక్‌లోని బస్రా, కిర్‌కుక్ ప్రాంతాల నుండి వెలికి తీసే చమురు నిక్షేపాలు శుద్ధి చేయడం కూడా తేలిక, ఖర్చు తక్కువ. ఈ చమురులో గంధకం పాళ్ళు తక్కువగా ఉండటమే దీనికి కారణం. ఇరాక్‌లోని చమురు ద్వారా అధిక లాభాలు రావడం, కాలుష్యం కూడా తక్కువగా ఉండటం వల్లనే అమెరికా కంపెనీలు దీనికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. గత పన్నెండేళ్ళుగా ఇరాక్‌పై ఆంక్షలు అమలులో ఉన్నాయి. ఇటీవల ఐక్యరాజ్యసమితి నుండి ఆహారానికి- ఆయిల్ ఇవ్వవచ్చనే అనుమతి రావడంతో వివిధదేశాల్లోని అనేక కంపెనీలతో సద్దాం ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంది. ఫ్రాన్స్, చైనా, స్పెయిన్, భారత్, ఇండోనేషియా, రష్యా వంటి దేశాలు ఈ ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. పెద్ద ఆయిల్ కంపెనీలుగా పేరున్న అమెరికా, బ్రిటన్‌కు చెందిన ఎక్సాన్‌మోబిల్, చెర్వాన్ టెక్సాకో, బ్రిటిష్ పెట్రోలియం కంపెనీలు కావాలనే ఈ ఒప్పందాలకు దూరంగా ఉన్నాయి. ఒకవేళ సద్దాం ప్రభుత్వం పతనమైతే ప్రస్తుతం అమలులో ఉన్న ఒప్పందాలు తర్వాత కూడా కొనసాగాలని రష్యా, ఫ్రాన్స్ కంపెనీలు కోరుతున్నాయి. అయితే ఆవిధంగా జరగాలంటే ఈ దేశాలు కూడా సద్దాం ప్రభుత్వాన్ని కూలదోయడంలో పాలుపంచుకోవాలని అమెరికా విదేశీ

ప్రపంచంలో అన్నిదేశాల కంటే ఎక్కువ ఆయిల్ వినియోగించేది అమెరికా. విశ్వవ్యాప్తంగా జరిగే ఆయిల్ అమ్మకాల్లో అమెరికాలో దాదాపు నాలుగింట ఒకవంతు ఉంటుంది. గడిచిన 27 ఏళ్ళుగా అమెరికా చమురు కొరత ఎదుర్కొంటోంది. దీంతో ఇష్టం లేకున్నా ఆయిల్ కోసం ఇరాక్‌పై ఆధారపడక తప్పలేదు. గత నవంబర్ వరకు ఇరాక్ నుండి రోజుకు 5 లక్షల బ్యారెళ్ళు దిగుమతి చేసుకుంటున్న అమెరికా అప్పటినుండి 10 లక్షల బ్యారెళ్ళకు పెంచింది.

సంబంధాల కమిటీ చైర్మన్ రిచార్డ్ లుగార్ ప్రకటించారు. ఇరాక్‌లో సద్దాం ప్రభుత్వాన్ని పతనం చేసిన తర్వాత అమెరికాకు చెందిన ఎక్సాక్‌మోబిల్ కంపెనీ ఆయిల్ వ్యవహారాల్లో కీలకపాత్ర పోషించే సూచనలు కనిపిస్తున్నాయి. రష్యా ఆయిల్ కంపెనీలు ఇరాక్ నుండి దిగుమతి చేసుకునే ఆయిల్ ద్వారా మంచి లాభాలు ఆర్జిస్తున్నాయి. ఇరాక్ నుండి రష్యా రెండు ప్రయోజనాలను ఆశిస్తోంది. ఇరాక్ ఆయిల్ ద్వారా తన దేశంలోని కంపెనీలకు వచ్చే లాభాలు నిలబెట్టుకోవడం, రెండవది ఆయిల్ రంగంలో అమెరికా ఆధిపత్యానికి అడ్డుకట్ట వేయడం, తద్వారా ధరల యుద్ధంలో రష్యా నష్టపోకుండా చూసుకోవడం.

ఇరాక్‌పై యుద్ధం చేసి సద్దాంను కూలదోసినట్లుగానే భావిస్తున్న అమెరికా యుద్ధానంతరం ఇరాక్‌ను పునర్నిర్మించేందుకు గాను ఒక 'బ్లూప్రింట్'ను కూడా సిద్ధం చేసింది. దీన్ని తయారు చేయడానికి ముందే అమెరికా ఉపాధ్యక్షుడు డిక్‌చెనీ తన దేశంలోని పెద్ద ఆయిల్ కంపెనీలతో సమావేశమై యుద్ధానంతరం ఇరాక్ చమురు నిల్వలను 'కాపాడటం'పై చర్చించారు. ఇరాక్ పునర్నిర్మాణానికి 20 వేల కోట్ల అమెరికా డాలర్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. సద్దాం ప్రభుత్వం పతనమైన తర్వాత ఇరాక్ పెట్రోలియం ఎగుమతి దేశాల సంఘం (ఒపెక్) నుండి వైదొలగి అధికంగా ఆయిల్ ఎగుమతి చేయడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చని అమెరికా సలహా ఇస్తోంది. ప్రస్తుతం ఇరాక్ ఆయిల్ సంపద అంతా ప్రభుత్వ అధీనంలోనే ఉంది. ఏ దేశంతో అయినా ప్రభుత్వమే ఒప్పందాలు కుదుర్చుకుంటోంది. అమెరికా రూపొందించిన బ్లూప్రింట్‌లోని కీలకాంశం ఏమిటంటే ఇరాక్‌లోని ఆయిల్ నిక్షేపాలను ప్రయివేటీకరించడం. కొత్తగా ఏర్పడే ప్రభుత్వం ఇరాక్‌లోని ఆయిల్ నిక్షేపాలపై ప్రయివేటు కంపెనీలకు చట్టబద్ధ హక్కులు ఇవ్వాలని బ్లూప్రింట్ రచయితలు సలహా ఇచ్చారు. దేశంలోని టెలిఫోన్లు, బ్యాంకులు సహా అన్ని మౌలిక రంగాలను, పరిశ్రమలను కూడా ప్రయివేటీకరించాలని అందులో పేర్కొన్నారు. ఇరాక్ యుద్ధం ద్వారా పశ్చిమాసియా నుండి కారుచౌకగా ఆయిల్ పొందే అవకాశం ఉన్నప్పటికీ ఈ రంగంలో దీర్ఘకాలిక ఆధిపత్యం కోసం అమెరికా వ్యూహం రూపొందిస్తోంది. ఇరాక్‌లోని ఆయిల్ నిల్వలు స్వాధీనం చేసుకున్న అనంతరం ఇంతవరకు సౌదీ అరేబియా ప్రయోజనాలకు ఇస్తున్న ప్రాధాన్యతను తగ్గించివేస్తుంది. ఇంతవరకు ఆయిల్ కోసం మిత్రత్వం నెరపుతున్న అనేక దేశాలతో అమెరికా తన వైఖరులను మార్చుకోవడానికి తగిన ప్రణాళికలు తయారుచేస్తోంది. అదే విధంగా ఇరాక్‌లో ప్రభుత్వ నిర్వహణలో ఉన్న ఇరాకీ నేషనల్ ఆయిల్ కంపెనీని పక్కకు నెట్టి తన దేశంలోని ప్రయివేటు కంపెనీలకు అక్కడి వ్యాపారాన్ని కట్టబెట్టడానికి పథక రచన చేస్తోంది. అమెరికా గనుక కీలకమైన ఆయిల్‌నిక్షేపాలపై ఆధిపత్యం సాధిస్తే సమీప భవిష్యత్‌లో ఆయిల్ ఉత్పత్తి అపారంగా పెరుగుతుందని పెట్రో భూగర్భ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం రోజుకు ప్రపంచవ్యాప్తంగా 7.6 కోట్ల బ్యారెళ్ళ ఆయిల్‌ను వినియోగిస్తున్నారు. ఇది ఏటా 2 శాతం చొప్పున పెరుగుతోంది. ప్రస్తుతం అమెరికా 52 శాతం చమురును ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకుంటోంది. 2020 నాటికి దిగుమతులు మూడింట రెండువంతులకు పెరుగుతాయి. ఈ కారణంగా ప్రపంచం లోని ముఖ్యమైన ఆయిల్ నిక్షేపాలపై అమెరికా కన్ను వేసింది. 2040 నాటికి ప్రపంచంలోని చమురు ఉత్పత్తిలో పశ్చిమాసియా దేశాలు 43 శాతాన్ని సాధిస్తాయని ఒక అంచనా చెబుతోంది. ఇందులో సౌదీఅరేబియా, ఇరాక్, ఇరాన్, కువైట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వరుస స్థానాలను ఆక్రమిస్తాయి. సౌదీ అరేబియాలో 2011 నాటికి, ఇరాక్‌లో 2010 నాటికి ఉత్పత్తి తారాస్థాయికి చేరుతుంది. అప్పటికి ఆయిల్‌పై ఎవరి పెత్తనం కొనసాగితే వారి ఆటలు సాగుతాయి. అందుకే అమెరికా తన ఆయుధాలను ఇరాక్‌పై గురిపెట్టింది.

ఇరాక్‌పై యుద్ధం చేసి సద్దాంను కూలదోసినట్లుగానే భావిస్తున్న అమెరికా యుద్ధానంతరం ఇరాక్‌ను పునర్నిర్మించేందుకు గాను ఒక 'బ్లూప్రింట్'ను కూడా సిద్ధం చేసింది. దీన్ని తయారు చేయడానికి ముందే అమెరికా ఉపాధ్యక్షుడు డిక్‌చెనీ తన దేశంలోని పెద్ద ఆయిల్ కంపెనీలతో సమావేశమై యుద్ధానంతరం ఇరాక్ చమురు నిల్వలను 'కాపాడటం'పై చర్చించారు.

గుజరాత్ నరమేధంపై

(10 వ పేజీ తరువాయి)

రువాండా, యుగొస్లావియాలో మాదిరిగా గుజరాత్ సంఘటనలపై భద్రతామండలి తీర్మానం ద్వారా అంతర్జాతీయ ట్రిబ్యునల్ ఏర్పాటు చేసే అవకాశం ఎంతమాత్రంలేదు. అంతేగాక ఐసిసి ఏర్పాటుతో ముమ్ముందు ఐసిటిఆర్, ఐసిటివై వంటి ట్రిబ్యునళ్ల అవసరం ఉండదు.

"జినోసైడ్" చట్టాన్ని తమ దేశ న్యాయచట్రం పరిధిలో అమలు జరుపుతున్న దేశాలు, ఇతర దేశాలలో జరిగిన "జినోసైడ్" నేరాలపై విచారణ జరపడానికి అంగీకరించిన పక్షంలో అక్కడ విచారించే అవకాశముంది. అయితే సాబ్రా, షటీలాలో 20 వేల మంది ఊచకోతకు బాధ్యుడైన ఎరీల్ షరోన్‌పై విచారణ జరిపేందుకు బెల్జియం నిరాకరించింది. మొదట కేసును విచారణకు స్వీకరించిన బెల్జియం కోర్టు ఇతర దేశాలలో జరిగిన నేరాలపై సంబంధిత నేరస్థులు బెల్జియంలో ఉంటేనే తమ దేశ చట్టాల ప్రకారం విచారణ జరిపేందుకు అధికారం ఉంటుందని పేర్కొంటూ, షరోన్‌కు వ్యతిరేకంగా దాఖలైన కేసుపై విచారణకు నిరాకరించింది. కాగా దీనిపై అప్పీలు చేశారు.

ఏలీన్ టార్ట్ క్లెయిమ్స్ చట్టం (ఏటిసిఏ), టార్చర్ విక్టిమ్ ప్రొటెక్షన్ యాక్ట్ (టివిపిఏ) కింద ఏకపక్ష నిర్బంధం, యుద్ధ నేరాలు, మానవజాతిపై జరిపిన నేరాలు, "జినోసైడ్" వంటి కేసులలో అమెరికా జాతీయ న్యాయ చట్రం పరిధిలో విచారణ జరిపే అవకాశం ఉంది.

"జినోసైడ్" పై కుదిరిన అంతర్జాతీయ ఒప్పందానికి అనుగుణంగా భారతదేశం చట్టం రూపొందించేంతవరకు గుజరాత్‌లో జరిగిన మారణ కాండను "జినోసైడ్"గా పరిగణించి, దీనికి సంబంధించి సుప్రీంకోర్టు ఒక తాత్కాలిక చట్టం రూపొందించడమే ఇప్పుడు జరగాల్సిన పని. ఇవి గుజరాత్ "జినోసైడ్"పై చట్టపరమైన చర్య తీసుకోవడానికి ఉన్న కొన్ని అవకాశాలు. అయితే హిందుత్వ నరమేధ రాజకీయాలకు చరమగీతం పలికే విస్తృత ప్రచార కార్యక్రమంలో భాగంగా చట్టపరమైన చర్యలుండాలి.

భారతదేశ రాజకీయాలు పూర్తిగా "ఫాసిస్టు" లక్షణాలు సంతరించుకోకముందే "నరమేధ రాజకీయాలను" అరికట్టి సరైన మార్గంలో పెట్టేందుకు సత్వర ప్రయత్నాలు జరగాలి. గుజరాత్ మారణకాండను విశ్లేషించినట్లయితే ప్రొఫెసర్ ఉపేంద్ర భక్షి చెప్పిన మాదిరి "భారత రాజ్యాంగానికి కాలం చెల్లిపోతున్నట్లు" కనిపిస్తోంది.

వేతనాలు పాతాళానికి.. ఆహార భద్రత ఆకాశానికి...

హైతీలో ఐఎంఎఫ్ ఘనకార్యం

గతరెండు శాబ్దాలుగా కరీబియన్ దేశమైన హైతీ అంతర్జాతీయ ద్రవ్య సంస్థ (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంకు ఆదేశాలను విధేయతతో అమలు పరుస్తూవస్తోంది. అయినప్పటికీ ఆ దేశం ఇప్పటికీ పేద దేశంగానే ఉంది. హైతీ మొత్తం జనాభాలో సుమారు 70 శాతం మంది నిరుద్యోగులుగా ఉన్నారు. ప్రతి పది మందిలో కేవలం నలుగురికి మాత్రమే స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉంది. సగటు ఆయుప్రమాణాల విషయంలో హైతీ దయనీయంగా ఉంది. ఇక్కడ పురుషుడు సగటున 47 సంవత్సరాలు మహిళ అయితే 51 ఏళ్లు బతుకుతున్నారు. ఎక్కువ మంది హైతియన్లకు చదవడం, రాయడం తెలియదు. ఐదేళ్ల వయసు లోపు చిన్నారులు సగం మందికి పోషకాహారం దొరకడం లేదు. మొత్తం జనాభాతో చూసినపుడు ఇక్కడ తలసరి ఆదాయం రోజుకు ఒక డాలర్‌కు అటూ ఇటూగా ఉంది.

'గ్లోబల్ ఎక్స్చేంజ్ కేస్ స్టడీ-5

అటు పౌర ప్రభుత్వం కానీయండి ఇటు సైనిక ప్రభుత్వం కానీయండి.... హైతీ వరుస ప్రభుత్వాలకు ఐఎంఎఫ్ ఇచ్చిన విధానపరమైన ఆదేశాలు ఒకే ఒక లక్ష్యాన్ని ఉద్దేశించి ఉన్నాయి. అదేమిటంటే ఎగుమతులు పెంచడం. వాస్తవానికి ఐఎంఎఫ్ 'ఆధ్వర్యం'లో ఎగుమతులు నాటకీయంగా పెరిగిపోయాయి. అయితే ఈ 'విజయం' భారీ మూల్యాన్నే చెల్లించింది. ఏది చేసైనా హైతీకి విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు దేశంలో కార్మిక వేతనాలను అత్యంత తక్కువ స్థాయిలో ఉంచేలా ప్రభుత్వాలపై ఐఎంఎఫ్ ఒత్తిడి చేసింది. ఒక వైపు ఇది బహుళ జాతి కంపెనీలకు వరంగా పరిణమించినప్పటికీ, సాధారణ హైతీ ప్రజలకు ఒరిగింది ఏమీ లేదు. హైతీలోని వస్త్ర పరిశ్రమలు కల్పించిన ఉద్యోగాలు స్థానిక ప్రజలు బతుకీడ్చేందుకు మాత్రమే ఉపయోగపడ్డాయి. అదే సమయంలో చిన్న రైతులకు ఇస్తున్న సహాయాన్ని తగ్గించాలని ఐఎంఎఫ్ చేసిన ఒత్తిడి కారణంగా దేశ వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో చిక్కుకుపోయింది. ఫలితంగా హైతీ ప్రజలు ఆహారం కోసం కూడా విదేశీ దిగుమతులపైనే ఆధారపడాల్సి వచ్చింది. హైతీపై ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు పెత్తనం వల్ల వేతనాలు పాతాళానికి పడిపోయాయి. అంతే కాకుండా ఆహారభద్రతకు తీవ్ర ముప్పు వాటిల్లింది.

వ్యవసాయ 'అభివృద్ధి'

హైతీలో అంతర్జాతీయ సంస్థలు ప్రవేశిస్తూనే వినాశనం సృష్టించాయి. హైతీ గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు 85 శాతం కుటుంబాలు క్రియోల్ పందులను పెంచుతుంటాయి. వీటిని ఆర్థిక అవసరాల కోసం హైతియన్లు ఉపయోగిస్తుంటారు. వివాహాలు, ఎవరైనా చనిపోయినపుడు అంత్యక్రియలకు, ఇతరత్రా అత్యవసర కార్యక్రమాల సందర్భంగా వీటిని అమ్ముతుంటారు. ఇక్కడ విదేశీ వ్యవసాయ 'నిపుణులు' ఒక మెలిక పెట్టారు. ఈ పందులు దీర్ఘకాల వ్యాధులతో ఉన్నాయని, ఈ వ్యాధులు ఉత్తర దేశాలకు వ్యాపించే అవకాశం ఉందని వారు చెప్పారు. పదమూడు నెలలలోగా ఇలాంటి పందులన్నింటినీ చంపివేయాలని వారు పేర్కొన్నారు. వాటి బదులు ఐయోవా నుండి పందులను దిగుమతి చేయించారు. కానీ, అవి వీటి కన్నా తక్కువ ప్రమాణాలు కలిగి ఉన్నాయి. హైతీ వాతావరణాన్ని అవి తట్టుకోలేక పోయాయి. దాంతో పాటు వాటికి ప్రత్యేక ఆహారం కావాలి. అంతేకాకుండా స్వచ్ఛమైన తాగు నీరు వాటికి లభించని పక్షంలో అవి రోగాల బారిన పడతాయి. హైతీలో జనానికి తాగునీరు తగినంత అందుబాటులో లేదు. ఇంక పందులకు ఎక్కడ సమకూరుస్తారు ? పైగా వీటికి దిగుమతి చేసుకున్న ఆహారం పెట్టాలి. దీనిని భరించే స్థితిలో స్థానిక సాధారణ రైతాంగం లేదు. పునరుత్పత్తి ప్రక్రియ ఘోరంగా విఫలమైంది. ఒక అంచనా ప్రకారం ఈ పందుల కారణంగా హైతీ రైతులు పెట్టుబడుల రూపంలో సుమారు ఆరువందల మిలియన్ డాలర్లను నష్టపోయారు. పోషక విలువలు అనేవి హైతీలో దారుణంగా పడిపోయాయి.

ఈ పందుల కార్యక్రమం హైతీ వ్యవసాయ రంగాన్ని మొత్తంగా గుల్ల చేసేందుకు ప్రపంచ బ్యాంకు రూపొందించిన ప్రణాళిక. స్థానిక వినియోగంపై ఉన్న కేంద్రీకరణను విదేశాలకు ఎగుమతి చేసే అంశంపైకి మార్చే కృషిలో బ్యాంకు హైతియన్లను కకావో, కాఫీ మొదలైన వాణిజ్యపంటలకు ప్రోత్సహించింది. దీని ప్రకారం రైతులు వాణిజ్య పంటలను ఉత్పత్తి చేసి వాటిని ఎగుమతి చేయడం ద్వారా వచ్చే ఆదాయంతో ఆహార ధాన్యాలు కొనుగోలు చేసుకోవాలన్నమాట ! అయితే, ప్రపంచ వ్యాప్తంగా కకావో, కాఫీ ధరలు పడి పోవడంతో

వాస్తవానికి ఐఎంఎఫ్ 'ఆధ్వర్యం'లో ఎగుమతులు నాటకీయంగా పెరిగిపోయాయి. అయితే ఈ 'విజయం' భారీ మూల్యాన్నే చెల్లించింది. ఏది చేసైనా హైతీకి విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు దేశంలో కార్మిక వేతనాలను అత్యంత తక్కువ స్థాయిలో ఉంచేలా ప్రభుత్వాలపై ఐఎంఎఫ్ ఒత్తిడి చేసింది. ఒక వైపు ఇది బహుళ జాతి కంపెనీలకు వరంగా పరిణమించినప్పటికీ, సాధారణ హైతీ ప్రజలకు ఒరిగింది ఏమీ లేదు.

హైతీ రైతుల బతుకు దుర్భరమైంది.

స్థానిక వినియోగానికి ఉద్దేశించిన ఆహార పంటల ఉత్పత్తి నుండి ఎగుమతుల కోసం వాణిజ్య పంటలకు మారడంతో ఆహార ధాన్యాల ఉత్పత్తి పడిపోయింది. 1986లో ఈ పరిస్థితి మరింత తీవ్రమైంది. బియ్యం దిగుమతి సుంకాలను బాగా తగ్గించాలని, వరి పండించే రైతులకు మద్దతు ఉపసంహరించాలని 1986లో ఐఎంఎఫ్ హైతీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. దాంతో అమెరికా నుండి బియ్యం దిగుమతి అయింది. అసలే అమెరికాలో సబ్సిడీలు బాగా పొంది ఉండడంతో అక్కడి రైతులు ఉత్పత్తి చేసి హైతీకి పంపిన బియ్యం ధరలు బాగా తక్కువగా ఉన్నాయి. దాంతో హైతీలో ఉత్పత్తి అయిన బియ్యం ధరలు వాటితో పోల్చినపుడు అధికంగా ఉండటంతో స్థానిక రైతులు దివాళా తీశారు. 1988 నాటికి దాదాపు ఎక్కువ భాగం రైతులు తమ పొలాల్లో పనులు చేయడం మానేశారు.

హైతీ వరి ఉత్పత్తి దారుల అనుభవాలు గమనిస్తే ఐఎంఎఫ్ విధానాలు ఎంత మోసపూరితమైనవో అర్థం అవుతుంది. అప్పులు, దారిద్ర్యంతో ఉన్న హైతి ప్రభుత్వం రైతులకు ఇస్తున్న కొద్ది పాటి సబ్సిడీలను కూడా నిలిపివేయాల్సిన పరిస్థితి ఎదురైంది. సుంకాలను కూడా గణనీయంగా తగ్గించి వేసింది. అయితే అమెరికా మాత్రం ఇటువంటి చర్యలేవీ చేపట్టలేదు. రాను రాను హైతీ మార్కెట్‌లో అమెరికా బియ్యం ఆధిపత్యం పెరిగిపోయింది. ప్రస్తుతం హైతియన్లు తమకు బాగా అవసరమైన ఆహార ధాన్యాల కోసం దిగుమతులపై ఆధారపడాల్సిన దుస్థితి నెలకొంది. హైతీలో మొత్తం బియ్యంలో 50 శాతాన్ని ఒకే ఒక్క అమెరికా కంపెనీ అమ్ముతోంది. ఈ పరిస్థితిపై హైతీ రైతు ఒకరు ఈ విధంగా వ్యాఖ్యానించారు. "అమెరికా బియ్యాన్ని మా దేశంలో ప్రవేశపెట్టడం మమ్మల్ని కోలుకోలేని దెబ్బ తీసింది. మరో వైపు అవే కనుక లేనట్లయితే హైతీ ప్రజలు ఆకలితో మాడి చనిపోయేవారు".

'అవకాశాలు' పెంచడం కోసం వేతనాల తగ్గింపు

తన విధానాల కారణంగా దేశంలో సామాజిక అస్థిరత్వం నెలకొనే అవకాశం ఉందన్న విషయాన్ని ఐఎంఎఫ్ గుర్తించింది. అందుకే తన విధానాపై కొత్త భాష్యం చెప్పుకుంది. దీర్ఘకాలంలో తమ విధానాల వల్ల సాధారణ ప్రజలకు మేలు కలుగుతుందని వాదించింది. పేద దేశాలు కొన్ని కీలకమైన ఎగుమతికి ఉద్దేశించిన పరిశ్రమలను గుర్తించాలని వాటిలో పోటీ పడే విధంగా స్పెషలైజ్ చేసుకోవాలని ఐఎంఎఫ్ చెబుతోంది. ఆ విధంగా చూసినపుడు ఐఎంఎఫ్ చెప్పే దాని ప్రకారం హైతీ కార్మిక రంగంలో అవకాశాలు ఉన్నాయి. వాళ్లు చేసిందల్లా ఆ లేబర్ మార్కెట్‌ను అత్యంత చీప్‌గా ఉంచడం !

1980లో హైతి ప్రజల ఆదాయాలు గణనీయంగా తగ్గిపోయాయి. 1989 నాటికి పోర్ట్ ఆవు ప్రిన్స్‌లో ఫుల్‌టైమ్ పని చేస్తే వచ్చే వేతనంతో ఒక కుటుంబ కనీస అవసరాలైన కూడు, గుడ్డ, నీడ మొదలైన వాటిని కనీసం 60 శాతం కూడా తీర్చుకోలేని పరిస్థితి. హైతీకి విదేశీ పెట్టుబడులు రావడం కోసం లేబర్ మార్కెట్‌ను ఐఎంఎఫ్ చీప్‌గా ఉంచింది. 1991, 1994లో ఐఎంఎఫ్ హైతీకి అప్పు ఇచ్చింది. అందుకు అది పెట్టిన షరతు ప్రకారం ప్రభుత్వం వేతనాలను పెంచకూడదు. ఆ తర్వాత 1996లో మరో సారి ఐఎంఎఫ్ హైతీకి సాంకేతిక సహకారం అందజేసింది. దీనికి విధించిన షరతు ప్రకారం హైతీ ప్రభుత్వం తన దేశ కార్మిక చట్టాలను సవరించాలి. హైతీ కార్మిక చట్టాల ప్రకారం దేశంలో ద్రవ్యోల్బణం పది శాతం పెరిగితే కనీస వేతనాన్ని పెంచాలని చెబుతోంది. ఆ చట్టాన్ని ఐఎంఎఫ్ మార్పించింది. ఫలితంగా ద్రవ్యోల్బణం 30 శాతం మించినా వేతనాలు పెరగని స్థితి నెలకొంది. ప్రభుత్వ ఉద్యోగుల వేతనాల్లో కూడా మూడేళ్ల పాటు ఎలాంటి పెరుగుదలలూ ఉండకూడదని కూడా ఐఎంఎఫ్ ఆదేశించింది. ఒక వేళ వేతనాలు పెంచాల్సి వస్తే వారిపై భారాలు కూడా మోపాలనేది ఐఎంఎఫ్ ఆదేశం. అప్పటికే పీకలలోతు కష్టాల్లో కూరుకుని ఉన్న హైతీ లేబర్ మార్కెట్‌కు ఈ ఆదేశాలు మరిన్ని కష్టాలు తెచ్చిపెట్టాయి. పై పెచ్చు హైతీ కార్మికుల నుండి త్యాగాలను ఐఎంఎఫ్ డిమాండ్ చేసింది. విదేశీ ఇన్వెస్టర్లకు బోనస్‌లు చెల్లించాల్సిందిగా ప్రభుత్వంపై ఒత్తిడి కూడా చేసింది. ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్ 'విజ్ఞప్తి' మేరకు హైతీ ప్రభుత్వం టెలిఫోన్, విద్యుత్ ఛార్జీలు, కస్టమ్ సుంకాలను విదేశీ కంపెనీల కోసం తగ్గించింది.

హైతీలోని తక్కువ వేతనాలు, ఇన్వెస్టర్లకు ఇస్తున్న ప్రోత్సాహకాల కారణంగా అనేక మంది ఉత్పత్తి దారులు హైతీకి వచ్చినప్పటికీ ఆ దేశ ఆర్థిక సుస్థిరతకు చేసింది మాత్రం సున్నా. హైతీలో జరిగే పనల్లా అమెరికా నుండి వచ్చే విడి భాగాలను కూర్చి వస్తువులను తయారు చేసి మళ్లీ బయటకు పంపడమే. ఈ ప్రక్రియలో కొద్ది పాటి అవసరాలకు మాత్రమే హైతీ వస్తువులను వినియోగించేవారు. లాభాలు పూర్తిగా ఇన్వెస్టర్లకు, బహుళ జాతి సంస్థలకు చెందుతుండగా హైతీ ప్రజలకు ఒరిగింది శూన్యం. అంతే కాకుండా హైతీ దేశ బడ్జెట్‌పై కూడా ఈ అంతర్జాతీయ సంస్థలు పెత్తనం చెలాయించాయి. ప్రభుత్వం వివిధ రంగాలకు చేసే కేటాయింపులను దాదాపు 50 శాతం తగ్గించివేసింది. దాంతో అత్యవసర సర్వీసుల నిర్వహణ ప్రభుత్వానికి మరింత భారంగా పరిణమించింది. హైతీ 1990వ సంవత్సరంలో ఆరోగ్యం, విద్యారంగాలకు కేటాయించినదానికన్నా అప్పులు చెల్లించడానికే ఎక్కువ కేటాయించింది. హైతీలో ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు ఆదేశిత కార్యక్రమాలు బహుళ జాతి సంస్థలకు వరం లాంటివి. హైతీ రైతులను, కార్మికులను దెబ్బతీయడం ద్వారా అమెరికా వ్యవసాయ కంపెనీలు లాభాలు మూటగట్టుకున్నాయి. దేశాన్ని పూర్తిగా దోచుకున్నాయి. అన్నింటా మోసపోయిన హైతీ ప్రజలు ప్రస్తుతం తాము బతకడం కోసం పోరాటం చేస్తున్నారు.

1991, 1994లో ఐఎంఎఫ్ హైతీకి అప్పు ఇచ్చింది. అందుకు అది పెట్టిన షరతు ప్రకారం ప్రభుత్వం వేతనాలను పెంచకూడదు. ఆ తర్వాత 1996లో మరో సారి ఐఎంఎఫ్ హైతీకి సాంకేతిక సహకారం అందజేసింది. దీనికి విధించిన షరతు ప్రకారం హైతీ ప్రభుత్వం తన దేశ కార్మిక చట్టాలను సవరించాలి. హైతీ కార్మిక చట్టాల ప్రకారం దేశంలో ద్రవ్యోల్బణం పది శాతం పెరిగితే కనీస వేతనాన్ని పెంచాలని చెబుతోంది. ఆ చట్టాన్ని ఐఎంఎఫ్ మార్పించింది.

రోజులలోనే వశమైన ఐరోపా దేశాలు

సోవియట్‌పై దాడి

తెలకపల్లి రవి

పోలండ్‌పై జర్మనీ దాడి (1939, సెప్టెంబర్ 1) తో మొదలైన రెండవ ప్రపంచయుద్ధం తర్వాత అనేక మలుపులు తిరిగింది. బ్రిటన్;అమెరికా, ఫ్రాన్స్‌లతో కూడిన సామ్రాజ్య కూటమి సోవియట్ వ్యతిరేకతే ఏకైక అంశంగా వ్యవహరించింది.

నాజీ జర్మనీ పోలండ్‌పై దాడి చేయటం పాశ్చాత్య దేశాలకు అశనిపాతమైంది. దానితో కలసి కమ్యూనిజాన్ని దెబ్బతీయాలని పథకాలు వేసిన బ్రిటన్, ఫ్రాన్స్‌లకు. హిట్లర్‌పై తాము పెట్టుకున్న ఆశలు ఫలించబోవని, హిట్లర్ తాము అనుకున్న ప్రకారం వ్యవహరించడనీ తెలుసుకోక తప్పలేదు. గత్యంతరంలేని బ్రిటన్, ఫ్రాన్స్, మూడురోజుల తర్వాత జర్మనీపై యుద్ధం ప్రకటించాయి. ఆ దేశానికి తామిచ్చిన మాట ప్రకారం తమ సైన్యాలను పంపించాయి. కాని అవి జర్మనీ ముందు నిలవలేకపోయాయి. నెలరోజుల్లో పోలండ్ పూర్తిగా హిట్లర్ స్వాధీనమైంది. . సోవియట్ యూనియన్ వెంటనే పక్కనగల ఉక్రెయిన్, చైనా, రష్యా పశ్చిమ భాగాల ప్రజానీకాన్ని తన రక్షణలోకి తీసుకుంది. సోవియట్ ఏర్పడిన మొదటిదశలో ఈ ప్రాంతాలను పోలండ్ బలవంతంగా ఆక్రమించింది. ఇష్టంగా అవి తిరిగి సోవియట్‌లో కలిసిపోయాయి.

పోలండ్‌ను 1939 అక్టోబర్ నాటికి ఆక్రమించాక మూడు, నాలుగు మాసాలు ప్రపంచం స్తబ్ధుగా వుండిపోయింది. ఈ కాలాన్ని ప్రకటనల యుద్ధకాలం అంటారు. అయితే వివిధ పక్షాలు తమ ఎత్తుగడలు కొనసాగిస్తూనే వున్నాయి. బ్రిటన్, ఫ్రాన్స్, దిక్కుతోచని స్థితిలో పడిపోగా, సోవియట్ యూనియన్ క్రమపద్ధతిలో వ్యూహాత్మక చర్యలు చేపట్టింది. సెప్టెంబర్ చివరలో, అక్టోబర్ మొదట్లో అది బాల్టిక్ రాజ్యాలైన ఎస్తోనియా, లాత్వియా, లిధువేనియాలతో పరస్పర సహకార ఒప్పందాలు కుదుర్చుకుంది. ఆ భూభాగాలపై సోవియట్ సైనిక స్థావరాలు, విమానాశ్రయాలు ఏర్పరచుకోవడానికి ఇవి వీలు కలిగించాయి. బాల్టిక్ దేశాలు సోవియట్‌కు దగ్గర దారిగా వుండటంవల్ల స్టాలిన్ ఈ ఒప్పందాలకు చాలా ప్రాధాన్యత నిచ్చారు.

1938లో ఫిన్లాండ్‌తో కూడా అలాంటి అవగాహనకే కృషి చేశారు. ఎందుకంటే 35లక్షల జనాభాగల లెనిన్‌గ్రాడ్ ఫిన్లాండ్ సరిహద్దుకు కేవలం 32కిలోమీటర్ల దూరంలోనే వుంది. కనుక ఉత్తర తీరంలో కొంత భాగం తమకు లీజుకు ఇవ్వాల్సిందిగా చేసిన అభ్యర్ధనలను ఫిన్లాండ్ తోసిపుచ్చింది. దానికి నాజీ జర్మనీతో సత్సంబంధాలుండేవి. జర్మనీతో యుద్ధం అనివార్యమని గుర్తించిన స్టాలిన్ 1939 అక్టోబర్ 14న లెనిన్‌గ్రాడ్ రక్షణ గురించి ఫిన్లాండ్‌కు ఒక మెమోరాండం పంపించాడు. తనకు అవసరమైన కనీస తీరప్రాంతం ఇచ్చినందుకు బదులుగా కొన్ని వేల చదరపు మైళ్ల భూభాగం వదులుకోవడానికి సోవియట్ సిద్ధమైనా ఫిన్లాండ్ సహకరించలేదు. నవంబర్ మధ్యకాలం వరకు చర్చలు ఎడతెగకుండా కొనసాగాయి. చివరకు అవి యుద్ధానికి దారితీశాయి.

వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకొనే బదులు ఇంగ్లాండ్, ఫ్రాన్స్, అమెరికాలు కమ్యూనిస్టు వ్యతిరేకతలో మునిగిపోయాయి. ముంచుకొస్తున్న జర్మనీ ఫాసిజాన్ని చూడకుండా సోవియట్ వ్యతిరేక ప్రచారం ఎత్తుకున్నాయి.“ ఫిన్లాండ్‌కు సాయం” నినాదమిచ్చాయి. మూడునెలల్లో బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికాలు ఫాసిస్టు ఇటలీతో కలసి ఫిన్లాండ్‌కు 700 యుద్ధవిమానాలు, 1500 ఫిరంగులు వగైరా సరఫరా చేశాయి. సోవియట్ యూనియన్‌ను నానాజాతి సమితి నుంచి బహిష్కరించాయి. రెండుదేశాల మధ్య సైనిక ఘర్షణ 1940 మార్చి 13న సమాప్తమైంది. సోవియట్ సరిహద్దులు చేరుకునేందుకు అవసరమైన బాల్టిక్ ప్రాంతాలు పోవియట్‌కు లభించాయి. నిజానికి స్టాలిన్ ఎప్పుడూ ఫిన్లాండ్ రాజధాని హెల్సింకీని ఆక్రమించాలని గాని, ఇతర ప్రాంతాలు స్వాధీనం చేసుకోవాలని గాని అనుకోలేదు.

ఈ యుద్ధం కోసం సోవియట్ చాలా మూల్యం చెల్లించాల్సిన వచ్చింది. ఆ క్రమంలోనే తమ దళాల బలహీనతను స్టాలిన్ బాగా గుర్తించారు. 1940 ఏప్రిల్ 17న కేంద్ర సైనిక మండలి సమావేశంలో మాట్లాడుతూ మనం ఆధునిక యుద్ధతంత్రం ఇంకా బాగా నేర్చుకోవాలని ఆయన కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. సైన్యంలో సమూలమైన సంస్కరణలు

వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకొనే బదులు ఇంగ్లాండ్, ఫ్రాన్స్, అమెరికాలు కమ్యూనిస్టు వ్యతిరేకతలో మునిగిపోయాయి. ముంచుకొస్తున్న జర్మనీ ఫాసిజాన్ని చూడకుండా సోవియట్ వ్యతిరేక ప్రచారం ఎత్తుకున్నాయి.“ ఫిన్లాండ్‌కు సాయం” నినాదమిచ్చాయి. మూడునెలల్లో బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికాలు ఫాసిస్టు ఇటలీతో కలసి ఫిన్లాండ్‌కు 700 యుద్ధవిమానాలు, 1500 ఫిరంగులు వగైరా సరఫరా చేశాయి. సోవియట్ యూనియన్‌ను నానాజాతి సమితి నుంచి బహిష్కరించాయి.

ప్రవేశపెట్టారు.

ఇలా వుండగా 1940 ఏప్రిల్‌లో అంతర్జాతీయ రంగంలో స్తబ్దత ఒకేసారి పటాపంచలైంది. ఏప్రిల్ 9న నాజీ జర్మనీ దళాలు డెన్మార్క్‌ను ఆక్రమించాయి. బ్రిటిష్ నౌకా దళాలు అందుబాటులో వుండి కూడా చేసిందేమీ లేకపోయింది. ఈ సందర్భంగా బ్రిటిష్ నేతలు ప్రగల్బాలు ప్రహసనాలుగా పరిణమించాయి. ఒకేఒక్క పూటలో ఎలాంటి ప్రతిఘటన లేకుండా డెన్మార్క్ లొంగిపోయింది. తర్వాత నార్వే పైకి నాజీ దళాలు కదిలాయి. నెలాఖరుకల్లా అదీ వశమైంది. నార్వేకు సహాయంగా వచ్చిన బ్రిటిష్ దళాలు ఆ ప్రయత్నం విరమించి వెనక్కు మరలాయి. నక్కజిత్తుల బ్రిటిష్ ప్రధాని చాంబర్లేన్ మే 10న రాజీనామా చేశాడు. విన్‌స్టన్ చర్చిల్ ప్రధాని అయ్యారు. ఈ పరిణామం పాశ్చాత్య దేశాలలో నెలకొన్న రాజకీయ సంక్షోభానికి అద్దంపట్టింది.

మరోవైపు జర్మన్ సైన్యాలు హాలండ్, బెల్జియం, లగ్జెంబర్గ్‌లను ఆక్రమించాయి. మే 10 న హాలండ్ రాజధాని హేగ్‌పై జర్మనీ విమాన దళం లుఫ్తావేఫ్ దాడి ప్రారంభించింది. అయిదు రోజులలో అది వశమైంది. బెల్జియం కూడా చాలా పరిమితమైన దాడితోనే స్వాధీనమైంది. ఈ సునాయాస విజయాలు హిట్లర్‌నే భయ కంపితుణ్ని చేశాయని నాజీసైనిక నేత హాల్డర్ తన డైరీలో రాసుకున్నాడు.

ఇక ఇప్పుడు ఫ్రాన్స్ వంతు వచ్చింది. నిజానికి ఫ్రాన్స్‌లో అంతకుముందే ఫాసిజం ప్రభావం పడింది. డిలీరాక్ నాయకత్వంలో ఫాసిస్టుమూక పార్లమెంటుపై దాడి జరిపి బీభత్సం చేసింది. మరోవైపు కమ్యూనిస్టుల చొరవతో ఫాసిస్టువ్యతిరేక సంఘటన ఏర్పడింది. సోషలిస్టులు, క్యాథలిక్కులు కూడా దానిలో కలిసివచ్చారు. ఆ క్రమంలో ఆవిర్భవించిన పాపులర్‌ఫ్రంట్ 1936 ఎన్నికల్లో ఘనవిజయం సాధించింది. కమ్యూనిస్టుల మద్దతుతో కొన్ని సానుకూల చర్యలు తీసుకుంది. ఇది ఫ్రెంచి పెట్టుబడిదారులకు నచ్చలేదు. ప్రభుత్వాధినేతగా వున్న సోషలిస్టు లియాన్‌బ్లమ్ చర్చి ప్రేరణతో కమ్యూనిస్టులతో తగాదాలు పడి పాపులర్ ఫ్రంట్ పతనానికి కారకుడయ్యాడు. రెండవ ప్రపంచయుద్ధం దగ్గరయ్యేకొద్ది ఫ్రెంచి మితవాద శక్తులు కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం తీవ్రం చేశాయి. వేలాదిమందిని జైళ్ళపాలుచేశాయి.

ఐరోపాకు గుండెకాయ, నవనాగరికతకు పుట్టినిల్లు, నెపోలియన్ కాలంలో ఐరోపాను పాదాక్రాంతం చేసుకున్న చరిత్రగల ఫ్రాన్స్ నాజీల దాడికి దద్దరిల్లిపోయింది. ఎక్కడికక్కడ విద్రోహచర్యలు తలెత్తాయి. చివరకు జూన్ 9న ఫ్రెంచి ప్రభుత్వం లొంగిపోవాలని నిర్ణయించింది. అయితే 11 వ తేదీన చర్చిల్ హుటాహుటిన పారిస్ చేరుకున్నాడు. బ్రిటన్-ఫ్రాన్స్‌లు ఉమ్మడి సైనిక శక్తిగా జర్మనీని ఎదుర్కొందామని ప్రతిపాదించాడు. కాని బ్రిటన్ చేయగలిగినంత సాయం చేయలేదని అప్పటికే విమర్శలు ముంచుకొచ్చిన నేపథ్యంలో చర్చిల్ మాటలు ఎవరూ పట్టించుకోలేదు. లొంగుబాటుకే మొగ్గుచూపారు. చివరకు జూన్ 14న పారిస్‌లో నాజీ సైన్యాలు ప్రవేశించాయి. అయితే కొన్ని ప్రాంతాలలో ప్రతిఘటన సైన్యాలు, వ్యూహాలు కొనసాగుతూనే వచ్చాయి. పైఇన్, లావెల్, ట్రాల్సయిట్‌లు నాజీల తరఫు కీలుబొమ్మ పాలకులయ్యారు. హిట్లర్ "నా పాత శత్రువు ఫ్రాన్స్‌తో లెక్కలు తేల్చుకుంటాను. ఐరోపా చిత్రపటం నుంచి ఆ దేశాన్ని తొలగిస్తాను, నూతన వ్యవస్థ స్థాపిస్తాను అంటూ మాట్లాడాడు.. పాతకాలంనాటి బలహీన రాజ్యం బ్రిటన్‌ను సునాయాసంగా జయించి, ప్రపంచమంతటా గలదాని నంపదలు వశపరచుకుంటాము" అని హిట్లర్ ప్రకటించాడు. మొదట తూర్పు ఐరోపాలో కాస్త చోటుకావాలని చెప్పిన హిట్లర్ పశ్చిమ ఐరోపాను పాదాక్రాంతం చేసుకునే దాకా ఆగనని స్పష్టీకరించాడు. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో ఫ్రాన్స్ జర్మనీకి షరతులు విధించిన రైలు పెట్టెలోనే జూన్ 20న ఫ్రెంచి జనరల్ నాజీ సైన్యాధిపతి షరతులపై సంతకాలు పెట్టాడు.

ఫ్రాన్స్ తర్వాత సహజంగానే బ్రిటన్ పై దృష్టి మరలింది. హిట్లర్ మొదట నుంచి దాన్ని తనతో కలసి వచ్చే మిత్ర దేశంగా కూడా చెబుతూ వచ్చాడు. అందుకే దానిపై దాడికి పెద్ద పథకం వేయలేదు. దానికి తోడు ఫ్రాన్స్ ఆక్రమణ తర్వాత నాజీ సైన్యాలు డస్సిపోయి వున్నాయి. అలాటి స్థితిలో హఠాత్తుగా బ్రిటన్‌పై దాడికి హిట్లర్ "ఆపరేషన్ సీలో" ప్రారంభించాడు. కాని బ్రిటన్ పై యుద్ధవిమానాలతో దాడి చేయాలన్న జర్మనీ పథకాలు పెద్దగా ఫలించలేదు. ఈ విషయంలో చిన్నదైన బ్రిటిష్ రాయల్ ఎయిర్‌ఫోర్స్ సాహసాన్ని చెప్పుకోవాలి. జర్మనీ లుఫ్తీ వేవ్ వైమానిక దళాలను అది బాగా ప్రతిఘటించింది (ఈ సందర్భంగా కాళ్లులేని ఒక పైలట్ ఆరు విమానాలను కూల్చి వేయడం గొప్ప విషయం) కాని ఈ దాడులలో ఇరు పక్షాలకు కలిగిన నష్టాల గురించిన లెక్కలలో విపరీతమైన తేడాలు కన్పిస్తుంటాయి. వాస్తవానికి లుఫ్తీ వేవ్ అంత గొప్పదీ కాదు, ఆర్ఎఎఫ్ అంత దుర్బలమైందీ కాదు. పైగా వరుసగా సాగుతున్న దురాక్రమణల దృష్ట్యా బ్రిటన్ అప్రమత్తంగా ఆందోళనగా వుంది. కాగా జర్మనీ ఒక విధమైన విజయోన్మత్తతలో, అలసటలో వుంది. సాంకేతికంగా చూస్తే దాని వైమానిక దళం గట్టిదే అయినా రేడియో సమాచార పరికరాలు పాతకాలం నాటివి. ఈ కారణాలన్నిటి వల్లా ఈ వైమానిక దాడిలో జర్మనీ తోకముడవాల్సి వచ్చింది. అయితే బ్రిటన్‌కు కూడా బాగానే నష్టం కలిగింది.. ఇదే సమయంలో ఇటలీ ఆఫ్రికాలో కొన్ని దురాక్రమణ చర్యలకుపాల్పడింది.

కమ్యూనిస్టుల చొరవతో ఫ్రాన్స్‌లో ఫాసిస్టువ్యతిరేక సంఘటన ఏర్పడింది. సోషలిస్టులు, క్యాథలిక్కులు కూడా దానిలో కలిసివచ్చారు. ఆ క్రమంలో ఆవిర్భవించిన పాపులర్‌ఫ్రంట్ 1936 ఎన్నికల్లో ఘనవిజయం సాధించింది. కమ్యూనిస్టుల మద్దతుతో కొన్ని సానుకూల చర్యలు తీసుకుంది. ఇది ఫ్రెంచి పెట్టుబడిదారులకు నచ్చలేదు. ప్రభుత్వాధినేతగా వున్న సోషలిస్టు లియాన్‌బ్లమ్ చర్చి ప్రేరణతో కమ్యూనిస్టులతో తగాదాలు పడి పాపులర్ ఫ్రంట్ పతనానికి కారకుడయ్యాడు.

నాజీల ఆక్రమణ తర్వాత అన్ని ఐరోపా దేశాలలోనూ నిర్బంధం, హింసాకాండ ప్రతిచోటా కొనసాగాయి.

జర్మనీ ఫ్రాన్స్‌ను ఆక్రమించడాన్ని సోవియట్ చాలా తీవ్రమైన పరిణామంగా తీసుకుంది. ఆత్మరక్షణ చర్యలు ముమ్మరం చేసింది. జూన్ మధ్య కాలానికి బాల్టిక్ రాజ్యాలలో శ్రామిక వర్గ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. ఎస్టోనియా, లాత్వియా, లిథేవేనియాలను సోవియట్ వశపరచుకుంది. అక్టోబరు విప్లవానంతర కాలంలో రుమేనియా ఆక్రమించిన బెస్సరియా, ఉత్తర బహమియాలను స్వాధీనపరుచుకొంది. ఇకఇప్పుడు సోవియట్ – జర్మన్ సైన్యాలు ముఖాముఖి స్థానాలలోకి వచ్చాయి. అయినా 1940లో ఆ రెండు దేశాల మధ్య సంబంధాలు పైకి బాగానే వున్నాయి. తమతో నిర్యుద్ధ సంధి కుదుర్చుకొన్న జర్మనీ కనీసంగా చెప్పకుండా 1940 సెప్టెంబర్ 27న బెర్లిన్‌లో ఇటలీ, జపాన్‌లతో దశవర్ష ఒప్పందం కుదుర్చుకోవడం స్టాలిన్ తీవ్రమైన పరిణామంగా పరిగణించారు. జర్మనీ వైఖరిని సంధి కమిటి తెలుసుకోవడానికే మాలటోవ్ జర్మనీ విదేశాంగమంత్రి రిబ్బన్ ట్రాప్ ఆహ్వానంపై 1940 నవంబర్‌లో బెర్లిన్ వెళ్ళాడు. ఆ సందర్భంగా హిట్లర్ తన కపటనీతిని మరోసారి ప్రదర్శించాడు. జర్మన్–సోవియట్ సంబంధాలు అన్నికాల తాత్కాలిక సంకుచిత ప్రయోజనాలకు అతీతంగా పవిత్రంగా వుంటాయని నమ్మబలికాడు. మాలటోవ్ ఆ మాటలకు మోసపోలేదు. చారిత్రిక వాస్తవాలు, అంకెలతో . హిట్లర్‌పై సూటిగా ప్రశ్నలవర్షం కురిపించాడు. నిర్యుద్ధ సంధి ప్రకారం సోవియట్ ప్రయోజనాలుగల ప్రాంతంగా గుర్తించిన ఫిన్లాండ్‌లో జర్మనీ సేనలు ఎందుకున్నాయి? మరి బల్గేరియా, రుమేనియా, టర్కీలలో మా ప్రయోజనాలు ఏమేరకు గౌరవిస్తారు? మీ త్రైపాక్షిక ఒప్పందం ప్రాధాన్యత ఏమిటి? వీరు అంటున్న నూతన వ్యవస్థలో సోవియట్ స్థానం ఏమిటి? ఇలా మాలటోవ్ ప్రశ్నలు సాగాయి. సోవియట్‌తో యుద్ధం ప్రసక్తిలేదని హిట్లర్ చెప్పాడు.

నిజానికి హిట్లర్ మాటలపట్ల స్టాలిన్‌కు ఏనాడూ నమ్మకంలేదు. అందుకే ఆయన యుద్ధానికి దేశాన్ని సిద్ధంచేస్తూనే వచ్చాడు. దేశంలో ప్రణాళికాబద్ధమైన పారిశ్రామిక ప్రగతిని వేగిరం చేశారు. జర్మనీతో అనివార్య పరిస్థితులలో కుదుర్చుకొన్న ఒప్పందం వల్ల లభించిన వ్యవధిని స్టాలిన్ సైనిక ఉత్పత్తులు ఉధృతం చేసేందుకు వినియోగించాడు. కీలకమైన రక్షణరంగ ఫ్యాక్టరీలలో కేంద్రకమిటీ తరపున అనుభవజ్ఞులైన కార్యకర్తలను, ప్రముఖ నిపుణులను పంపించాడు. ఫలితంగా 1939 జనవరి, 1941 జూన్ 22కు మధ్య ఎర్రసేనకు 29,637 యుద్ధ విమానాలు, 52,407 మార్టర్లు, 5500ట్యాంకులు, 17,745 యుద్ధ విమానాలు అందాయి. సైన్యానికి ఆధునిక విద్య కోసం 1940 మార్చిలో జరిగిన పొలిట్‌బ్యూరో సమావేశమే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. నిపుణులైన కార్మికులు 8 లక్షలమందికి ప్రత్యేక శిక్షణ నిచ్చారు.

మరో వైపున స్టాలిన్ కీలకమైన నియామకాలు పూర్తి చేస్తున్నారు. నిర్మొహమాటంగా నిర్ణయాలు తీసుకున్నారు. ఉదాహరణకు క్లిమ్ వొరొషిలోవ్ జారిస్టు రష్యాకు వ్యతిరేకంగా పోరాడిన కాలం నుంచి స్టాలిన్‌కు సన్నిహితుడు. అయినా ఆయన ఆధునిక యుద్ధతంత్రంలో బలహీనుడని ఫిన్లాండ్ యుద్ధం వెల్లడించింది. దాంతో 1940 మే 8న ఆయన స్థానంలో తిమెషింకోను రక్షణశాఖ కమిస్సార్‌గా నియమించాడు. వోర్షిలావ్‌ను ఇతర బాధ్యతల్లో ఉపయోగించారు. సుదీర్ఘకాలం నుంచి విప్లవోద్యమంలో వున్న మెరెత్స్‌కోవ్‌ను సైనికదళాల ప్రధానాధికారిగా నియమించాడు. కొద్దిమాసాలే ఆయన ఈ స్థానంలో వున్నారు. ఈ తీవ్ర శిక్షణా కాలంలో భారీస్థాయి యుద్ధ విన్యాసాలు సాగించారు. మిరెత్సకోవ్ అందుకు ఆధ్వర్యం వహించారు.

1940 డిసెంబర్ 23 నుంచి 1941 జనవరి 13 వరకు మాసాల్లో సైనికాధికారుల విస్తృత మహాసభ జరిగింది. అన్ని స్థాయిల సైనికాధికారులు హాజరయ్యారు. స్టాలిన్, ఇతర పొలిట్‌బ్యూరో సభ్యులు ఈ సమావేశంలో పూర్తిగా పాల్గొన్నారు. జర్మనీతో జరగనున్న యుద్ధాన్ని గురించే దానిలో చర్చ జరిగింది. భారీట్యాంక్ దళాలతో నాజీలు సాధించిన నైపుణ్యాన్ని ఎలా తిప్పికొట్టాలనే దానిపై విశ్లేషణ జరిగింది. మొత్తంపైన ఆధునిక యుద్ధ కాలంలో ముఖ్యాంశాలని సోవియట్ గుర్తించగలిగిందని భావించారు.

(ఇక్కడే పాశ్చాత్య దేశాలను గురించి ఒక మాట చెప్పాలి. మొదటి ప్రపంచయుద్ధంలో బాగా నష్టపోయిన బ్రిటన్, ఫ్రాన్స్‌లు చాలాకాలంగా సైనిక రంగంలో ఆత్మరక్షణ విధానాలు అనుసరిస్తూ వచ్చాయి. మేగినాట్ సరిహద్దు రేఖ వెంట శాశ్వత సైనిక దుర్గాలు నిర్మించడంపైనే కేంద్రీకరణ పెట్టారు. తమ ఆధిపత్యంలోని నానాజాతి సమితిపై ఆశలు పెట్టుకుని ఆయుధ బలగాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారు. జర్మనీ మాత్రం మొదటి ప్రపంచ యుద్ధంలో పరాజయం నుంచి పాఠాలు నేర్చుకుంది. వేగంగా శత్రు స్థావరాలను దెబ్బతీయగల బ్లిట్జ్‌క్రేగ్ (మెరుపుదాడి) పద్ధతులు పెంపొందించింది. దాని సాంప్రదాయక ఆయుధాలు అంతకు ముందే మిత్రరాజ్యాల పరమైనందువల్ల అనివార్యంగా అత్యాధునిక యంత్రాలు తయారు చేసుకోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యాన్ని సోవియట్ చక్కగా గుర్తించింది.)

ఆ సమావేశం తర్వాతిరోజున భారీఎత్తున వ్యూహాత్మక యుద్ధ విన్యాసం జరిగింది. జర్మనీ దాడిచేస్తే పశ్చిమ సరిహద్దుప్రాంతంలో తలెత్తే పరిస్థితిని విశ్లేషించుకోడమే ఈ విన్యాసాల ఉద్దేశం. ఈ విన్యాసంలో జుకోవ్ నీలం (పశ్చిమ) వైపు, పావలావ్ ఎరుపు (తూర్పు)వైపు వున్నారు. 'ఎరుపు'పై 'నీలం' దాడి చేసింది. ఈ విన్యాసంలో అనూహ్యమైన

నిజానికి హిట్లర్ మాటలపట్ల స్టాలిన్‌కు ఏనాడూ నమ్మకంలేదు. అందుకే ఆయన యుద్ధానికి దేశాన్ని సిద్ధంచేస్తూనే వచ్చాడు. దేశంలో ప్రణాళికాబద్ధమైన పారిశ్రామిక ప్రగతిని వేగిరం చేశారు. జర్మనీతో అనివార్య పరిస్థితులలో కుదుర్చుకొన్న ఒప్పందం వల్ల లభించిన వ్యవధిని స్టాలిన్ సైనిక ఉత్పత్తులు ఉధృతం చేసేందుకు వినియోగించాడు. కీలకమైన రక్షణరంగ ఫ్యాక్టరీలలో కేంద్రకమిటీ తరపున అనుభవజ్ఞులైన కార్యకర్తలను, ప్రముఖ నిపుణులను పంపించాడు.

పరిస్థితులు ఎదురయ్యాయి. ఇందులో చాలాభాగం తర్వాత నిజమైనాయి.

ఈ విన్యాసం ముగిశాక స్టాలిన్ సాధారణ సమీక్ష చేశారు. ఆయనతోసహా అగ్రనాయకత్వమంతా వుండగా సైనికదళాధికారి మెరెత్కొవ్ తన అంచనాలు చెప్పాడు. స్టాలిన్ "ఎరుపు" పక్షం ఓటమికి కారణాల గురించి వేసిన ప్రశ్నలకు అతనిదగ్గర జవాబు లేదు. "ఇవన్నీ యుద్ధాలలో జరుగుతుంటాయి అని ఇచ్చిన జవాబు స్టాలిన్‌కు సంతృప్తి కలిగించలేదు. ఎక్కువ ట్యాంకులతోపాటు ఎక్కువ నైతికస్థయిర్యం కలిగివున్న పక్షమే యుద్ధంలో జయిస్తుంది అంటూ ఆయన చర్చ ముగించాడు.

1941 ఫిబ్రవరి 1న స్టాలిన్ జుకావ్‌ను తన కార్యాలయానికి పిలిపించి ఆయనను సైనికదళ ప్రధానాధికారిగా నియమించాలని పొలిట్‌బ్యూరో నిర్ణయించినట్లు చెప్పాడు. తాను ఫీల్డ్ కమాండర్‌ను మాత్రమేనని, ఇందుకు సంబంధించిన అనుభవం లేదని జుకోవ్ నిరసన తెల్పాడు. స్టాలిన్ అంతా విని, ఈ నియామకం పొలిట్‌బ్యూరో నిర్ణయమని తెగేసి చెప్పాడు.

పైకి పెద్ద పరిణామాలు లేకున్నా జర్మనీతో ఉద్రిక్తతలు పెరుగుతున్న స్థితిలో బోల్షివిక్‌పార్టీ అఖిలయూనియన్ 18వ మహాసభ 1941 ఫిబ్రవరి 15-20 తేదీలలో జరిగింది. రక్షణ వ్యూహాన్ని చర్చించింది. మార్చి 1న జర్మనీ బల్గేరియాలో ప్రవేశించి నాజీ స్థావరంగా మార్చుకుంది. ఏప్రిల్ 6న యుగోస్లావియా ప్రజావెల్లువ జర్మన్ అనుకూల ప్రభుత్వాన్ని కూలదోసింది. కొత్త ప్రభుత్వంతో సోవియట్ సంధి చేసుకుంది. అదేరోజు జర్మనీ యుగోస్లేవియాపై యుద్ధం ప్రకటించి ఆక్రమించింది.

రిజర్వు సైన్యాలను సన్నద్ధం చేసేందుకు పిలుపునివ్వాల్సిందిగా 1941 మార్చి ప్రారంభంలో జుకోవ్ ప్రభృతులు స్టాలిన్‌ను కోరారు. ఆయన అంగీకరించలేదు. జర్మనీని కవ్వించేందుకు సాకు కల్పించకూడదని అన్నారు. చివరకు మార్చి చివరలో ఒప్పుకున్నారు. 8 లక్షల రిజర్వ్ సేనలను సరిహద్దులకు పంపారు. ఏప్రిల్‌లో మరోసారి బాల్టిక్ తీరంలో దళాలను పటిష్టంచేశారు.

మే 5న స్టాలిన్ ఎర్రసైన్యం అకాడమీలను ఉద్దేశించి ప్రసంగిస్తూ యుద్ధ సమస్యలు చర్చించాడు. జర్మన్ సైన్యం ఆధిక్యతలు, ప్రత్యేకతలు ప్రస్తావిస్తూనే అంతమాత్రాన అది అజేయం కాదని స్పష్టీకరించాడు. యుద్ధానికి సన్నద్ధత ఆయుధాలద్వారానే కాక రాజకీయంగానూ జరగాలని పిలుపునిచ్చాడు.

నిజానికి సోవియట్ చాలాకాలంగా ఆ ప్రయత్నంలోనే వుంది. యుద్ధమే జరిగితే అత్యంత అమానుషంగా, భీకరంగా వుంటుందని స్టాలిన్‌కు పూర్తిగా తెలుసు. ఫాసిస్టులు సోవియట్ కమ్యూనిస్టులపై భయానక హత్యాకాండ సాగిస్తున్నాయని, సోవియట్ ప్రజలను బానిసలుగా చేస్తారని తెలుసు. అందుకే యుద్ధ ప్రమాదాన్ని వీలైన మేరకు వాయిదావేసేందుకు ఆ సమయం సన్నాహాలకు వాడుకునేందుకు ప్రయత్నించారు. 1941 మే నాటికి సరిహద్దులలో పరిస్థితి చాలా వుద్రిక్తంగా తయారైంది. అయినా అక్కడ దళాల కదలికలకు ఆయన అనుమతి ఇవ్వలేదు. కానీ జర్మన్ దాడి అవకాశాల గురించి సమాచారం అందుకుంటూనే వున్నాడు. బ్రిటన్‌పై మరోసారి తీవ్రదాడి చేయడంతోపాటు సోవియట్‌పైనా నాజీలు దురాక్రమణ చేస్తారని ఆయనకు రెండు నివేదికలు వచ్చాయి.

1941 మార్చి 20న సోవియట్ గూఢచారి సంస్థ అధినేత జనరల్ గోలికోవ్ మే 15-జూన్ 15 మధ్య దాడి జరగవచ్చంటూ ఒక నివేదిక పంపారు. కానీ దానిలోనూ నిర్ధారణలు అందుకు విరుద్ధంగా వున్నాయి. ఇంగ్లండ్‌పై విజయంగానీ గౌరవ ప్రదమైన శాంతిసంధిగానీ జరిగిన తర్వాతే రష్యాపై దాడి జరగవచ్చునని, ఇందుకు భిన్నమైన పుకారులపై ఇంగ్లండ్, లేదా స్వయంగా జర్మనీ పంపించే తప్పుడు సమాచారం కావచ్చునని గోలికోవ్ రాశాడు. ఈ కారణంగా జర్మన్ దాడి సమయాన్ని అంచనావేయడంలో పొరపాటు జరిగిందని జుకోవ్ రాశాడు. నౌకాదళ కమాండర్ అడ్మిరల్ కుజ్నెత్సొవ్‌కూడా మే 6న అలాంటి నివేదికే పంపాడు. జర్మనీలో సోవియట్ రాయబారి డెకమ్‌జోవ్ నుంచి కూడా అదే సమాచారం వచ్చింది.

కావ్ సైనిక జిల్లా ప్రధానాధికారి నుంచి 1941 జూన్ 21న రూకావ్‌కు టెలిఫోన్ వచ్చింది. జర్మనీ సార్జంట్ మేజర్ ఒకరు సోవియట్ సరిహద్దుదాటి వచ్చి జూన్ 23 ఉదయం జర్మనీసేనలు దాడిచేస్తాయని చెప్పాడనేది ఆ ఫోన్ సమాచారం.

జుకోవ్ వెనువెంటనే స్టాలిన్‌కు, తిమెషింకోకు ఫోన్ చేశాడు. స్టాలిన్ ఇద్దరినీ క్రెమ్లిన్‌కు రమన్నాడు. వచ్చాక ఒంటరిగా కలుసుకుని జుకోవ్ నివేదిక విన్నాడు. ఇది దారి తప్పించేందుకు పంపిన సమాచారమై వుండొచ్చునని స్టాలిన్ మొదట సందేహం వెలిబుచ్చినా వారిద్దరూ అది నిజమై వుంటుందని గట్టిగా చెప్పారు. ఇంతలో మిగిలిన పొలిట్‌బ్యూరో సభ్యులు కూడా వచ్చారు. చర్చ తర్వాత లెనిన్ గ్రాడ్;, బాల్టిక్, పశ్చిమ, కౌల్, ఒడెస్సా సైసార్ జిల్లాలకు ఆయనను పంపించారు. 1941 జూన్ 22, 23 తేదీలలో జర్మన్ దాడి జరగవచ్చని అప్రమత్తంగా వుండాలని పేర్కొంటూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దాన్ని పూర్తిగా పంపించేసరికి 22వ తేదీ రాత్రి 12.30 అయ్యింది. 23 వ తేదీ తెల్లవారుజామున 4 గంటలకు ఎలాంటి యుద్ధ ప్రకటన లేకుండానే జర్మనీ సోవియట్‌పై యుద్ధం ప్రారంభించింది.

✤

యుద్ధమే జరిగితే అత్యంత అమానుషంగా, భీకరంగా వుంటుందని స్టాలిన్‌కు పూర్తిగా తెలుసు. ఫాసిస్టులు సోవియట్ కమ్యూనిస్టులపై భయానక హత్యాకాండ సాగిస్తున్నాయని, సోవియట్ ప్రజలను బానిసలుగా చేస్తారని తెలుసు. అందుకే యుద్ధ ప్రమాదాన్ని వీలైన మేరకు వాయిదావేసేందుకు ఆ సమయం సన్నాహాలకు వాడుకునేందుకు ప్రయత్నించారు.

ఉక్కుమనిషి ఉజ్వలజీవితం

(2వపేజీ తరువాయి)

ఇచ్చిన పనికి అంటిపెట్టుకుని వుండే స్వభావం. ఈ కారణంచేతనే గొప్ప సిద్ధాంత వేత్తగా పరిగణించబడకపోయినా బోల్షివిక్ పార్టీ త్రాసు ఆయనవైపు మొగ్గింది.

1917లో అక్టోబర్ విప్లవానికి రంగం సిద్ధమవుతున్నప్పుడు స్టాలిన్ సైబీరియా ప్రవాసం నుంచి అప్పుడే తిరిగి వచ్చాడు. (మిలటరీ సర్వీసుకు పనికిరాడు అని ప్రకటించి ఉండకపోతే ఆయనను బలవంతాన జారిస్టు సైన్యంలో చేర్చి వుండేవారేమో!) రాగానే ఆయన లెనిన్‌తో పాటు నిలిచాడు. లెనిన్ చుట్టూ వున్నవారిలో అంత ఖచ్చితమైన వాడు మరొకరు లేరు. లెనిన్, జినోవివ్, స్వెర్డ్‌లోవ్‌లతో పాటు ఆయన తొమ్మిది మంది గల పార్టీ కేంద్ర కమిటీకి ఎన్నికైనాడు. వారంతా దాదాపు అక్టోబర్ విప్లవ విద్రోహులుగా మారిపోయారు. వారు అనుకోకుండా అలా జరిగివుండవచ్చు. లేకపోతే లెనిన్ వారిని క్షమించి తిరిగి విప్లవ కార్యక్రమంలో పాల్గొనమని ఆహ్వానించి ఉండేవాడు కాదు కదా. ఆ మొత్తం కథను ఇక్కడ చెప్పడం సాధ్యం కాదు.

విప్లవం విజయవంతంకాగానే బోల్షివిక్ కేంద్ర కమిటీ నలుగురు సభ్యుల కమిటీని నియమించింది. లెనిన్, స్టాలిన్ ట్రాట్స్కీ, స్వెర్డ్‌లోవ్ అందులో సభ్యులు. బోల్షివిక్‌లు ఇతర వామపక్ష గ్రూపులతో ఐక్య సంఘటన ఏర్పడగానే ఐదుగురు కమీస్సార్‌లతో ఒక మంత్రివర్గం ఏర్పడింది. దానిలోపై మొదటి ముగ్గురు, మరో ఇద్దరు ఇతర వామపక్ష వాదులు సభ్యులుగా వుండేవారు. ఒక విధంగా స్టాలిన్ పార్టీలో ఏ పనైనా నిర్వహించ గలిగే వ్యక్తిగా తయారయ్యారు. పత్రిక సంపాద కీయాల నుంచి లెనిన్ రహస్య స్థావరం నిర్వహణ వరకు చూశారు. ఈ సందర్భంగా తనతో కలిసి పనిచేసిన అవాయెవ్ కూతురినే ఆయన తర్వాత పెళ్ళి చేసుకున్నారు. పార్టీ అంతర్జాతీయ లక్ష్యం నెరవేరాలంటే ఐరోపాలో విప్లవం కీలకమనేది ఆయన దృష్టిలో ఉంది. అయినా విస్తారమైన యూరో ఆసియన్ ప్రాంతాలతో అపారమైన వనరులు కలిగి ఉన్న రష్యా సోషలిజానికి సాగిపోయే మార్గానికి సిద్ధంగా ఉందని ఆయన దృఢంగా విశ్వసించారు. "ఐరోపా మాత్రమే దారి చూపగలదనే కాలం చెల్లిన భావనను వదులుకోవాలంటూ" జూలై 1917లో చేసిన ప్రసంగం ఆయనలోని ఆసియన్ అస్తిత్వాన్ని వెల్లడించింది. "మార్క్సిజంలో పిడివాద మార్క్సిజం ఉంది. సృజనాత్మకమైంది ఉంది. నేను రెండో దాన్ని ఎంచుకుంటున్నాను" అని ఆయన ప్రకటించారు. ఆయన మాటల్లో చమక్కులు లేకపోయినా తనదైన బాణీలో లెనిన్ భావాలనే వినిపించారన్నది స్పష్టం.

మొదటి సోవియట్ ప్రభుత్వంలో కీలకమైన జాతుల శాఖ స్టాలిన్‌కు అప్పగించ బడింది. తర్వాత కొంత కాలానికి కార్మిక, కర్షకులు పర్యవేక్షణ కమీషన్ నెలకొల్పబడినప్పుడు, ఆ బాధ్యత కూడా స్టాలిన్‌కే ఇవ్వబడింది. క్రమేణా ఇది మొత్తం మంత్రులందరి పనిని పర్యవేక్షించే చాలా ముఖ్యమైన శాఖగా మారింది. తర్వాత కాలంలో స్టాలిన్ బాధ్యతలు ఇంకా పెరిగాయి. 1922 ఏప్రిల్ 3న పార్టీ 11వ మహాసభ కేంద్ర కమిటీని విస్తరించింది. ప్రధాన కార్యదర్శి పదవి సృష్టించబడింది. లెనిన్ సూచనపై ఈ బాధ్యత స్టాలిన్‌కు అప్పగించారు.

అక్టోబర్ తిరుగుబాటు చాలా చిన్నది. రక్తపాత రహితమైనది. అయితే తర్వాత మూడేళ్ళ పాటు ఎడతెగని క్రూరమైన అంతర్యుద్ధాలు, విదేశీ జోక్యాలతో చీకటికమ్మింది. ఈ సమయంలో ఎర్రసేన నిర్మాతగా ట్రాట్స్కీ పేరు మారు మ్రోగిపోతున్నది. అయితే తర్వాత బ్రెస్ట్-లిటోవస్కీ సంధి సంక్షోభానికి వచ్చేసరికి ట్రాట్స్కీ కాల్పనిక విప్లవ వాదనలు బట్టబయల య్యాయి. ఆయనకు ఐరోపాలో విప్లవాన్ని గురించి గొప్ప ఆశలుండేవి. 1923లో నైతే జినావివ్‌తో కలిసి ఆయన సోవియట్ బాధ్యతలు వదిలిపెట్టి జర్మనీలో విప్లవానికి సహాయపడేందుకు వెళతా నన్నాడు. ఆ సమయంలో స్టాలిన్ జోక్యం చేసుకొని అటువంటి ముఖ్యమైన కామ్రేడ్స్‌ను పంపించలేమని తెలివిగా చెప్పాల్సి వచ్చింది. తర్వాత పరిణామా లను బట్టి చూస్తే ఇది కొంత విచిత్రంగా కన్పించ వచ్చు. పాశ్చాత్య దేశాలలో విప్లవం ప్రాధాన్యత బాగా తెలిసినప్పటికీ ముందు స్వదేశంలో చేయ వలసిన కర్తవ్యానికి స్టాలిన్ మరింత ప్రాధాన్యత నిచ్చారు.

ఎందుకంటే దేశంలో చేయవలసినవి చాలా ఉన్నాయి. అంతర్యుద్ధం, విదేశీ జోక్యం పరిస్థితిని దిగజార్చాయి. యుద్ధ కమ్యూనిజం, తర్వాత న్యూ ఎకనమిక్ పాలసీ (ఎన్.ఇ.పి) వచ్చాయి. ప్రజల పరిస్థితి కూడా చాలా దుర్భరమైంది. అయినా లెనిన్ నాయకత్వం ప్రజల విప్లవ స్ఫూర్తిని చెక్కు చెదరకుండా నిలిపింది. సంవత్సరాలపాటు తిండి, ఇంధనం, ఇతర అవసరాలకు కొరత ఏర్పడింది. అదే సమయంలోనే విదేశీ శత్రువులను, దేశీయ శత్రువులను కూడా ఎదుర్కోవలసి వచ్చింది. లెనిన్ నుంచి క్రింది స్థాయి వరకు అందరికీ - అంతంత మాత్రం రేషన్ నిర్ణయించబడింది. దేశానికే పెన్నిధులుగా భావించబడే వారికి - ఉదాహరణకు శాస్త్రజ్ఞుడు పావ్లొవ్ వంటి వారికి మాత్రం మినహాయింపు ఉండేది. ఎర్రసైన్యం కూడా కష్టాల నెదుర్కొన్నది. అయినా దేశం దృఢంగా నిలబడింది. మాస్కోలో పనిచేసిన న్యూయార్క్ టైమ్స్ విలేకరి వాల్టర్‌దురంటే 1923-34 రష్యా రిపోర్టులు అన్న పేరుతో రాసిన పుస్తకంలో ఆసక్తికరమైన ఒక ఘటన ఇది...ముఖ్యులైన కామ్రేడ్స్ అందరూ ఆయుధాలు తీసుకోవలసిన సమయం వచ్చింది. దక్షిణ రష్యాలోని జారిత్సిలో స్టాలిన్ గొప్ప కృషి చేశారు. అక్కడ శత్రు సైన్యాలను ఓడించటంతోపాటు, విప్లవ ద్రోహుల ఆటకట్టించబడింది. ఒకసారి స్టాలిన్ యుద్ధరంగంలో సైనికుల గౌరవవందనం స్వీకరిస్తున్నాడు. ఆ సందర్భంగా ఒక సైనికుడు ఆయనను చాలా కోపంగా చూశాడు. కారణం అడగ్గా మీ బూట్లు అంత తళ తళ మెరుస్తున్నాయని తమకు సరైన పాదరక్షలు లేవన్నాడు. క్షణం స్టాలిన్ తన బూట్లు అతని ఇచ్చి అతను చుట్టుకున్న పాత గుడ్డలు తాను తీసుకున్నాడు. అనుకోకుండా చేసిన ఆ పని ఈ వ్యవహారాన్ని చూడాల్సిన యుద్ధ కమిస్సార్ ట్రాట్స్కీపై అభిశంసన లాంటిదని కూడా వ్యాఖ్యలు వచ్చాయి. ఈ ఘటనను అంతటితో వదిలిపెట్టి ఉండవచ్చు. కాని ట్రాట్స్కీ తర్వాత ఆ సైనికుని పై విచారణ జరిపి కాల్చి చంపాలని ఆదేశించాడు. ఆ దశలో స్టాలిన్ జోక్యం చేసుకొని అతన్ని కాపాడవలసి వచ్చింది.

విప్లవం సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో ఊహజనితమైన అభిప్రాయాలు పెరగటాన్ని లెనిన్ అనుమతించే వారు కాదు. యుద్ధ సంక్షోభం తర్వాత ఎన్.ఇ.పి.ని ఆయన చేపట్టిన ప్పుడు విప్లవానికి ద్రోహం చేసి పెట్టుబడిదారీ విధానాన్ని పునరుద్ధరిస్తున్నాడని ఆరోపణలు వచ్చాయి. ఆ విధమైన వాగాడంబరాన్ని లెనిన్ తీవ్రంగా ఖండించారు. ఆ సమయంలో స్టాలిన్ ఇతరులు అనేక మంది వలెగాక నాయకుడితో గట్టిగా నిలబడ్డాడు. "మిగిలిన అన్ని సందర్భాల్లో లాగే విప్లవాలలో కూడా కొన్ని తెలివి తక్కువ పనులు జరుగుతాయి. విప్లవం అనే పదంలో 'వి' అక్షరాన్ని పెద్దగా రాసినంత మాత్రాన సరిపోదు. వాస్తవ పరిస్థితుల కనుగుణంగా సర్దుకోగల సృజనాత్మక కృషికి సదా సిద్ధంగా ఉండడం, అందుకవసరమైన మార్పులు చేసుకోవడం అవసరం" అని లెనిన్ చేసిన హెచ్చరికను స్టాలిన్ అందరికన్నా మిన్నగా అర్థం చేసుకున్నాడు.

ఎవరేమన్నారు?

"ఈ రెండేళ్ళ స్వల్ప వ్యవధిలోనే జార్జి డబ్ల్యు బుష్ మాకు డబ్ల్యు అంటే రాంగ్ అని బోధపడేలా చేశారు. మా పిల్లలకు రాంగ్, మా పెద్దలకు రాంగ్, మా విలువలకు రాంగ్.. రాంగ్...; రాంగ్..రాంగ్.. చివరికి అమెరికా కే రాంగ్ "

– నార్త్ కరోలినా సెనెటర్ జాన్ ఎడ్వర్డ్సు

"ఇరాక్‌పై యుద్ధం చేయాల్సివస్తే అణ్వాస్త్రాలు ఉపయోగించే అవకాశాన్ని తోసిపుచ్చలేము. తొలిగా అణ్వాస్త్రాలను ప్రయోగించరాదన్న సూత్రాన్ని మేము ఎప్పుడూ అంగీకరించబోము. "

– అమెరికా రక్షణ మంత్రి డొనాల్డ్ రమ్స్‌ఫెల్డ్.

"ఈ యుద్ధంలో టర్కీ నేరుగా జోక్యం చేసుకోవడంగానీ, పాల్గొనడం కానీ జరగదు. ఈ యుద్ధం నివారించబడాలి. శాంతి నెలకొనాలి అని నేను ప్రార్థిస్తున్నాను"

– జపాన్ పర్యటన సందర్భంగా టర్కీ ఉప ప్రధాని ఎర్టుగ్రుల్ ఎర్సిన్ బయిర్.

"యుద్ధాలు, ఘర్షణలు చివరి అవకాశంగా వుండాలి తప్ప మొదటి అవకాశంగా వుండరాదని భారత్ పదేపదే పునరుద్ఘాటిస్తున్నది"

– ఇరాక్ సంక్షోభంపై పార్లమెంటులో జరిగిన చర్చకు సమాధానమిస్తూ ఆర్థికమంత్రి జస్వంత్ సింగ్(మాస్కో పర్యటనలో వున్న విదేశాంగ మంత్రి యశ్వంత్ సిన్హా తరపున)

"ప్రపంచంపై తన ఆర్థిక, రాజకీయ, సైనిక ఆధిపత్యాన్ని రుద్దేందుకు అమెరికా చేస్తున్న ప్రయత్నాల వల్ల భారత దేశ సార్వభౌమత్వం, ఆర్థిక సార్వభౌమత్వం ప్రమాదంలో పడుతోంది. ఇరాక్‌పై అమెరికా దాడులను అంతర్జాతీయ వేదికలపై గట్టిగా వ్యతిరేకించాల్సిన భారత ప్రభుత్వం అందుకు విరుద్ధంగా అమెరికా అనుకూల ధోరణిని చేపడుతోంది."

–సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు సీతారాం ఏచూరి.

"ఏవో ఒకటీ రెండు శక్తులు తీసుకునే ఏకపక్ష నిర్ణయాల వల్ల భారత్‌తో సహా ప్రపంచంలో చాలా దేశాల ఆర్థిక వ్యవస్థలు దెబ్బ తింటాయి. అంతేకాదు దీనివల్ల విలువలు, నైతికతకు సంబంధించిన అనేక ప్రశ్నలు తలెత్తుతాయి. ఇరాక్‌ను నిరాయుధురాలిని చేయాలన్న విషయమై శాంతియుత పరిష్కారాన్ని కనుగొనాలి. అటువంటి ఏ ప్రతిపాదనైనా ఐక్యరాజ్యసమితి మద్దతును తప్పనిసరిగా పొందాలి"

–మాజీ ప్రధానులు వి.పి.సింగ్, చంద్రశేఖర్, హెచ్ డి దేవగౌడ సంయుక్త ప్రకటన.

"కార్గిల్ మీదుగా ఇస్లామాబాద్‌ను వశపరచుకోలేకపోయాము. కానీ ఇప్పుడు బాగ్దాద్ మీదుగా దాన్ని సాధించుకోగలం"

–వి హెచ్‌పి అంతర్జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ తొగాడియా.

"సద్దాం హుస్సేన్ కరడుగట్టిన నియంతే కావచ్చు. అతను లేకపోతే ఇరాకీలకు మంచిదనడంలో సందేహం లేదు. సద్దాం కన్నా ప్రమాదకారి బుష్. ఆయన లేకపోతే ప్రపంచమంతటికీ మంచిది. మరి మనం వైట్‌హౌస్ నుంచి బుష్‌ను తరిమేయడానికి బాంబులు వేద్దామా?"

–ప్రముఖ రచయిత్రి అరుంధతీ రాయ్

"నేను అంతర్జాతీయ శాంతిని కోరుకుంటున్నాను. అందుకే సామూహిక మారణాయుధాలు ఒక్క ఇరాక్ వదవనే కాకుండా మొత్తం పశ్చిమాసియాలో వున్న వాటినన్నిటినీ అలాగే ప్రపంచ వ్యాపితంగా ఇవి ఎక్కడెక్కడ వున్నాయో వాటినన్నిటినీ నాశనం చేయాలంటాను"

–లిబియా నాయకుడు కల్నల్ గడాఫీ

"కరువుతో రైతాంగం దిక్కుతోచని స్థితిలో పడి గిజగిజలాడుతుంటే బకాయిల వసూళ్లకు బకాసురునిలా ప్రభుత్వం రైతులపై విరుచుకుపడుతోంది"

–సిపిఎం రాష్ట్ర కార్యదర్శి బి వి రాఘవులు

" ఉగ్రవాదంపై పోరాటాన్ని నూతన ప్రభుత్వం పూర్తి చేస్తుంది. ఉగ్రవాద నాయకత్వాన్ని సమూలంగా తుడిచిపెడుతుంది. పాలస్తీనాలో నూతన నాయకత్వం ఏర్పడేందుకు అనువైన పరిస్థితులు సృష్టిస్తుంది. ఆ నాయకత్వం వల్లే నిజమైన శాంతి సాధ్యమవుతుంది."

–ఇజ్రాయిల్ ప్రధానిగా తిరిగి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఏరిల్ షరోన్

"ముఖ్యమంత్రి చేసేవన్నీ శంకుస్థాపనలే. పెండింగ్ ప్రాజెక్టులకు అసలు సమస్య నిధుల కేటాయింపే. ఏళ్ళు గడుస్తున్నా అది మాత్రం లేదు. నదుల్లో నీళ్ళున్నా నిధుల కేటాయింపులేదు."

– రాష్ట్ర గవర్నర్ ఎస్ఎస్ బర్నాలాతో కాంగ్రెస్ ఎంపి ఎస్ జైపాల్ రెడ్డి.

"నేను గోవు మెడపై వేటు పడకుండా కాపాడుతున్నాను. బిజెపి గోవు తోక పట్టుకుని ఎన్నికల గోదారి ఈదాలను కుంటోంది. ఓట్లు దండుకోవాలని ఆశిస్తోంది."

– మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి దిగ్విజయ్‌సింగ్

"ఆయన హిందూత్వ హిట్లర్...ఆ ప్రేలాపనలు చేష్టలు ఆయనపై పోటా ప్రయోగానికి తగుననిపిస్తున్నాయి. తొగాడియా బింద్రన్ వాలెలా దేశానికి ముప్పుగా పరిణమించకముందే ఆయన్ని పోటాకింద అరెస్టు చేయాలి."

–రాజ్యసభలో మాజీ ఆర్మీ చీఫ్ శంకర్ రాయ్ చౌదరి.

"ఇది మొత్తంగా భారత రిపబ్లిక్‌ను, రాజ్యాంగాన్ని అవమానించడమే"

–మహాత్మాగాంధీ హత్య కేసులో నిందితుల్లో ఒకరైన విడి సావర్కార్ చిత్రపటాన్ని పార్లమెంట్ సెంట్రల్ హాలులో ఆవిష్కరించడంపై సిపిఐ(ఎం).

"సిక్కులు కూడా హైందవ సమాజంలో అంతర్భాగం. ప్రత్యేక సిక్కు పంచాంగం వల్ల వారు ఏకాకులవుతారు.

– ఆర్ఎస్ఎస్ నాయకుడు కె.ఎస్. సుదర్శన్.

ఆర్ఎస్ఎస్ అధిపతికి సిక్కుల గురించి ఏమీ తెలియదు. హిందువులకు కూడా రెండు క్యాలెండర్లు వున్నాయని గ్రహించాలి.

– ఎస్‌జిపిసి అధినేత కృపాల్ సింగ్ బడంగర్.

" ఒక వైపు గొడ్డు మాంసం ఎగుమతుల ద్వారా కేంద్రం కోట్లాది డాలర్ల ఆదాయాన్ని ఆర్జిస్తోంది. దేశీయంగా ముస్లింలు గోవధకు పాల్పడుతున్నారంటూ ఇంకోవైపు నిందిస్తోంది."

– ముస్లిం గోవాంశ్ సురక్ష సమితి అధ్యక్షుడు సయీద్ ముజఫర్ ఆలీ

" అర్ధ శతాబ్ది క్రితం మర్డోక్ ఆక్స్‌ఫర్డ్‌లో ఓ అండర్‌గ్రాడ్యుయేట్ విద్యార్థి. తండ్రి నుంచి వారసత్వంగా ఆస్ట్రేలియాలోని ఓ ప్రాంతీయ పత్రిక తనకు సంక్రమించింది. అటువంటి వ్యక్తి నేడు న్యూస్ కార్పొరేషన్ సిఇఓ అయ్యాడు. ఆయన ఇప్పుడు 4,700కోట్ల డాలర్ల ఆస్తులకు యజమాని. టీవి నెట్‌వర్కు, వార్తా పత్రికలు, మ్యాగజైన్లు, పుస్తకాలు, సినిమాలు, ఇలా మీడియాలో ఆయన ప్రవేశించని రంగం లేదు. మీడియా మొఘల్‌గా తిరుగులేని గుత్తాధిపత్యం చలాయిస్తున్న మర్డోక్ ఇప్పుడు శాటిలైట్ కింగ్ అని అనిపించుకోవాలని తెగ ఉబలాటపడిపోతున్నాడు."

–ఫార్చ్యూన్ మ్యాగజైన్ వ్యాఖ్య

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KRSA101M273
పుస్తకం పేరు	ప్రజాశక్తి
తారీఖు	23 February 2025
ముందు అట్ట	free
వెనుక అట్ట	free
మొత్తం పేజీలు	29
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	[illegible]
పేజీలు విడదీసినది	Srinivas
స్కాన్ చేసినది	akshaya
పరీక్ష చేసినది	ROHITH
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good